www.manatelangana.news

Mana Telangana

# మన తెలంగాణ

హైదరాబాద్ | సంపుటి 6 | సంచిక: 197 | శనివారం | 6 జనవరి, 2018

...అక్షరం సాక్షిగా ఇది ప్రజల పక్షం

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

పేజీలు: 12 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00



చర్చలకు కిమ్ సమ్మతి 11

# రైతుకు మద్దతు నిధి

## ఎకరాకు రూ.4 వేలకు అదనంగా వ్యవసాయ బడ్జెట్‌లో కేటాయింపు

### పెట్టుబడి సాయం అందించే విధానంపై, సాగు, సాగేతర భూములు గుర్తించేందుకు పోచారం ఆధ్వర్యాన మంత్రివర్గ ఉపసంఘం

### మద్దతు ధరపై కేంద్రం మరింత ఉదారంగా వ్యవహరించాలి : సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు

**మన తెలంగాణ/** హైదరాబాద్ : రైతులకు పెట్టుబడిగా అందించే నిధులతో పాటు, మద్దతు అందించడం కోసం కొంత నిధిని ఈ ఏడాది నుంచి వ్యవసాయానికి ప్రవేశపెట్టె ప్రత్యేక బడ్జెట్‌లో పెడుతామని ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు ప్రకటించారు. రైతులకు వ్యవసాయ పెట్టుబడి మద్దతు పథకం ఈ ఏడాది నుంచే అమలవుతుందని, మే 15వ తేదీ నాటికి ఎకరానికి రూ.4వేల చొప్పున మొదటి విడత పెట్టుబడి రైతులకు అందిస్తామన్నారు. వ్యవసాయ పెట్టుబడి మద్దతు పథకాన్ని ఎలా అమలు చేయాలి? రైతులకు డబ్బులు నేరుగా అందివ్వాలా? బ్యాంకుల ద్వారా అందివ్వాలా? సాగు చేస్తున్న భూములను గుర్తించడం ఎలా? ఏ ప్రాతిపదికన పెట్టుబడి అందించాలి? తదితర అంశాలను అధ్యయనం చేయడానికి వ్యవసాయం శాఖమంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించారు. ఈ కమిటీలో మంత్రులు ఈటల రాజేందర్, టి. హరీశ్‌రావు, తుమ్మల నాగేశ్వర్‌రావు, జి. జగదీశ్‌రెడ్డి, పి.మహేందర్‌రెడ్డి సభ్యులుగా ఉండనున్నారు. అలాగే వివిధ రాష్ట్రాల్లో వివిధ పంటలకు మద్దతు ధర ఇచ్చే విషయంలో ఎలాంటి విధానం పాటిస్తున్నారో అధ్యయనం చేయడానికి అధికారులు మహారాష్ట్ర, కర్ణాటక లాంటి రాష్ట్రాల్లో పర్యటించాలని సిఎం పేర్కొన్నారు. మార్కెటింగ్ శాఖమంత్రి హరీశ్‌రావు నాయకత్వంలో అధికారుల బృందం దేశ వ్యాప్తంగా మద్దతు ధరలకు సంబంధించిన విధానాలను అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలన్నారు. ప్రగతి భవన్‌లో సిఎం కెసిఆర్ వ్యవసాయ, మార్కెటింగ్ అధికారులతో వ్యవసాయ పెట్టుబడి మద్దతు పథకంపై శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సమన్వయ సమితుల ద్వారా ప్రభుత్వమే నేరుగా రైతుల నుంచి పంటలను కొనుగోలు చేసి, తిరిగి అమ్మాలన్నారు. ఇలా చేయడం వల్ల ఏమైనా నష్టం వస్తే కూడా ప్రభుత్వమే భరించాలని చెప్పారు. రాష్ట్రంలో పండిన ప్రతీ పంట మార్కెట్ నెట్‌లోకి వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని సిఎం అధికారులను ఆదేశించారు. రైతులను ఆదుకోవడానికి అవసరమైన చర్యలు తీసుకునేందుకు నిధుల కొరత లేదని సిఎం స్పష్టం చేశారు. వ్యవసాయాన్ని అభివృద్ధి చేయడానికయ్యే ఖర్చును ముందే అంచనా వేసి, బడ్జెట్లో పొందుపరుస్తామని, దీనివల్ల నిధుల సమస్య రాదన్నారు. పంటలకు చీడ,

తరువాయి 6లో





## 29 నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు

### ఫిబ్రవరి 1న కేంద్ర బడ్జెట్

**న్యూఢిల్లీ :** ఈనెల 29 నుండి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభంకానున్నాయి. ఫిబ్రవరి 1న కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ లోక్‌సభలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. జనవరి 29 నుంచి ఫిబ్రవరి 9 వరకు మొదటి విడత బడ్జెట్ సమావేశాలు, మార్చి 5 నుంచి ఏప్రిల్ 6 వరకు రెండవ విడత సమావేశాలు జరగనున్నాయని పార్లమెంటరీ వ్యవహారాల శాఖమంత్రి అనంతకుమార్ అధికారికంగా ప్రకటించారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల మొదటి రోజున రాష్ట్రపతి రామనాథ్ కోవింద్ పార్లమెంటులోని రెండు సభలనుద్దేశించి ప్రసంగిస్తారు. అదే రోజున ఆర్థిక సర్వేను ప్రవేశపెడతారని అనంత్‌మార్

తరువాయి 6లో

ఖైదీల క్షమాభిక్షకు రంగం సిద్ధం: నేడో, రేపో ఉత్తర్వులు 3

అసెంబ్లీ సీట్ల పెంపుపై త్వరలో నిర్ణయం 3 సంక్రాంతి నాటికి స్పష్టత



## విఆర్ఏ కాదు

### అక్కడ ఇసుక క్వారీలు లేవు

### మృతుడు సాయిలు విఆర్ఏ కాదు

### కారేగాం వద్ద 'మాఫియా' ట్రాక్టర్ కింద వ్యక్తి చనిపోయిన ఘటనపై కామారెడ్డి కలెక్టర్ వివరణ

**మన తెలంగాణ/** కామారెడ్డి : కారేగాం గ్రామంలో బుధవారం రాత్రి ట్రాక్టర్ ఢీకొని విఆర్ఎ మృతి చెందిన ఘటనపై కలెక్టర్ సత్యనారాయణ, ఎస్‌పి శ్వేతారెడ్డిలు శుక్రవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని జనహిత సమావేశ మందిరంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పలు దినపత్రికల్లో వచ్చిన కథనాల ఆధారంగా పిట్లం మండలంలోని కారేగాం గ్రామంలో

తరువాయి 6లో



## రాజ్‌భవన్‌లో రభస?

3లో

### గవర్నర్‌తో కాంగ్రెస్ నేతల వాగ్వాదం



నరసింహన్‌కు వినతి పత్రం ఇస్తున్న కాంగ్రెస్ నాయకులు

## విద్యుత్ విషయంలో మోసం చేస్తున్న కాంగ్రెస్, టిఆర్ఎస్

**మన తెలంగాణ**/హైదరాబాద్: విద్యుత్ ఉత్పత్తి విషయంలో కాంగ్రెస్, టిఆర్ఎస్‌లు ప్రజలను మోసం చేస్తున్నాయని బిజెపి అధికార ప్రతినిధి రఘునంధరావు ఆరోపించారు. రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తికి, వినియోగానికి మధ్య 7.5 శాతం వ్యత్యాసం ఉన్నదని, విద్యుత్ ఉత్పత్తి గణంకాలను స్పష్టం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ 2014 మే 2 నాటికి 18వేల 482 గ్రామాలకు విద్యుత్ లేదని, బిజెపి ప్రభుత్వం వచ్చిన తర్వాత 2015 నాటికి 15వేల 182 గ్రామాలకు విద్యుత్‌ను సరఫరా చేశామన్నారు. బొగ్గు ఘనులను బహిరంగ వేలం వేసి రాష్ట్రాలకు లాభాలు మిగిల్చిందని, ఉదయ్ పథకం రాష్ట్రానికి రూ 12వేల 400 కోట్ల రూపాయలను మిగిల్చిందని వివరించారు. మోడి ప్రభుత్వం సోలార్, పవన విద్యుత్‌ను ప్రోత్సహిస్తోందన్నారు. రాష్ట్రంలో యాదాద్రి, భద్రాద్రితో పాటు ఎన్‌టిపిసిలో అదనంగా నాలుగు వేల మెగావాట్ల ఉత్పత్తికి అనుమతిచ్చిందని పేర్కొన్నారు. లగడపాటి రాజగోపాల్ 8రూపాయలకు, టిపిసిసి అధ్యక్షులు రూ.10లకు ఒక యూనిట్ చొప్పున విద్యుత్‌ను ప్రభుత్వానికి విక్రయిస్తున్నారని వివరించారు. దేశంలో 21 రాష్ట్రాలు తెలంగాణ కంటే ముందే మిగులు విద్యుత్ రాష్ట్రాలుగా ఉన్నాయన్నారు.



## వసూళ్లకు పాల్పడితే ఫిర్యాదు చేయండి

### విద్యార్థులకు ఇంటర్ బోర్డు

**మనతెలంగాణ**/హైదరాబాద్ : ఇంటర్ ప్రాక్టికల్స్‌లో మంచి మార్కులు వేసేందుకు కళాశాలలు విద్యార్థుల నుంచి అధిక మొత్తంలో నగదు వసూలు చేస్తున్నట్లు తమ ఫిర్యాదులు అందాయని ఇంటర్ విద్యామండలి కార్యదర్శి ఎ.అశోక్ తెలిపారు. ఏ కళాశాల యాజమాన్యం అయినా, ప్రిన్సిపల్ అయినా ప్రాక్టికల్ మార్కుల పేరుతో వసూళ్లకు పాల్పడితే తమకు ఫిర్యాదు చేయాలని, అలాంటి కళాశాలలపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రాక్టికల్ మార్కుల కోసం విద్యార్థులుగానీ, తల్లిదండ్రులు కళాశాలలకు ఎలాంటి ఫీజులు చెల్లించవద్దని, అలా ఎవరైనా డిమాండ్ చేస్తే సంబంధిత జిల్లా డిఐఇఒకు ఫిర్యాదు చేయాలని తెలిపారు.

# ఈసారి జిఎస్‌టి బడ్జెట్

- ఆ దిశగా రూపకల్పనకు ఆర్థికశాఖ కసరత్తు
- ఫిబ్రవరి మూడవ వారంలో బడ్జెట్ సమర్పణ



**మన తెలంగాణ** / హైదరాబాద్ : ఇంతకాలం రూపొందించిన బడ్జెట్‌లకు ఈసారి సమర్పించబోయేది భిన్నంగా ఉండబోతుంది. ఈ బడ్జెట్ వ్యాట్ విధానానికి బదులుగా జిఎస్‌టి ఆధారితంగా ఉండనుంది. ఫిబ్రవరి మూడవ వారంలో సమర్పించే అవకాశం ఉంది. జిఎస్‌టి అమల్లోకి వచ్చిన తర్వాత ఈ తరహాలో రూపొందించడం అన్ని రాష్ట్రాలకూ ఇదే తొలి అనుభవం కాబట్టి మన రాష్ట్ర ఆర్థికశాఖ అధికారులు సైతం ఈ దిశగా కసరత్తు చేస్తున్నారు. జిఎస్‌టి ద్వారా సమకూరే ఆదాయ అంచనాలకు అనుగుణంగా బడ్జెట్‌లో రెవిన్యూను పేర్కొనాల్సి ఉంటుందని అధికారులు వ్యాఖ్యానిస్తున్నారు. ఫిబ్రవరిలోనే బడ్జెట్ సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నందువల్ల గతేడాది జూలైలో జిఎస్‌టి అమలులోకి వచ్చినప్పటి నుంచి జనవరి చివరి వరకు ఏడు నెలల వ్యవధిలో మన రాష్ట్రానికి ఏ మేరకు ఆదాయం వచ్చిందో దాని సగటు ఆధారంగా తాజా బడ్జెట్‌లో రెవిన్యూ లెక్కలు ఉండబోతున్నాయి. ఇంతకాలం అనుసరించిన విధానం ప్రకారమైతే... రానున్న ఆర్థిక సంవత్సరానికి ఏయే సంక్షేమ పథకాలు, అభివృద్ధి ప్రాజెక్టులకు ఎంత ఖర్చు చేయాలని ప్రభుత్వం భావిస్తుందో దానికి అనుగుణంగా ఆదాయ వనరులకు గల మార్గాలపై దృష్టి పెట్టేది. ఆ ప్రకారం వ్యాట్, సేల్స్ టాక్స్... లాంటి పన్నుల్ని పెంచడం ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకునేది. కానీ జిఎస్‌టి విధానంలో అది సాధ్యం కాదు కాబట్టి ఒకవేళ కొత్త పథకాలకు ఖర్చు చేయాలనుకున్నా ఆదాయ మార్గాలు అంతంతమాత్రంగానే ఉంటాయని అధికారుల అభిప్రాయం. ఈ పరిమితులను దృష్టిలో పెట్టుకుని జిఎస్‌టి ఆధారిత బడ్జెట్‌ను రూపొందించడంపై దృష్టి పెట్టినట్లు అధికారులు వ్యాఖ్యానించారు. వ్యాట్ రూపంలో రాష్ట్రానికి వచ్చే ఆదాయం కంటే జిఎస్‌టి రూపంలో వచ్చే ఆదాయం కొంత తక్కువే. ఈ పరిస్థితుల్లో జిఎస్‌టి వసూళ్ళను పెంచుకునే ఉద్దేశంతో 15% మేర అదనపు ఆదాయాన్ని పరిగణనలోకి తీసుకుని బడ్జెట్‌లో ప్రస్తావించే అవకాశం ఉంది. ఈసారి బడ్జెట్ అంచనాలు 25% పెరగవచ్చని ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ ఇటీవల వ్యాఖ్యానించినప్పటికీ జిఎస్‌టి విధానం ప్రకారం తయారయ్యే ఈ బడ్జెట్‌లో ఆ మేరకు పెరుగుదల ఉంటుందా అనేది సందేహంగా మారింది. వచ్చేది ఎన్నికల సంవత్సరం కాబట్టి దాదాపు ఎన్నికల బడ్జెట్‌గా, సంక్షేమ బడ్జెట్‌గా ఉండబోతుంది. రాష్ట్రం పరిధిలో ఉన్న పెట్రోలియం ఉత్పత్తులు, ఎక్సయిజ్ లాంటివాటిపై పన్నును పెంచినట్లయితే ప్రజలపై అది ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉంది కాబట్టి ఓటుబ్యాంకును దూరం చేసుకోకుండా ఉండేందుకు ప్రభుత్వం వీటి జోలికి పోయే సాహసం చేయకపోవచ్చు. ఇక ఆదాయ మార్గాలు అంతంతమాత్రంగానే ఉన్నందువల్ల బడ్జెట్ రూప కల్పనలో కొంత ఆచితూచి వ్యవహరించాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. ప్రస్తుతం కొనసాగుతున్న పథకాలకు బడ్జెట్ కేటాయింపులతో పాటు ప్రజలను ఆకర్షించే పథకాలకు అవసరమయ్యే నిధుల్ని ఏ రకంగా ప్రభుత్వం సమకూర్చు కుంటుందనేది ఆసక్తికరంగా మారింది. అటు పన్నులు పెంచకుండా, ఇటు జిఎస్‌టి ఆదాయంలో గణనీయ పెరుగుదల లేకుండా ఆకర్షణీయ పథకాలను రూపొందించినట్లయితే నిధుల సమీకరణకు ఉన్న ఇతర మార్గాలపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ నెల 8వ తేదీకల్లా అని విభాగాల నుంచి బడ్జెట్ ప్రతిపాదనలను పంపాల్సిందిగా ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి ఇప్పటికే సర్క్యులర్‌ను జారీచేసినందువల్ల గతేడాదితో పోలిస్తే ఏ మేరకు బడ్జెట్ అంచనాలు పెరుగుతాయనేది అప్పటికి స్పష్టత వస్తుంది. ప్రధాన కార్యదర్శి సైతం అదే రోజున అన్ని విభాగాల కార్యదర్శులతో సమావేశాన్ని ఏర్పాటు చేయడం గమనార్హం. ఈ ప్రతిపాదనలకు అనుగుణంగా తయారయ్యే బడ్జెట్‌ను నోట్‌ను పరిశీలించిన తర్వాత సిఎం కెసిఆర్ ఏ తరహాలో ఉండాలన్నదానిపై దిశానిర్దేశం చేయనున్నట్లు సమాచారం.

## 22నుంచి పులులు, వన్యప్రాణుల గణన

**మన తెలంగాణ**/హైదరాబాద్: దేశ వ్యాప్తంగా పులులు, వన్యప్రాణుల లెక్కింపు ప్రక్రియలో భాగంగా తెలంగాణలో ఈ కార్యక్రమం ఈ నెల 22 నుంచి మొదలు కానున్నట్లు అటవీ సంరక్షణ ప్రధాన అధికారి పి.కె.ఝూ తెలిపారు. అడవులు, వన్యప్రాణుల రక్షణతోనే పర్యావరణ సమతుల్యత ఆధారపడి ఉందని, అందుకే ప్రతి నాలుగేళ్లకోసారి లెక్కింపు సర్వేను చేపడుతున్నామన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మొదటిసారి పులుల లెక్కింపు జరుగుతోందన్నారు. సచివాలయంలో శుక్ర వారం ఈ సర్వేకు సంబంధించిన ఏర్పాట్లపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా అటవీ అధికారులతో ఆయన సమీక్ష జరిపారు. సర్వేను నైపుణ్యం ఉన్న అటవీ అధికారి పర్యవేక్షణలో చేపట్టాలని, సిబ్బంది కొరత ఉంటే విద్యార్థులు, వాలంటీర్ల సహకారం తీసుకోవాలని పి.కె ఝూ సూచించారు. హరితహారంలో భాగంగా మొక్కల రక్షణ చర్యలను కూడా ఆయన సమీక్షించారు. నర్సరీల నిర్వహణలో వైఫల్యం, నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అటవీ, గిరిజన ప్రాంతాల్లో కనీస సౌకర్యాలను, రోడ్లు, విద్యుత్ సదుపాయం కల్పించే చర్యలకు అటవీ శాఖ అధికారులు సహకరించాలన్నారు. రాష్ట్రంలో సుమారు 440 గ్రామాలు అటవీ అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నట్లు గుర్తించామని, బీడీ ఆకుల సేకరణ కోసం అడవికి వెళ్ళి నిప్పు పెట్టేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఫిబ్రవరి నుంచి మే నెలాఖరు వరకు అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ఈ నెల10న కాళేశ్వరం ప్రాజెక్ట్ ప్రాంతాన్ని అటవీ అధికారుల బృందం పర్యటించనుందని తెలిపారు.

# నేడు నేరెళ్లకు పాదయాత్ర

- సిద్ధిపేట నుంచి ప్రారంభం, పాల్గొననున్న చాడ, తమ్మినేని, కోదండరామ్

మన తెలంగాణ / హైదరాబాద్ : నేరెళ్ళ బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ వామపక్షాలు, టిజెఎసి, టిపిఎఫ్ శుక్రవారం ఉదయం సిద్ధిపేట నుంచి నేరెళ్లకు పాదయాత్రను నిర్వహించనున్నారు. తొలుత సికింద్రాబాద్ క్లాక్ టవర్ వద్ద ఉదయం 7:30 గంటలకు అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పిస్తారు. అనంతరం నేరుగా సిద్ధిపేట చేరుకుని ఉదయం 10 గంటలకు అక్కడి నుంచి నేరళ్లకు పాదయాత్ర ప్రారంభిస్తారు.మఖ్దుంభవన్‌లో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి, సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, తెలంగాణ జెఎసి అధికార ప్రతినిధి జి.వెంకట్‌రెడ్డి, వామపక్షాలు నాయకులు కె.రమ (సిపిఐ(ఎంఎల్) న్యూడెమాక్రసీ), జె.జానకిరాములు (ఆర్ఎస్‌పి), చలపతిరావు (సిపిఐ(ఎంఎల్) న్యూడెమాక్రసీ), సిహెచ్.మురహరి (ఎస్‌యుసిఐసి), రవి చంద్ర (టిపిఎఫ్) పాల్గొన్నారు. రాష్ట్రంలో ఇసుక మాఫియా ఆగడాలు పెరిగిపోతున్నాయని, నేరెళ్ల లాంటి ఘటనలు పునరావృతమైతే టిఆర్ఎస్ ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించక తప్పదని వారు హెచ్చరించారు. ఇసుకపై ప్రభుత్వం అఖిలపక్షం ఏర్పాటుచేసి, ఇసుక విధానంపై వెంటనే ప్రభుత్వం విధానం ప్రకటించాలని కోరారు. ఎస్‌సి వర్గీకరణ కోసం ఉద్యమిస్తున్న మందకృష్ణ అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు.

**సాయిలు కుటంబాన్ని ఆదుకోవాలి** : కామారెడ్డి జిల్లా పిట్లంలో ఇసుక మాఫియా ట్రాక్టర్‌తో సాయిలును తొక్కించి చంపిన ఘటనను వామపక్షాలు, తెలంగాణ జెఓఎసి, టిపిఎఫ్ నాయకులు తీవ్రంగా ఖండించారు. సాయిలు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగాన్ని ఇవ్వాలని, కుటుంబానికి రూ.50 లక్షల ఆర్థిక సహాయాన్ని అందించాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా చాడ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ పిట్లంలో విఆర్‌ఏ హత్య సంఘటన రాష్ట్రంలో ఇసుక మాఫియా అరాచకాలకు పరాకాష్ట అన్నారు. ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్న విఆర్ఎను ట్రాక్టర్‌తో తొక్కి చంపించడం దారుణమన్నారు. ఇసుక రవాణతో ఆదాయం పెరిగిందని మంత్రి కెటిఆర్ ప్రకటించారని, ఆదాయం పెరిగిందా, తగ్గిందా అనేది సమస్య కాదని, ఈ వ్యాపారం పేరుతో అమాయకులను చంపుతారా అని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఇలాంటి చర్యలను మానుకోనట్లయితే మరిన్ని ప్రజా ఉద్యమాలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఎస్‌సి వర్గీకపణపై అసెంబ్లీలో ఏకగ్రీవంగా తీర్మానం చేసిన ప్రభుత్వం కేంద్రం వద్దకు అఖిలపక్షం తీసుకెళ్ళడంలో నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ నేరళ్లలో అగ్రకుల ఆధిపత్యంతో దళితులపై దాడి చేశారని ఆయన విమర్శించారు. మందకృష్ణపై పాత కేసులు తిరగతోడి జైల్లో పెట్టడం అప్రజాస్వామికమన్నారు. ప్రశ్నించే హక్కును అనిచివేయడం ద్వారా పాలన చేయవచ్చని కెసిఆర్ భ్రమ ఎల్లకాలం సాగదన్నారు. శాతవాహన ప్రొఫెసర్ సూరేపల్లి సుజాతపై అసభ్య ప్రచారం, విద్యార్థులపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తెలంగాణ జెఎసి అధికార ప్రతినిధి వెంకటరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వం నియంతృత్వ దాడి చేస్తోందన్నారు. నేరెళ్ళ ఘటనపై రాష్ట్రపతిని కలిసినా ఫలితం లేకుండా పోయిందన్నారు. ప్రజా సమస్యలపై ప్రతిపక్షాలు, ప్రజాసంఘాలతో కలిసి సమైక్యంగా ఉద్యమిస్తామన్నారు. తెలంగాణలో సిఎం కెసిఆర్ వ్యవస్థలన్నింటినీ గుప్పెట్లో పెట్టుకున్నారని, ఈ చర్యలను ప్రతిఘటిస్తూ ఉద్యమిస్తామని జానకి రాములు అన్నారు. రాష్ట్రంలో ప్రజాస్వామిక హక్కులను కాలరాస్తున్నారని కె.రమ అన్నారు.



### జనవరి 8 నుంచి 12 వరకు హైదరాబాద్‌లో

## దక్షిణ భారత సైన్స్‌ఫెయిర్

- ప్రారంభోత్సవానికి డిప్యూటీ సిఎం, ముగింపుకు గవర్నర్ హాజరు : జి.కిషన్



**మనతెలంగాణ**/హైదరాబాద్ : జనవరి 8 నుంచి 12 వరకు హైదరాబాద్‌లో జరుగనున్న సదరన్ ఇండియన్ సైన్స్ ఫెయిర్(ఎస్ఐఎస్ఎఫ్) 2018 ప్రారంభోత్సవానికి ఉపముఖ్యమంత్రి, విద్యాశాఖ కడియం శ్రీహరి ముఖ్యఅతిథిగా హాజరవుతారని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ జి.కిషన్ తెలిపారు. ముగింపు వేడుకలకు గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహాన్ హాజరవుతారన్నారు. శుక్రవారం పాఠశాల విద్యాశాఖ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన ఎస్ఐఎస్ఎఫ్ వివరాలు వెల్లడించారు. ఈ నెల 8 వరకు 12 వరకు సికింద్రాబాద్‌లోని సెయింట్ ప్యాట్రిక్స్ హైస్కూల్‌లో ఎస్ఐఎస్ఎఫ్‌ను ఆరు రాష్ట్రాలు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కేరళ, తమిళనాడు, కర్ణాటక, పుదుచ్చేరిల నుంచి ఎగ్జిబిట్స్‌ను ప్రదర్శిస్తారన్నారు. ఐదు రోజుల పాటు జరుగనుంది. పాఠశాల విద్యార్థులు సైన్స్ ఫెయిర్‌ను సందర్శించడానికి ఏర్పాట్లు చేశామని చెప్పారు. ఎస్ఐఎస్ఎఫ్‌ను సందర్శించాలనే ఆసక్తి గల పాఠశాలలు హైదరాబాద్ జిల్లా విద్యాధికారిని సంప్రదించాలని తెలిపారు.

**2019--20 నుంచి ఆన్‌లైన్ ప్రవేశాలు :** వచ్చే విద్యాసంవత్సరం కాకుండా ఆ తర్వాతి విద్యాసంవత్సరం నుంచి ఆన్‌లైన్‌లో స్కూల్ అడ్మిషన్స్ నిర్వహిస్తామని కమిషనర్ వెల్లడించారు. 2018–19 నుంచి ఆన్‌లైన్ ప్రవేశాలు ప్రారంభించాలని అనుకున్నా, అందుకు అన్ని స్కూళ్లు సిద్ధంగా లేవని చెప్పారు. ఈ విద్యాసంవత్సరం కొన్ని పాఠశాలలు వారి సొంత వెబ్‌సైట్ల ద్వారా ఆన్‌లైన్‌లో ప్రవేశాలు నిర్వహించి ప్రక్రియ ముగిసిన తర్వాత యుడైస్ కోసం తమకు లింక్ ఇస్తారని చెప్పారన్నారు. ఈ సమావేశంలో ఎస్‌సిఇఆర్‌టి డైరెక్టర్ శేషుకుమారి తదితరులు పాల్గొన్నారు.

# 'నో బ్యాగ్ డే'

## వచ్చే విద్యాసంవత్సరం నుంచి నెలకోసారి అమలు?

**మనతెలంగాణ**/హైదరాబాద్ : బడి పిల్లల బ్యాగు బరువును తగ్గిస్తూ ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేసిన విద్యాశాఖ నెలలో ఒకసారి ' నో బ్యాగ్ డే'ను అమలు చేసే విషయాన్ని పరిశీలిస్తోంది. విద్యార్థుల బ్యాగు బరువు మోత నుంచి ఉపశమనం కల్పించేందుకు ఇతర రాష్ట్రాలలో అమలవుతున్న విధానాలను విద్యాశాఖ అధ్యయనం చేస్తోంది. కర్ణాటకలో నెలకోసారి నో బ్యాడ్ డే విధానం అమలవుతుండటంతో మన రాష్ట్రంలో ఇది నిర్వహిస్తే ఎలా ఉంటుందనే అంశాన్ని పరిశీలిస్తోంది. నో బ్యాగ్ డే నెలకోసారి నిర్వహించాలా..? లేక వారానికోసారి నిర్వహించాలా..? అని నిపుణులతో సంప్రదింపులు జరుపుతున్నారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి రాష్ట్రంలో కూడా నో బ్యాగ్ డే అమలయ్యే అవకాశం కనిపిస్తోంది.

**మోత బరువుతో ఆరోగ్య సమస్యలు :** ప్రతి రోజు బండెడు పుస్తకాలను మోస్తున్న పిల్లలను చూసి అయ్యో పాపం అనుకుంటాం. చదు వేమోగానీ పిల్లల బరువు కంటే పుస్తకాల బరువే ఎక్కువగా ఉంటోం దంటూ తల్లిదండ్రులు వాపోతుంటారు. బండెడు పుస్తకాలు మోసే విద్యార్థుల్లో ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని వైద్యులు చెబుతున్నారు.తల,మెడ,మోకాళ్లపై భారం పడుతుందని పేర్కొంటున్నారు. పిల్లలకు బ్యాగు బరువు లేకుండా చూడాలని సూచిస్తున్నారు.



**ప్రత్యామ్నాయాల పరిశీలన :** విద్యార్థులు పుస్తకాల మోత లేకుండా బ్యాగు బరువు తగ్గించేందుకు అవకాశం ఉన్న ఇతర ప్రత్యామ్నాయాలను విద్యాశాఖ పరిశీలిస్తుం ది. ప్రతి స్కూల్‌లో విద్యార్థులు ర్యాక్‌లు లేదా షెల్ఫ్‌లు కేటాయించడం ద్వారా చాలా వరకు బ్యాగు బరువును తగ్గించే అవకాశం ఉంటుంది. ఇప్పటికే కొన్ని స్కూళ్లు ఈ విధానాన్ని అనుసరిస్తుండగా, అన్ని స్కూళ్లలో అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు ర్యాక్‌లు, షెల్ఫ్‌లు కేటాయించడం ద్వారా ప్రతి రోజు అన్ని పుస్తకా లు, నోట్‌బుక్స్ ఇంటికి తీసుకెళ్లే అవసరం ఉండదు. హోంవర్క్‌కు అవసరమైన పుస్తకాలను తీసుకెళ్తే సరిపోతుంది.

మన తెలంగాణ
3
హైదరాబాద్
శనివారం
6, జనవరి 2018
www.manatelangana.news



## గడువులోగా మిషన్ భగీరథ పూర్తికి ఆదేశం

**మన తెలంగాణ**/హైదరాబాద్: సంగారెడ్డి, మెదక్, జుక్కల్ నియోజక వర్గాల్లోని మిషన్ భగీరథ పనుల్లో జరుగుతున్న జాప్యంపై ఆర్‌డబ్ల్యూఎస్ ఇఎన్‌సి సురేందర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయని కంపెనీల అగ్రిమెంట్లను రద్దు చేసి వాటి స్థానంలో వేరే కంపెనీలను బాధ్యతలను అప్పజెబుతామని ఆయన హెచ్చరించారు. ముందుగా మెదక్, నిజామాబాద్ జిల్లా ప్రజానీకానికి తాగునీటిని సరఫరా చేసేందుకు మెదక్ జిల్లా పుల్కల్ మండలం పెద్దారెడ్డిపేట దగ్గర సింగూరు రిజర్వాయర్‌లో నిర్మించిన ఇంటెక్‌వెల్ పనులను తనిఖీ చేశారు. ఈ ఇంటెక్‌వెల్ లో మోటార్లను బిగించి ట్రయల్ రన్‌ను నిర్వహిస్తున్నారు. పూర్తి స్థాయిలో మోటార్లు బిగించడంలో ఆలస్యం జరుగుతుతుండడం పట్ల మంత్రి సదరు ఏజెన్సీ సంస్థ ప్రతినిధులను మందలించారు. త్వరలోనే ఈ పనులు పూర్తి కావాలన్నారు. జుక్కల్ నియోజకవర్గంలో మిషన్ భగీరథ పనులు ఆలస్యంగా జరుగుతుండడాన్ని పరిశీలించిన ఆయన సివిల్ పనులు నిదానంగా కొనసాగడం పట్ల అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఇలా అయితే బాన్సువాడ, నిజామాబాద్‌లకు నీటిని సరఫరా చేసేదెన్నడు? కనీసం ఎలక్ట్రో మెకానికల్ పనులు కూడా ఇంకా ప్రారంభించలేదేంటి? అని ప్రశ్నించారు. సంగారెడ్డి నియోజకవర్గంలో నీటి శుద్ధి ప్లాంటును, ఇంటెక్‌వెల్ పనులను ఆయన పరిశీలించారు.

# రాజ్‌భవన్‌లో రభస?

- గవర్నర్‌తో కాంగ్రెస్ నేతల వాగ్వాదం
- నరసింహన్ దృష్టికి ఇసుక మాఫియా, మందకృష్ణ అరెస్టు అంశాలు

**మన తెలంగాణ**/హైదరాబాద్: గవర్నర్ ఇఎస్‌ఎల్ నరసింహన్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుల మధ్య తీవ్ర స్థాయిలో వాగ్వాదం చోటు చేసుకుంది. ఇసుక మాఫియా ఆగడాలు, కామారెడ్డిలో జిల్లాలో సాయిలు మృతి తదితర అంశాలపై గవర్నర్‌కు ఫిర్యాదు చేసేందుకు టిపిసిసి అధ్యక్షుడు ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శాసనసభలో ప్రతిపక్ష నాయకులు కె.జానారెడ్డి, మండలిలో ప్రతిపక్ష నాయకులు మహ్మద్‌అలీ షబ్బీర్‌లు శుక్రవారం రాజ్‌భవన్‌కు వెళ్లారు. వారితో పాటు కాంగ్రెస్ నేతలు డి.కె.అరుణ, సర్వే సత్యనారాయణ, అంజన్‌కుమార్‌యాదవ్, దానం నాగేందర్, పొంగులేటి సుధాకర్‌రెడ్డి, సంపత్‌కుమార్, శ్రవణ్ తదితరులు కూడా ఉన్నారు. కాంగ్రెస్ నేతలు తెలియజేసిన వివరాల ప్రకారం తొలుత గవర్నర్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసి కొత్త సంవత్సరంలో ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. తరువాత కాంగ్రెస్ నాయకులు ఇసుక మాఫియా ఆగడాలు, పిట్లంలో సాయిలు మృతి గురించి వివరిస్తుండగా, తప్పుడు సమాచారం ఇస్తున్నారని గవర్నర్ అన్నట్లు తెలిసింది. చనిపోయిన వ్యక్తి విఆర్ఎ కాదని, ఇసుక విషయంలో సిఎంను, మంత్రిని ఇష్టమొచ్చినట్లు ఆరోపణలు చేయడం సరి కాదన్నారు. అయినా రాజకీయ నాయకులకు అక్కడేమి పని, గతంలో ఇసుక మాఫియా లేదా? అని వ్యాఖ్యానించినట్లు సమాచారం. దీనిపై ఉత్తమ్, సర్వే సత్యనారాయణలు తీవ్రంగానే స్పందించారు. గవర్నర్ మాకు డిక్టేట్ చేయాల్సిన అవసరం లేదని ఉత్తమ్ అన్నారు. 'మీరు మాకు చెప్పాల్సిన అవసరం లేదు, మేం పిల్లలం అనుకుంటున్నారా? మీరు హెడ్ మాస్టరా? మీరు గవర్నర్.. ఆ హోదాకు తగ్గట్లు మాట్లాడాలే తప్ప సిఎం, ఆయన కుమారుడిని వెనుకేసుకొస్తారా? అని సర్వే సత్యనారాయణ ఘాటుగా అన్నారు. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన గవర్నర్ లేచి వెళ్లేందుకు ఉద్యుక్తుడవగా, మళ్లీ సర్వే మాట్లాడుతూ మందకృష్ణను అరెస్టు చేస్తే ఏం చేశారు, ఆయన ఇంట్లో దీక్ష చేస్తే అరెస్ట్ చేస్తారా? అని ప్రశ్నించారు. ఉత్తమ్ కల్పించుకొని గాంధేయవాద పద్ధతిలో ఇంట్లో దీక్ష చేసిన వ్యక్తిని అరెస్టు చేయడమేమిటన్నారు. దీనికి గవర్నర్ స్పందిస్తూ శాంతి భద్రతల సమస్య వస్తుందనే నివేదికల కారణంగానే అరెస్టు చేసి ఉంటారని, తాను ఈ విషయంపై నివేదిక తెప్పించుకుంటున్నట్లు తెలిసింది. మళ్లీ సర్వే మాట్లాడుతూ 'సోనియాగాంధీ, మన్మోహన్ వల్లే మీరు ఈ కుర్చీలో కూర్చున్నారు. అది మర్చిపోవద్దు. అధికార పార్టీ కార్యకర్తలా మాట్లాడుతావా? నీదగ్గరకు రావడమే వృథా' అని అన్నారు. ఆయనను ఎందుకు అదుపు చేయడం లేదని గవర్నర్ తీవ్రస్థాయిలో కాంగ్రెస్ నేతలను అన్నట్లు తెలిసింది. ఒక దశలో సర్వేను ఉద్దేశించి ఫెలో అని అనగా, మల్లు రవి ఆక్షేపణ వ్యక్తం చేశారు. తామంతా చదువకున్నవాళ్ళమని ఫెలో అనడమేమిటని అంటుండగా ఇతర నాయకులు ఆయనను సముదాయించారు. చివరకు అటు గవర్నర్, ఇటు కాంగ్రెస్ నాయకులు కోపంతో దర్బార్ హాల్ నుంచి నిష్క్రమించారు.

### ఇసుక అక్రమాలపై విచారణ జరపాలి : ఉత్తమ్

గవర్నర్ దృష్టికి సిరిసిల్ల, కామారెడ్డి జిల్లాలో ఇసుక మాఫియా ఆగడాల విషయం, ఎంఆర్‌పిఎస్ నాయకులు మందకృష్ణ దీక్షకు అనుమతివ్వకపోవడం, అరెస్టు చేయడం వంటి విషయాలను గవర్నర్ దృష్టికి తీసుకెళ్ళినట్లు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అనంతరం మీడియాకు తెలిపారు. సిరిసిల్లలో దళితుల మీద థర్డ్ డిగ్రీ ప్రయోగం జరిగితే ఎస్‌పి మీద ఎందుకు ఎఫ్‌ఐఆర్ నమోదు చేయలేదని ప్రశ్నించామన్నారు. రాష్ట్రంలో ఇసుక మాఫీయా నడుస్తోందని, ఇది రాష్ట్రానికి, పర్యావరణానికి తీరని నష్టమన్నారు. పిట్లంలో సాయిలు ఇసుక ట్రాక్టర్ వల్లే చనిపోయాడని, ఆ గ్రామానికి ఎవరినీ ఎందుకు రానీయడం లేదని గవర్నర్ దృష్టికి తీసుకెళ్ళినట్లు చెప్పారు. అంతర్జాతీయ విషయాలపై ట్విట్టర్‌లో స్పందించే కెటిఆర్ సొంత శాఖలో జరుగుతోన్న ఘోరాలపై ఎందుకు స్పందించరని ప్రశ్నించారు. ఇసుక విషయంలో ఎందుకు నిబంధనలు పాటించడం లేదని, కింది స్థాయి అధికారులను బెదిరిస్తున్నారన్నారు. గాంధేయమార్గంలో మందకృష్ణ దీక్ష చేస్తే అరెస్టు చేయడమేమిటని ప్రశ్నించారు. పిట్లంలో సాయిలు మృతికి కారణమైన ఇసుక కాంట్రాక్టర్‌పై హత్యా కేసు నమోదు చేయాలని, సాయిలు కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. నేరెళ్ల ఇసుక బాధితులకు న్యాయం చేయాలని, ఇసుక అక్రమాలపై ఎసిబితో విచారణ జరపాలన్నారు. ఇసుక విధానంపై నిపుణులు, అఖిలపక్ష నేతలతో సమీక్షించాలని కోరారు.



## కెటిఆర్‌తో ఫ్రెంచ్ రాయబారి భేటీ

**మన తెలంగాణ**/హైదరాబాద్: ఫ్రెంచ్ దేశ రాయబారి అలెగ్జాండర్ జిగ్లర్‌తో ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి కెటిఆర్ శుక్రవారం హైదరాబాద్‌లో భేటీ అయ్యారు. తెలంగాణ ప్రభుత్వ పనితీరు గురించి చాలా సాగనుకూల అంశాలను విన్నట్లు మంత్రికి ఈ సందర్భంగా రాయబారి తెలిపారు. భారత్, ఫ్రెంచ్ దేశాల మధ్య శతాబ్దాలుగా సాంస్కృతిక సంబంధాలున్నాయని, ఇప్పటికీ చాలా మంది ఫ్రెంచ్ జాతీయులు నగరంలో ఉన్నారన్నారు. అనేక ఫ్రెంచ్ కంపెనీలు నగరంలో తమ కార్యకలాపాలు కొనసాగిస్తున్నాయని, హైదరాబాద్ మెట్రో రైల్ కార్యకలాపాల్లోనూ ఫ్రెంచ్ కంపెనీ ఒక భాగస్వామిగా ఉందని రాయబారి కెటిఆర్‌కు తెలిపారు. టి హబ్ కార్యకలాపాలను ప్రస్తావిస్తూ బోర్డో నగరంతో కలిసి హైదరాబాద్‌లో మొబిలిటీ అంశంపై సహకారం అం దించేందుకు తమ సహకారం అందిస్తామన్నారు. ట్రామ్ రవాణా సౌకర్యం ఏర్పాటు చేసుకునేందుకు ఉన్న అవకాశాలను పరిశీలిస్తామన్నారు. త్వరలోనే 50మంది ఫ్రెంచ్ పెట్టుబడిదారుల బృందం తెలంగాణలో పర్యటించనుందని, వివిధ రంగాల్లో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను పరిశీలిస్తుందని ఆ దేశ రాయబారి వెల్లడించారు. దీనికి మంత్రి కెటిఆర్ స్పందిస్తూ ఫ్రెంచ్ కంపెనీలకు, పెట్టుబడి దారులకు అనుసంధాన కర్తగా పనిచేసేందుకు తమ ప్రభుత్వం ఎప్పుడు సిద్ధంగా ఉంటుందని హామీ ఇచ్చారు. కెటిఆర్‌తో పాటు ఈ సమావేశంలో ఫ్రెంచ్ కాన్సులేట్ జనరల్ , పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి సంస్థగా న్యాక్ : తుమ్మల

**మన తెలంగాణ**/ హైదరాబాద్: యువత కు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించే ఏ జెన్సీగా జాతీయ నిర్మా ణ సంస్థ (న్యాక్)ను తీర్చిదిద్దాలని రోడ్లు భవ నాల శాఖ మంత్రి తు మ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. జిల్లాల్లో ఉన్న న్యాక్ కేంద్రాలనూ మరింత బలోపేతం చేయాలన్నారు. న్యాక్‌లో శిక్ష ణ తీ సుకున్న యువతకు దేశ విదేశాల్లో ఉద్యోగాలు కల్పించేలా చూడాల న్నారు. సచివాలయంలో శుక్రవారం ఈ మేరకు ఆర్ అండ్ బి శాఖ ముఖ్య కార్యదర్శి సునీల్ శర్మ, న్యాక్ డైరెక్టర్ జనరల్ కె. భిక్షపతి, ఆర్ అండ్ బి చీఫ్ ఇంజనీర్ లింగయ్య తదితరులతో కలిసి మంత్రి తుమ్మల సమీక్ష జరిపారు. 1997 నుంచి ఇప్పటివరకు న్యాక్ సంస్థ 3.76 లక్ష ల మందికి శిక్షణ ఇచ్చిందన్నారు. భవన నిర్మాణ రంగంలో రాష్ట్రంలో 40,174 మంది ఇప్పటి వర కు నైపుణ్య శిక్ష ణ పొందినట్లు తెలిపారు. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఈ సంస్థ మరింత క్రియాశీలకంగా పని చేస్తోందని, ఇప్పటివరకు 7959 మందిని తీర్చిదిద్దిందన్నారు.

## క్రీడా శాఖ కార్యదర్శిని కలిసిన మాదాసు



**మన తెలంగాణ**/ హైదరాబాద్: అర్జున అవార్డు గ్రహీత, ప్రస్తుత భారత పార ఒలింపిక్స్ సభ్యులు, మాదాసు శ్రీనివాస రావుకు అవసరమైన సహాయ సహకారాలను అందించాలని క్రీడా శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం సంబంధిత అధికారులను అదేశించారు. మాదాసు శ్రీనివా స రావు శుక్రవారం సచివాలయంలో తెలంగాణ బుర్రా వెంకటేశం ను కలసి వినతి పత్రం సమర్పించారు. కరీంనగర్ కు చెందిన శ్రీనివాస రావు దివ్యాంగుల విభాగంలో 2003 లో అర్జున అవార్డును పొందారు. ప్రస్తుతం మూడు చక్రాల మోటారు వాహనం లేకపోవడంతో అవసరాలకు బయటకు వెళ్లటానికి ఇబ్బంది పడుతున్నట్లు కార్యదర్శికి వివరించారు. సానుకూలంగా స్పందించిన వెంకటేశం సహాయం అందించాలని అధి కారులను ఆదేశించారు.

### మంత్రి లక్ష్మారెడ్డిని కలిసిన శాంతికుమారి

వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శిగా నియమితులైన శాంతి కుమారి, ఆ శాఖ మంత్రి డాక్టర్ సి. లక్ష్మారెడ్డిని శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. పదవీ బాధ్యతలు తీసుకున్న అనంతరం మంత్రితో కొద్దిసేపు సమావేశమయ్యారు.

## విద్యార్థినులకు లెక్చరర్ వేధింపులు

**మన తెలంగాణ**/జహీరాబాద్: విద్యార్థినులను లైంగిక వేధిస్తున్న లెక్చరర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా జహీరాబాద్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కెమిస్ట్రీ లెక్చరర్‌గా పనిచేస్తున్న శ్రీనివాస్ విద్యార్థినులపై అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడు. ఈ విషయాన్ని విద్యార్థినులు పలుమార్లు కళాశాల ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకుపోయినా పట్టించుకోకపోవడంతో తల్లిదండ్రులకు మొరపెట్టుకున్నారు. శుక్రవారం విద్యార్థినుల తల్లిదండ్రులు కళాశాలకు చేరుకుని ఆందోళన చేశారు. ఈ విషయాన్ని తెలుసుకున్న శాడిస్టు లెక్చరర్ శ్రీనివాస్ అక్కడి నుంచి పరారయ్యాడు. చివరకు ప్రిన్సిపాల్ సుమలత విషయాన్ని పోలీసులకు సమాచారం అందించడంతో వారు వచ్చి లెక్చరర్‌కు ఫోన్ చేసి కళాశాలకు రప్పించారు. లెక్చరర్‌ను ప్రిన్సిపాల్ పోలీసులు శ్రీనివాస్ ను స్టేషన్‌కు తరలించారు.

## టిఆర్‌టి దరఖాస్తుల్లో సవరణకు ఛాన్స్

**మన తెలంగాణ**/హైదరాబాద్: ఉపాధ్యాయ నియామక పరీక్ష (టిఆర్‌టి) దరఖాస్తుల్లో సవరణలకు టిఎస్‌పిఎస్‌సి అవకాశం కల్పించింది. ఈ నెల 8 నుంచి 11 వరకు ఎడిట్ ఆప్షన్ ద్వారా మార్పులు చేసుకోవాలని తెలిపింది. టిఆర్‌టి దరఖాస్తుకు ఈ నెల 7వ తేదీతో గడువు ముగియనుంది.

# గడ్డాలు పెంచితే గబ్బర్‌సింగ్‌లు కాలేరు

- తప్పుడు వార్తలు చూపి కాంగ్రెస్ నాయకులు గవర్నర్‌ను కలిశారు
- ఐటి మంత్రి కెటిఆర్

**మన తెలంగాణ**/హైదరాబాద్: ట్రాక్టర్ కింద పడి చనిపోయిన వ్యక్తి విఆర్‌ఎ కాదని, తప్పుడు వార్తను చూసి కాంగ్రెస్ నాయకులు గవర్నర్‌ను కలిశారని మంత్రి కెటిఆర్ ఎద్దేవా చేశారు. గడ్డాలు పెంచుకున్న వారు సన్నాసులు అవుతారు తప్ప అధికారంలోకి రారని, గడ్డాలు పెంచుకుంటే గబ్బర్ సింగ్‌లు కాలేరని పిసిసి అధ్యక్షులు ఉత్తమ్ కుమార్ రెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. గుజరాత్‌లో అందరూ ఏకమైనా అక్కడ కాంగ్రెస్ అధికారంలోకి రాలేకపోయిందని, తెలంగాణలోనూ ఎప్పటికీ రాదన్నారు. తెలంగాణ భవన్‌లో మంత్రులు కెటిఆర్, పోచారం శ్రీనివాస్‌రెడ్డిల స మక్షంలో బాన్సువాడ టిడిపి నేత భోజ్యానాయక్, ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, కాంగ్రెస్ నేత తాన్ సింగ్‌లు శుక్రవారం టిఆర్‌ఎస్‌లో చేరా రు. ఈ సందర్భంగా మంత్రి కెటిఆర్ మాట్లాడు తూ కాంగ్రెస్‌పై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. 55 ఏళ్లు దరిద్రపు గొట్టు పార్టీకి అధికారం ఇచ్చామన్నారు. సేవాలా ల్ జ యంతి చేయాలన్న సోయే లేదని, సమ్మక్క సార క్క జాతరకు రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి స్థాయి వ్యక్తు లను తీసుకురాలేదని చెప్పారు. కాని కలిసొచ్చే కాలానికి నడిచొచ్చే కొడుకన్నట్లు కెసిఆర్ వచ్చి ఆ పని చేశారన్నారు.

### 9వేల మెగావాట్ల ఉత్పత్తి..

తెలంగాణ వచ్చాక 4700 మెగావాట్ల స్థాపిత విద్యుత్ అందుబాటులో ఉంటే, దానిని 9వేలకు పెంచి 14వేల మెగావాట్లు చేశామని, సుమారు 9 వేల మెగావాట్లు తామే ఉత్పత్తి చేశామని కెటిఆర్ తెలిపారు. గుజరాత్ కంటే ఎక్కువగా 3వేల మెగావాట్ల సోలార్ విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నామన్నారు. కాంగ్రెస్ నాయకులు అధికారంలో ఉన్నప్పుడు ఇవ్వడం చేతగాక ఎక్కడికెళ్లి విద్యుత్ వచ్చిందంటూ ప్రశ్నిస్తున్నారని ఎద్దేవా చేశారు.మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ రాజకీయం అనేది భగవంతుడు ఇచ్చిన బ్రహ్మాస్త్రమని, దాన్ని పేద ప్రజల సేవకే వినియోగించాలన్నారు. తనకు ఉన్నత కులాలు ఎప్పుడూ మద్దతివ్వలేదని, గిరిజనులు, దళితులు, బలహీన వర్గాల ప్రజలే తనకు అండగా నిలిచారన్నారు. టిఆర్‌ఎస్‌లో చేరిన భోజ్యానాయక్ మాట్లాడుతూ టిఆర్ ఎస్ ని ఇంటి పార్టీగా భావించి ఇందులో చెరుతున్నామన్నారు. ఫిబ్రవరి 15న బంజారాల ఆరాధ్యదైవం సేవాలాల్ జయంతి రోజును ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని కోరారు.

## ఖైదీల విడుదలకు సిఎం గ్రీన్ సిగ్నల్

- క్షమాభిక్షపై త్వరలో నిబంధనలు జారీ

**మన తెలంగాణ**/హైదరాబాద్: జీవిత ఖైదీలకు శుభవార్త. ఖైదీల క్షమాభిక్షపై త్వరలో ప్రభుత్వం నిబంధనలు జారీ చేయనుంది. ఈ మేరకు రాష్ట్ర సచివాలయంలో ఖైదీల విడుదలపై హోంశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ రాజీవ్ త్రివేది, లా కమిషనర్ చైర్మన్, జైళ్ల శాఖ డిజి వికె సింగ్, ఐజి ఆకుల నరసింహ నేతృత్వంలో మూడు గంటల పాటు చర్చ జరిగింది. మరో రెండు, మూడు రోజుల్లో ఖైదీల విడుదల కోసం ఉత్తర్వులు జారీ కానున్నాయి. విధి విధానాలను మార్గదర్శకాలను విడుదల చేయనున్నట్లు తెలిసింది. జనవరి 26 గణతంత్ర దినోత్సవం రోజున ఖైదీలకు క్షమాభిక్ష కింద విడుదల చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తుంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి ఇంత వరకు ఖైదీలకు క్షమాభిక్ష ప్రసాదించలేదు. అర్హులైన ఖైదీలకు క్షమాభిక్ష ప్రసాదిస్తామని టిఆర్ఎస్ పార్టీ ఎన్నికల హామిలో చెప్పింది. ఐదు సంవత్సరాల వాస్తవిక శిక్ష, రెండు సంవత్సరాల రిమిషన్ కలిపి గతంలో కంటే ఇప్పుడు మార్గదర్శకాలను భిన్నంగా ఉంటాయని తెలిసింది.

# అసెంబ్లీ సీట్ల పెంపుపై త్వరలో నిర్ణయం

- సంక్రాంతి నాటికి స్పష్టత



**మన తెలంగాణ**/హైదరాబాద్: తెలంగాణ, ఏపీ రాష్ట్రాల్లో అసెంబ్లీ సీట్ల సంఖ్య పెంపుదలపై సంక్రాంతి నాటికి స్పష్టత వచ్చే అవకాశం ఉంది. పెరుగుతాయా లేవా అనేదానిపై అప్పటికి ప్రధాన మంత్రి కార్యాలయం వివరణ ఇచ్చే అవకాశం ఉంది. ఒకవేళ సీట్ల సంఖ్యను పెంచాలనే నిర్ణయం తీసుకున్నట్లయితే దానికి అనుగుణంగా ఈ నెల 17వ తేదీన జరిగే కేంద్ర మంత్రివర్గ సమావేశానికి నోట్ వెళ్తుంది. జనవరి 29 నుంచి ప్రారంభమయ్యే బడ్జెట్ సమావేశాల్లోనే దీనికి సంబంధించిన బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టే అవకాశం ఉందని తెలిసింది. ఇప్పటికే ప్రధాని నరేంద్రమోడీ సీట్ల సంఖ్యను పెంచడానికి అనుకూలంగా సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకున్నారని, దానికి అనుగుణంగా బిల్లును రూపొందించాల్సిందిగా కేంద్ర హోం శాఖ కార్యదర్శికి సమాచారం పంపినట్లు తెలిసింది. తెలంగాణ గతంలో చేసిన విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్న ప్రధాని జనవరి 15కల్లా తేల్చేద్దాం అనే సంకేతం ఇచ్చినట్లు తెలిసింది. దీన్ని దృష్టిలో పెట్టుకునే అప్పటివరకూ వేచి చూద్దామని ఎంపిలకు కెసిఆర్ వివరించినట్లు తెలిసింది. ఈ అంశం గురించి అప్పటివరకూ ప్రస్తావించవద్దని కూడా స్పష్టం చేసినట్లు తెలిసింది. ''సీట్లను పెంచాలన్న ప్రతిపాదన పునర్ వ్యవస్థీకరణ చట్టంలోనే ఉంది. కేంద్రం తన బాధ్యతగా అమలు చేయాలి. సీట్లు పెంచితే సంతోషిస్తాం. పెంచకుంటే తమ పార్టీకి పెద్దగా ఇబ్బందేం లేదు'' అని స్వయంగా సిఎం కెసిఆర్ ఢిల్లీలోనే పాత్రికేయులతో ముచ్చటించే సందర్భంగా స్పష్టం చేశారు. అందువల్ల ఈ అంశాన్ని పదేపదే ప్రధాని దగ్గరా, కేంద్ర మంత్రుల దగ్గరా ప్రస్తావించాల్సిన అవసరం లేదని ఎంపిలకు సూచించారు. అయితే ఆంధ్రప్రదేశ్ మాత్రం ఈ అంశాన్ని ప్రధాని దగ్గర శుక్రవారం ప్రస్తావించింది. తెలుగుదేశం పార్టీ ప్రతినిధి బృందం ప్రధానికి శుక్రవారం సమర్పించిన 30 అంశాల వినతిపత్రంలో 28వ అంశంగా అసెంబ్లీ సీట్ల పెంపుదలను పేర్కొనింది. చంద్రబాబు, ప్రధాని మధ్య అసెంబ్లీ సీట్ల అంశంపై త్వరలోనే సంప్రదింపులు జరిగే అవకాశం ఉందని టిడిపి ఎంపీలు వెల్లడించారు. ఒకవేళ ప్రధాని సీట్లసంఖ్య పెంపుకు సానుకూల నిర్ణయం తీసుకుంటే, ఫిబ్రవరి మొదటివారంలోనే పార్లమెంటు ఆమోదం తెలిపితే, ఆరు నెలల్లో కేంద్ర ఎన్నికల సంఘం 'డిలిమిటేషన్' ప్రక్రియను ప్రారంభించి పూర్తి చేస్తుంది. అన్నీ అనుకున్నట్లుగా జరిగితే సెప్టెంబరు కల్లా డిలిమిటేషన్ పూర్తవుతుంది. అసెంబ్లీ సీట్ల సంఖ్య పెంపుపై ప్రధాని తీసుకునే రాజకీయ నిర్ణయం 'సస్పెన్స్' మరో పది రోజుల్లో తేలిపోనుంది.


## 2018-19 సంక్షేమ నామ సంవత్సరం


- ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్

**మన తెలంగాణ**/ హైదరా బాద్: వచ్చే ఆర్థిక 2018– 19 సంవత్సరం 'సంక్షేమ నామ' సంవత్సరమని ఆర్థి క శాఖ మంత్రి ఈటల రా జేందర్ అన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలంద రికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందిస్తుందన్నారు. సచివాలయంలో శుక్రవారం బిసి సంక్షేమంపై మంత్రులు సమావేశమయ్యారు. ఈ సమావేశంలో మంత్రులు జోగు రామన్న, తలసాని శ్రీనివాస్‌యాదవ్, జి.జగదీశ్‌రెడ్డి, ఆజ్మీర చందూలాల్‌తో పాటు అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఈటల రాజేందర్ మాట్లాడుతూ విద్యపరంగా సిఎం కెసిఆర్ విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో బ్యాంకుల సహకారం అందించకపోవడంతోనే పేదలకు అందించే పథకాలు కాగితాలకే పరిమితమయ్యాయని, దళారులే లబ్ధిపొందేవారని పేర్కొన్నారు. గతంలో జరిగిన పొరపాట్లు, తప్పులను గుర్తించిన సిఎం కెసిఆర్ అందుకు భిన్నంగా బ్యాంక్‌లతో సంబంధం లేకుండా నేరుగా లబ్ధిదారుడికే డబ్బు అందేలా ప్రణాళికలను రూపొందిస్తున్నారని చెప్పారు. ఇప్పటికే గొల్ల కురుమలు, మత్స్యకారులకు ప్రభుత్వం తరఫున పెద్ద ఎత్తున సాయం అందుతోందని వివరించారు. బిసిలలోని కులాలను అభివృద్ధి చేసేందుకు మంత్రి జోగురామన్న అధ్యక్షతన 50సార్లు ప్రత్యేక సమావేశాలు జరిగాయని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అన్ని కులాల సంఘాలతో సమావేశమై చర్చించి నివేదికను సిద్ధం చేశామని, దీనిని సిఎం కెసిఆర్‌కు త్వరలోనే సమర్పించనున్నామని మంత్రి ఈటల తెలిపారు.

# క్రైస్తవులపై దాడులు చేస్తే ఊరుకోం

**హోం మంత్రి నాయిని నర్సింహారెడ్డి**



**మన తెలంగాణ**/హైదరాబాద్ : క్రైస్తవులపై దాడులు చేస్తే ఊరుకునేది లేదని, అలాంటి వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర హోంశాఖ మంత్రి నాయిని నర్సింహారెడ్డి హెచ్చరించారు. క్రిష్టియన్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ పెరేడ్ గ్రౌండ్స్‌లో జరిగిన జాతీయ, రాష్ట్ర ప్రార్థనా దినోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మనది లౌకిక దేశం. ఇక్కడ అందరూ స్వేచ్ఛ గా బతికే హక్కు ఉంది. హిందువులు, ముస్లింల మాదిరి గానే క్రైస్తవులకు సంఘటితం కావడంలో తప్పు లేదు. ప్రార్థనలు చేసుకోవడం, దేవుని ప్రేమని ప్రకటించుకోవచ్చు. క్రైస్తవులు శాంతి కాముకులు. ఎవరి జోలికి వెళ్లని వారు. విద్య, వైద్యం తదితర సేవలను అందిస్తున్నారు. కలిసి సేవలందిద్దామని ఆయన అన్నారు. అలాంటి క్రైస్తవు లను కొంతమంది ఉద్దేశ్యపూర్వకంగా ఇబ్బంది పెట్టే యత్నాలు చేస్తున్నారు. అలాంటివి సహించే ప్రసక్తే లేదని నాయిని స్పష్టం చేశారు. స్వచ్ఛభారత్ అంటే కేవలం రోడ్లపై శుభ్రత మాత్రమే కాదని, మనసులోనూ శుద్ధీకరణ చెందాలని అన్నారు. క్రైస్తవులు యేసుక్రీస్తు బోధించినట్టు పాపులను రక్షించే కార్యక్రమాన్ని కొనసాగిద్దామన్నారు. ఏసయ్య అండ మనకుండగా ఎవ్వరేమి చేయలేరని హోం మంత్రి అన్నారు. మూడున్నర సంవత్సరాల పాలనలో ఎక్కడా దుస్సంఘటనలు జరగలేదన్నారు. క్రైస్తవులకు ఏ సమస్య వచ్చినా ఆదుకునేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. అర్ధరాత్రి అయినా అందుబాటులో ఉంటామని హామి ఇచ్చారు. జిహెచ్‌ఎంసి మేయర్ బొంతు రామ్మోహన్ మాట్లాడుతూ, యేసుక్రీస్తు ప్రబోధించిన నిన్నువలే నీ పొరుగు వానిని ప్రేమించుము అన్న సూక్తిని ఆచరణలో పెడుతున్న సిఎం కెసిఆర్ నిజమైన దైవ సేవకుడని అన్నారు. దేశంలోనే నిజమైన లౌకిక రాష్ట్రంగా నిలబెట్టిన క్రైస్తవులపై దాడులు జరగకుండా నిరోధించి నిజమైన ప్రేమను కనబరిచారన్నారు. ఫుడ్ కమిషన్ సభ్యులు ఆనంద్ మాట్లాడుతూ, క్రైస్తవ్యం భారతదేశానికి 2000 సంవత్సరాల క్రితమే వచ్చిందన్నారు. కొంతమంది చరిత్ర తెలియని వారు క్రైస్తవ్యం బ్రిటీష్ పాలనతో వచ్చిందని, మరికొంత అమెరికా మతమంటూ ప్రజలను రెచ్చగొడుతున్నారన్నారు.

### మతమార్పిడి అపోహ మాత్రమే : బిషప్ ఎ.సి.సాలమన్

రెండు శతాబ్దాలుగా విద్య, వైద్యం తదితర సామాజిక సేవా కార్యక్రమాలను అందించిన క్రైస్తవులను మతమార్పిడి రంగు పులిమి అవమానిస్తారా అని మెదక్ చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియా బిషప్ ఎ.సి.సాలమోన్ ప్రశ్నించారు. క్రైస్తవుల జనాభా నేటికి 2 శాతం మిం చలేదని, నిజం గా క్రైస్తవులే మతమార్పిడి చేసి ఉంటే జనాభా ఇంత తక్కువగా ఉండేదా అని ఆయన ప్రశ్నించారు. మతమార్పిడి జరుగుతుం దనడం కేవలం అపోహ మాత్రమేనని ఆయన స్పష్టం చేశారు. స్వచ్ఛభారత్ అంటే కేవలం ఊడ్వడం మాత్రమే కాదని, సిఎం గొప్ప నాయకుడని, చాలా హామీలిచ్చారని, అయినా ఇంకా ఇబ్బందులు తప్పడం లేదన్నారు. క్రిష్టి యన్ భవన్‌కు తమకు ప్రభుత్వ స్థలమే కావాలని, ఆ స్థలం మనుషులు వెళ్లే చోట ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎంఎల్‌సి, సిసిటి ఛీఫ్ ప్యాట్రన్ డి. రాజేశ్వర్‌రావు మాట్లా డుతూ, చరిత్రలో తొలిసారి క్రైస్తవులంతా ఒక్కతాటిపైకి వచ్చి ప్రార్థనా దినోత్సవంలో పాల్గొనడం సంతోషకరమ న్నారు. కార్యక్రమంలో జాంబియా దేశపు మంత్రి గాడ్ ఫ్రే, మాజీ ఉప ముఖ్యమంత్రి టి. రాజయ్య, మల్కాజ్‌గిరి ఎంపి మల్లారెడ్డి, కంటోన్మెంట్ ఎంఎల్‌ఎ జి.సాయన్న, మహబూబ్‌నగర్ ఎంఎల్‌ఎ వి. శ్రీనివాస్‌గౌడ్, టిఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు గజ్జల నగేశ్, జిహెచ్‌ఎంసి కో ఆప్షన్ మెంబర్ డా. విద్యాస్రవంతి, సిసిటి నాయకులు బిషప్ రూబెన్ మార్క్, బిషప్ జాన్ గొల్లపల్లి, రెవరెండ్ వై.మో హన్‌బాబు, రెవరెండ్ కె.ఎం.జాన్, వివిధ చర్చీల బిషప్‌లు, పాస్టర్లు, సంఘ పెద్దలు, క్రైస్తవులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

### దేశానికి దైవాశీర్వాదం అవసరం

భారత దేశానికి, తెలంగాణకు దైవాశీర్వాదం అవసరమని ఏంజెల్ మినిస్ట్రీస్ (యుఎస్ఎ) వ్యవస్థాపక డైరెక్టర్ డా. బిల్లి గ్రహం కుమార్తె డా. అన్ని గ్రహమ్ లట్జ్ అన్నారు. కార్యక్రమంలో గౌరవ అతిథిగా పాల్గొన్న అన్ని తన తండ్రికి, తనకు ప్రపంచంలోనే భారత దేశమంటే అమితమైన ఇష్టమన్నారు. దేవునికి చేసే ప్రార్థన దేశాల్లో పరిస్థితులను మార్చాయని, బైబిల్‌లోని దానియేలు తదితర దైవభక్తి పరులు చేసిన ప్రార్థనలు వివిధ దేశాల్లో పరిస్థితులను ఎలా మార్చాయో ఆమె వివరించారు. విశ్వాసంతో చేసే ప్రార్థనలు ఫలితాల నిస్తాయన్నారు.

కుంచెపోటు



రేపు రేపనే వాయిదాలు శిక్షలో భాగమేనా, శిక్షకంటే ఎక్కువ టెన్షన్ పెడుతున్నాయి!

### ఢిల్లీలో పోరాటం చేస్తేనే ఫలితం

**మన తెలంగాణ**/ హైదరాబాద్: ఎస్‌సి వర్గీకరణపై మందకృష్ణ ఏం చేయాలనుకున్నా ఢిల్లీలోనే చేయాలని, కేంద్రంపై పోరాటం చేస్తేనే ఫలితం ఉంటుందని టిఆర్‌ఎస్ నాయకులు నోముల నర్సింహయ్య వ్యాఖ్యానించారు. టిఆర్‌ఎస్‌ఎల్‌పి కార్యాలయంలో శుక్రవారం తనను కలిసిన జర్నలిస్టులతో మాట్లాడుతూ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధిగా ఉందన్నారు. దీనిపై సిఎం కెసిఆర్ నిజాయితీతో వ్యవహరించినందునే అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపారని ఆయన పేర్కొన్నారు.

"విజయం ఒక ప్రయాణం మాత్రమే. గమ్యం కాదు.
– అరిస్టాటిల్"

సంపాదకీయం

## ఉత్తర–దక్షిణ కొరియా చర్చలు


చర్చల కొరకు ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ చేసిన ప్రతిపాదనను దక్షిణ కొరియా అంగీకరించటం ప్రస్తుత ఉద్రిక్తత పరిస్థితుల్లో స్వల్ప ఉపశమనం. "అమెరికా మిత్రరాజ్యమైన దక్షిణ కొరియాతో చర్చలకు తాము సిద్ధంగా ఉన్నామని, అలాగే సియోల్‌లో ఫిబ్రవరిలో జరిగే శీతాకాల ఒలింపిక్స్‌కు క్రీడాకారుల బృందాన్ని పంపుతామని" అధ్యక్షుడు ఉన్ తమ నూతన సంవత్సర ప్రసంగంలో ప్రకటించారు. అందుకు ప్రతిస్పందనగా దక్షిణ కొరియా, ఒక సరిహద్దు గ్రామంలో ఉన్నతస్థాయి అధికారుల చర్చలను ప్రతిపాదించింది. 2016 ఫిబ్రవరి నుండి మూతపడిన సరిహద్దు హాట్‌లైన్‌ను రెండు కొరియాలు బుధవారం పునఃప్రారంభించాయి. ఉత్తర కొరియా మిస్సిలీ, అణుబాంబు పరీక్షలపై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, డిపిఆర్ కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ మధ్య మాటలయుద్ధం తారాస్థాయికి చేరిన నేపథ్యంలో ఉభయ కొరియాల చర్చలకు ప్రాధాన్యం ఉంది. అయితే వెంటనే ఏవో సత్ఫలితాలొస్తాయని ఎవరు భావించినా అది అవివేకమే అవుతుంది. దక్షిణ కొరియా, జపాన్‌లలో శాశ్వత సైనిక స్థావరాలు, సంయుక్త సైనిక విన్యాసాలతో ఉత్తర కొరియాను చక్రబంధంలో బిగించే అమెరికా వ్యూహాలను దెబ్బతీసేందుకు ఉత్తరకొరియా అమెరికా ప్రధాన భూభాగాన్ని చేరుకోగల మిస్సిలీ పరీక్షలు విజయవంతంగా నిర్వహించింది. వాటిద్వారా ప్రయోగించే అణుబాంబు పరీక్షలు కూడా జరిపింది. ఈ వ్యూహాత్మక కార్యక్రమంపై ఆగ్రహించిన ట్రంప్ పలు హెచ్చరికలు చేయటమే కాక చైనా ద్వారా ఆ కార్యక్రమాన్ని విరమింపచేయాలని చూశారు. ఆ ప్రయత్నం ఫలించకపోవటంతో ఐరాస భద్రతామండలి ద్వారా మూడు దశల్లో ఆంక్షలు విధింపచేశారు. ప్యాంగ్‌యాంగ్ ఇనుము, బొగ్గు, మత్స్యపరిశ్రమలపై ఆగస్టు 5న, వస్త్రాలు, ఆయిలు సరఫరాలపై సెప్టెంబర్ 11న, శుద్ధిచేసిన పెట్రోలియం ఉత్పత్తుల సరఫరాపై డిసెంబర్ 22న ఆంక్షలు జారీ అయినాయి. ఆర్థికంగా కృంగదీసి ఉత్తరకొరియా మెడలు వంచటమే వాటి ఉద్దేశం.

అయితే ఇవేవీ తమ ఆత్మరక్షణ కార్యక్రమాన్ని నిలువరించలేవని ఉన్ నూతన సంవత్సర ప్రసంగంలో స్పష్టం చేశారు. ఉత్తర కొరియాను నిర్మూలిస్తానని అంతకుముందు ట్రంప్ చేసిన ప్రేలాపనకు జవాబు అన్నట్లుగా, తమతో యుద్ధానికి దిగితే తీవ్రంగా నష్టపోయేది అమెరికాయేనని, అణ్వస్త్రాల బటన్ తన బల్లపైనే ఉందని ఉన్ హెచ్చరించారు. అందుకు ప్రతిగా ట్రంప్, తనబల్లపైనా అణ్వస్త్ర ప్రయోగ బటన్ ఉందని, అది మరీ శక్తిమంతమైందని అంటూ తమ అణ్వాయుధ ఆధిక్యత గూర్చి హెచ్చరిక చేశారు. అణుయుద్ధమే సంభవిస్తే అందరం నామరూపాల్లేకుండా పోతామని ఇద్దరికీ తెలుసు. అయితే ఒక చిన్న దేశం మహాశక్తిమంతమైన అమెరికా సామ్రాజ్యంతో ఢీ అంటే ఢీ అనటం తమ అగ్రరాజ్య ప్రతిష్టకు భంగకరంగా ట్రంప్ భావించి ఉండవచ్చు. ఉభయ కొరియాల మధ్య ప్రతిపాదిత చర్చలపట్ల దక్షిణ కొరియాలోని అమెరికా సైనిక దళాల అధిపతి విన్సెంట్ బ్రూక్స్ స్పందన వారి ప్రతికూల మనస్తత్వాన్ని వెల్లడించింది. యుద్ధ ప్రేలాపనల మధ్య శాంతి చర్చలు ఫలితమిస్తాయని ఎవరూ ఆశపెట్టుకోవలదని విన్సెంట్ వ్యాఖ్యానించాడు. అమెరికా, దక్షిణ కొరియా, చైనా, జపాన్, రష్యాల మధ్య విభజన తెచ్చి అణ్వస్త్రరాజ్యంగా గుర్తింపు సాధించేందుకు ఉత్తర కొరియా వ్యూహాత్మకంగా చర్చల ప్రతిపాదన చేసిందన్నారు. కాగా, చర్చలకు ఖ్యాతిని తన ఖాతాలో జమచేసుకునే ప్రయత్నాన్ని ట్రంప్ తాజా ట్వీట్ తెలియచేస్తున్నది. "నేను దృఢంగా, బలంగా ఉండకపోతే, ఉత్తర కొరియాకు వ్యతిరేకంగా మా యావచ్ఛక్తిని ఉపయోగించేందుకు సుముఖత చూపకపోతే ఉత్తర, దక్షిణ కొరియాల మధ్య చర్చలను ఎవరైనా నిజంగా ఊహించగలరా" అన్నది ఆయన ట్వీట్. ఉభయ కొరియాల పునరేకీకరణకు అడ్డుగా ఉన్నదే అమెరికా అని ప్రపంచానికి తెలుసు. ఇరాన్ అణు కార్యక్రమంపై ఒబామా అధ్యక్షకాలంలో సాధించిన బహుళపక్ష ఒప్పందాన్ని రద్దు చేస్తానని ట్రంప్ అంటుండగా, ఆయన అనుమతి లేకుండా దక్షిణ కొరియా ప్రభుత్వం స్వతంత్రించి ఒక్క అడుగు ముందుకు వేయలేదని అందరికీ తెలుసు. అయినా చర్చలు మినహా మరో పరిష్కారం లేని సమస్యపై చర్చలను ఎవరైనా స్వాగతించవలసిందే.

# రైతు ఓటే తీరం చేర్చే బోటు!

చూపు

దేశంలో 2015లో ప్రతి పదిమంది రైతులలో నలుగురు, 2014లో ప్రతి పదిమందిలో ఇద్దరు రుణభారం వలన ఆత్మహత్య చేసుకున్నారు. గత 11ఏళ్లలో గ్రామీణ రైతులు అధికంగా అప్పులలో కూరుకుపోయారు. ఇది ప్రభుత్వ సమాచారం ప్రకారం వేసిన అంచనా. ఇటీవలి గుజరాత్‌లో అసెంబ్లీ ఎన్నికలలో గ్రామీణ ప్రాంతాలలో అధికార భారతీయ జనతా పార్టీ (బిజెపి) 16 సీట్లు కోల్పోయింది. ఆయా నియోజక వర్గాలలో బిజెపి 40 శాతం కంటె తక్కువ ఓట్లను పొందడానికి కారణం గ్రామీణ రైతులలో పెరిగిన అశాంతే. వ్యవసాయ ఆర్థిక స్థితి దిగజారడమే అందుకు హేతువు. బిజెపి పాలనలోని వ్యవసాయ రాష్ట్రాలయిన చత్తీస్ గఢ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌సహా 2018లో మొత్తం 8 రాష్ట్రాల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో దేశ వ్యాప్తంగా నెలకొన్న గ్రామీణ రుణభారం నిరాశా నిస్పృహలు, మరణాలు, ఆత్మహత్యల పరిస్థితిని జర్నలిస్టుల బృందం ఒకటి అధ్యయనం చేసింది. వాతావరణ మార్పులవలన జరిగే రైతుల ఆత్మహత్యలు కూడా ఈ ఏడాది పెరిగే సూచన ఉంది. అస్థిర వాతావరణ పరిస్థితులే దీనికి కారణం. వాతావరణం మరింతగా దిగజారే ప్రమాదం నూతన సంవత్సరంలో ఉంది. 2019 సార్వత్రిక ఎన్నికల నాటికి గ్రామీణ ఆర్థికమాంద్యం మరింతగా ముదిరే సూచన కూడా ఉంది. రైతులు 2022 నాటికి తమ ఆదాయాలను రెట్టింపు చేసుకోగలుగుతారని ప్రధాని నరేంద్ర మోడీ ఇచ్చిన హామీ నెరవేరే ఆశలు లేవు.




చత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లో మొత్తం గ్రామీణ జనాభా 123.6 మిలియన్‌లు. ఇది 2011 జనాభా లెక్కలు ప్రకారం తేలిన అంకె. ఇది మెక్సికో ప్రస్తుత జన సంఖ్యతో సమానం. అది జనాభాలో ప్రపంచంలోనే 11వ స్థానంలో ఉంది. పైన పేర్కొన్న మూడు రాష్ట్రాలలో వ్యవసాయ వృద్ధి తిరోగమనంలో ఉంది. మధ్యప్రదేశ్, రాజస్థాన్ లలో రైతు లోకం అశాంతిలో మగ్గుతోంది.

రైతుల ఆత్మహత్యల రేటు పెరగడం ప్రస్తుతం కొట్టొచ్చినట్టు కనిపిస్తున్న వాస్తవం. తీసుకున్న అప్పులు తిరిగి చెల్లించే దారిలేక వారు ఈ తీవ్ర చర్యకు దిగుతున్నారు. దేశంలో 2015లో మొత్తం 8007 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. 2014లో 5,650 నుంచి ఏడాదిలో ఈ సంఖ్య 41.7 శాతం పెరిగింది. ఇలా ఆత్మహత్య చేసుకున్న 39 శాతం మంది రైతులు అప్పులు తీర్చలేక ప్రాణాలు తీసుకున్నారు. 2015 జాతీయ నేరాల రికార్డుల బ్యూరో ఈ సమాచారం అందించింది. 2014లో ఆత్మహత్యలు చేసుకున్న రైతులలో 20.6 శాతం మంది అప్పుల భారంతోనే అందుకు ఒడిగట్టారు.

2013లో ప్రతి మూడు గ్రామీణ కుటుంబాల్లో ఒకటి రుణాల ఊబిలో కూరుకుపోయి ఉంది. 2002లో కంటే ఇది 26.5శాతం ఎక్కువ. 2013లో 56 శాతం గ్రామీణ కుటుంబాలు రుణ భారంలో ఇరుక్కున్నాయి. సగటున ఇది కుటుంబానికి రూ. 1.03 లక్షలు. ఇది ఇంచుమించు రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్ 350ధర (రూ.1.09లక్షలు)తో సమానం. ఐ ఫోన్ X ధర (రూ. 1.02 లక్షలు) తో కూడా సమానం. అలాగే పానా సోనిక్ 55 అంగుళాల ఫ్లాట్ టివి రేటు కంటే ఎక్కువ. దాని ఖరీదు 99 వేలే. ఇది గ్రామీణ, పట్టణ ప్రజల మధ్య అంతరాన్ని సూచించే అంశం. ఆ రెండు ప్రాంతాల్లో కలిపి మొత్తం 833 మిలియన్ల మంది, అంటే దేశ జనాభాలో 68.8 శాతం మంది ప్రజలు నివసిస్తున్నారు. వారిలో చాలా మంది నిరుపేదలు.

అభివృద్ధి చెందిన సంపన్న రాష్ట్రాలుగా చెలామణి అవుతున్న రాష్ట్రాలలోనే రైతులు అప్పుల భారంతో ఆత్మహత్యలు చేసుకున్న కేసులు అధికం. మహారాష్ట్రలో 41.7 శాతం మంది రైతులు (1,293 మంది). 2015లో వారు ఆత్మహత్యలు చేసుకున్నారు. ఆ తర్వాతి స్థానంలో 846 మంది (30.5 శాతం) రైతు ఆత్మహత్యలతో కర్నాటక నిలిచింది. మూడో స్థానంలో 632 మంది (20.4శాతం) రైతు ఆత్మహత్యలతో తెలంగాణ నిలిచింది. 2018లో ఎన్నికల జరగనున్న ప్రధాన రాష్ట్రాల్లో కర్నాటక, చత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ ముఖ్యమైనవి. పేద రాష్ట్రాల్లో సొంత భూములు అంతగాలేని రైతుల్లో అప్పుల భారంతో ఆత్మహత్యలు చేసుకోవడం అధికంగా కనపడింది. ఆయా రాష్ట్రాల్లో ఉత్తరప్రదేశ్, బీహార్, పశ్చిమబెంగాల్, ఒడిశా కీలకమైనవి. ఆ రాష్ట్రాల్లో 75 శాతం మంది రైతులకు ఒక హెక్టార్ (2.5 ఎకరాల) కంటే తక్కువ భూకమతాలు ఉన్నాయి.

సంస్థాగత రుణాలు లభించడంలో ఆలస్యంవల్ల పేద రాష్ట్రాల్లో రైతులు అధికంగా ప్రైవేటు రుణాలపై ఆధారపడుతున్నారు. హెచ్చు వడ్డీకి సులభంగా దొరికే ఆ రుణాలపైనే రైతులు ఆధారపడ్డం వల్ల వడ్డీ బాకీలు పేరుకుపోయి అసలు – వడ్డీ కలిపి మోయలేని భారం అవుతోంది. 2013లో వాణిజ్య బ్యాంకులు, గ్రామీణ బ్యాంకులు, బీమా సంస్థలు వంటివి గ్రామీణ ప్రాంతాల్లో 56 శాతం రైతులకు రుణాలు ఇచ్చాయి. వడ్డీ వ్యాపారులు, కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితుల వద్ద 44 శాతం మంది రైతులు ప్రైవేటు రుణాలు తీసుకున్నారు. గ్రామీణ రుణ భారంలో వడ్డీ వ్యాపారుల వాటా అత్యధికంగా 28.2 శాతం వరకూ ఉంది. సులభంగా రుణాలు పొందడానికి గ్రామీణ పేద రైతులు ఇంకా స్థానిక వడ్డీ వ్యాపారులపైనే ఆధారపడుతున్నారనడానికి ఇది నిదర్శనం. గ్రామీణ రుణాల్లో వాణిజ్య బ్యాంకులు తదితర సంస్థల వాటా 25.1 శాతం మాత్రమే. సహకార సంస్థలు, సహకార బ్యాంకుల వాటా 24.8 శాతం. మన దేశంలో గ్రామీణ రుణ భారం పెరుగుదలలో రెండు గుణాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. వడ్డీ వ్యాపారుల ఉడుంపట్టు మరింతగా బిగిస్తోంది. ఆ పట్టులోంచి బయటపడలేక బ్యాంకులకు ఇతర సంస్థలకు తీసుకున్న రుణాలను ఎగవేయక తప్పని పరిస్థితులు గ్రామీణ రైతుకు ఉన్నాయి. బ్యాంకుల రుణాల మంజూరు చాల కష్టతరమైన ప్రక్రియతో ఉండడం కూడా ఈ పరిస్థితికి ముఖ్య కారణం. బ్యాంకుల సేవలు పెరుగుతున్నా, గ్రామీణ ప్రాంతాలకు అవి ఇంకా అందకుండా ఉన్నాయి. ఇది 2013లో రిజర్వు బ్యాంకు ఒక నివేదికలో స్పష్టం చేసిన అంశం. రానున్న ఎనిమిది రాష్ట్రాల ఎన్నికలలో ఈ వాస్తవాలు ప్రభావం చూపుతాయా అన్నదానిపై చర్చలు జోరుగా సాగుతున్నాయి. ఇవి ప్రధానంగా గ్రామీణ ప్రాంతాలు ఎదుర్కొంటున్న సమస్యలు కాబట్టి పట్టణ ప్రాంతంలో వీటి ప్రభావం ఎంత అన్నది అంచనాకు అందడం లేదు. అయితే మోడీ హామీ ఇచ్చిన 'అచ్ఛే దిన్' ను ఈ వాస్తవాలు గ్రామాలు, పట్టణాలలో సమంగా దూరం చేస్తున్నాయని చెప్పకతప్పదు.

✻ సంజుక్త నాయర్

# రజనీకాంత్‌కు స్వాగతమా?



టంకశాల అశోక్
9848191767

తమిళనటుడు రజనీకాంత్‌ను రాజకీయాలలోకి ఆహ్వానించేందుకు రెండు అంశాలను గమనించవలసి ఉంటుంది. మొదటిది, ఆయన ఆ రాష్ట్రానికి రాజకీయ స్థిరత్వాన్ని ఇవ్వగలరా లేదా అన్నది. రెండవది, ద్రవిడ జాతి జండాను ఎగురవేయగలరా అనేది. ఆ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా సుమారు నాలు గు సంవత్సరాల సమయం ఉన్నందున, ఆయనను ఈ కోణాల నుంచి అర్థం చేసుకునేందుకు ఈ సమయం సరిపోతుంది. ఒకవేళ ఈ లోగా 2019 లో జరిగే లోక్‌సభ ఎన్నికలలో పోటీకి తను నిర్ణయించుకున్న పక్షంలో మనకు ఆ విషయం అప్పటికే తెలిసిపోతుంది. త్వరలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో తాము పోటీ చేసేందుకు వ్యవధి తగినంత లేదని, లోక్‌సభ గురించి నిర్ణయించుకోలేదని రజనీ కాంత్ అన్నారు. ఆయన నిర్ణయం ఏమి కాగలదీ మనం ఊహించగల పరిస్థితి లేదు. కాని రాజకీయ తర్కాన్ని ఆలోచించినట్లయితే, లోక్‌సభకు పోటీ చేయటం సరైనదవుతుంది.

అందువల్ల రజనీకాంత్‌కు, తమిళ ప్రజలకు, పరిశీలకులకు కొన్ని స్పష్టతలు వస్తాయి. రాజకీయ పార్టీ పెట్టగలనన్న ఆయన ప్రకటన ఆ రాష్ట్రంలో ఉద్విగ్న వాతావరణాన్ని సృష్టించింది. పార్టీ పెడతారా లేదా అన్న ఊహాగానాలు చిరకాలం పాటు సాగిన తర్వాత, చివరకు ఆయన నిర్దిష్ట ప్రకటనతో ఏర్పడిన వాతావరణమిది. రాజకీయాలలో ఒకసారి అది ఏర్పడినపుడు ఇక నిలిచి ఉండేందుకు తగిన ఆధారాలు ఏర్పడాలి. వీలైనంత త్వరలో పార్టీ ప్రకటన, యంత్రాంగ నిర్మాణం సరేసరి కాగా, ఆ తర్వాత కాలంలో జరిగే ఎన్నికలలో పార్టీ బల నిరూపణ ముఖ్యమవుతుంది. అటువంటి నిరూపణ పార్టీకి అవసరం. పార్టీ మద్దతుదారులు కూడా అందుకోసం ఉత్సుకతతో ఎదురు చూస్తారు. కనుక బల నిరూపణ, ప్రజల ఉత్సాహం బలహీనపడకుండా చూసుకోవటం అవసరం.

స్థానిక సంస్థలు సమీపంలోనే ఉన్నందున వాటిని వదిలివేసినా, లోక్‌సభకు పదిహేను మాసాల గడువు తక్కువది కాదు. కనుక పార్టీ నిర్మాణానికి, పోటీకి సిద్ధం కావటం మంచిదవుతుంది. ఇంత వ్యవధిని ఉపయోగించుకోనట్లయితే రెండు నష్టాలు జరుగవచ్చు. ఒకటి, ప్రజల ఉత్సాహం తగ్గటం, అంతకన్న ముఖ్యంగా, ఒకవేళ లోక్‌సభ ఎన్నికలలో ప్రస్తుత పార్టీలలో ఏదైనా ఘనవిజయం సాధించి బలపడితే అపుడు ప్రస్తుత శూన్యాన్ని అది భర్తీ చేస్తుంది. ఈ శూన్యం రజనీకాంత్‌కు అందుబాటులో లేకుండా పోవచ్చు. లేదా తగ్గవచ్చు. ఒకసారి అది జరిగితే ఆ తర్వాత అసెంబ్లీ ఎన్నికలు ఆయనకు ఆ మేరకు కొంత కష్టమవుతాయి. దీనినంతా నిరోధించాలంటే లోక్‌సభకు పోటీ అవసరం. అందువల్ల మరొక వైపునుంచి ఆయనకు కొన్ని లాభాలుంటాయి. ప్రస్తుతం ఉన్న శూన్యాన్ని, తన ప్రకటన సృష్టించిన వాతావరణాన్ని తాను సద్వినియోగం చేసుకోవచ్చు. అది జరిగితే అసెంబ్లీ నాటికి పరిస్థితి తేలకవుతుంది. ఓటర్లలో, పార్టీలలో పోలరైజేషన్ చోటుచేసుకుంటుంది. ఇప్పటినుంచే ఇదంతా జరగటమే రాజకీయ విజ్ఞత, ఆచరణాత్మకత అవుతుంది.

పైన అన్నట్లు తమిళనాడు ప్రజలకు కూడా రజనీకాంత్ రాజకీయంగా ఏమిటో నాలుగేళ్లపాటు వేచి చూడనక్కరలేకుండా తెలుస్తుంది. తన ఆలోచనలు, సిద్ధాంతాలు ఏమిటో సరిగా ఎన్నికల సమయంలోనే తెలుస్తాయని కాదు. ఈ లోగా పార్టీ ప్రకటన, దాని మేనిఫెస్టో, ఇతరత్రా వరుసగా ఇతర ప్రకటనలు, ప్రసంగాలు, వివిధ అంశాలపై వెల్లడించే అభిప్రాయాలు ద్వారా కూడా అది తెలుస్తూ పోతుంది. అయినప్పటికీ ఎన్నికల సమయంలో జరిగేవి ముఖ్యమవుతాయి. కనుక, 2019 లోక్‌సభ ఎన్నికల సమయానికే అది జరిగినట్లయితే స్పష్టతలు త్వరగా వస్తాయి. అదేవిధంగా ఇతర పార్టీలకు, తమిళనాడు అసెంబ్లీ స్థానాలు 234 కాగా, లోక్‌సభకు 39 ఉన్నాయి.

అసెంబ్లీలో అన్నింటికీ పోటీ చేయగలనని రజనీకాంత్ అన్నారు. కాని రాజకీయాలలో సాధారణంగా ఇటువంటివి శిలాశాసనం కాదు. అవసరాన్ని బట్టి పొత్తులు ఉండవచ్చు కూడా. అదెట్లున్నా, యథాతథంగా తన ప్రకటనను నమ్మితే, అదే వైఖరిని ఆయన 39 లోక్‌సభ స్థానాల విషయంలోనూ తీసుకోగలరని తార్కికంగా చెప్పవచ్చు. అపుడు, ఇతర తమిళ పార్టీలతో పొత్తులు ఉండకపోవటం సరేసరి కాగా, రెండు జాతీయ పార్టీలతోనూ అవగాహనలకు అవకాశం ఉండదనుకోవాలి. సర్వసాధారణంగా ప్రజలు తాము హీరోలనుకున్నవారు ఒంటరి యుద్ధం చేయటాన్నే ఇష్టపడతారు. అది వారి బలానికి, వారిపట్ల తమ విశ్వాసానికి సంకేతాలవుతాయి. పొత్తులు బలహీనతకు గుర్తు అవుతాయి. కనీసం తొలిదశలో ఒకసారి ఒంటరిగా యుద్ధంలో గెలిచిన తర్వాత క్రమంగా పరిస్థితులను బట్టి పొత్తులు అభ్యంతరకరంగా తోచకపోవచ్చు. అట్లా అనేందుకు పలు ఉదాహరణలున్నాయి.

పోతే, మొదట అనుకున్నట్లు, రజనీకాంత్ తమిళనాడులోని అస్థిర రాజకీయాలకు అసెంబ్లీ స్థాయిలో స్థిరత్వాన్ని ఇవ్వదలచుకుంటే ఇవ్వగలరో లేదో ప్రజలకు అర్థం కావాలంటే, లోక్‌సభ ఎన్నికలు అందుకు మొదటి పరీక్ష కాగలవు. అదే విధంగా ఆయన ద్రవిడ జాతి సిద్ధాంతపు జండాను ఎగరవేయగలరో లేక అందుకు ఏదో ఒక మేరకు భిన్నమైన మార్గాన్ని అనుసరించగలరో కూడా తెలిసిపోతుంది. తమిళనాట నెలకొన్న ప్రస్తుత అనిశ్చితి బట్టి అయినా, దీర్ఘకాలిక సంస్కృతి, రాజకీయాలను బట్టి చూసినా ఈ రెండింటికి స్పష్టత రావటం తప్పనిసరి. రజనీకాంత్ రాజకీయం, ఆలోచనలు ఆ విధంగా 2019లోనే తేలిపోవటం తమిళనాడుకు కూడా అన్ని కోణాలనుంచి అవసరం.

ఈ రెండు అంశాలను మరొక స్థాయిలో కొంత వివరంగా చూసేందుకు ప్రయత్నిద్దాము. అస్థిరత, సుస్థిరతల గురించి ఇప్పటికే విశ్లేషకులు చర్చిస్తున్నారు. అధికార పక్షమైన అన్నా డిఎంకె జయలలిత మరణానంతరం ముక్కలైంది. ఏ ముక్కకు కూడా గట్టి నాయకత్వం లేదు. ప్రజలలో తగు గౌరవం లేదు. డిఎంకె అధినాయకుడు అయిన యోధుడు కరుణానిధి అవసాన స్థితిలో ఉన్నారు. ఆయన వారసుడు స్టాలిన్ చెప్పుకోదగినవాడు కాదు. కాంగ్రెస్ చాలా బలహీనపడింది. మంచి నాయకత్వం లేదు.

బిజెపి పరిస్థితి అంతకన్న హీనంగా ఉంది. ఇటువంటి పరిస్థితుల మధ్య తమిళనాడు వంటి రాష్ట్రానికి, అటువంటి సజీవ సమాజానికి కూడా స్థిరత్వాన్ని, నమ్మకాన్ని ఇవ్వగల నాయకత్వం కావాలి. దానికి తావివ్వగలనన్నది రజనీకాంత్ చెప్తున్నమాట. ఆయన రాష్ట్రంలో అస్థిరత గురించి, అవినీతి గురించి మాట్లాడారు. ఈ పరిస్థితులను మార్చటం తన ఉద్దేశమన్నారు. కుల మతాలకు తావులేని విధంగా రాజకీయాలను నిర్మిస్తామన్నారు. తాను చెప్పే ఆధ్యాత్మికత అర్థం వీటికి అతీతమైన నిజాయితీతో కూడిన రాజకీయమన్నారు. స్థూలంగా ఇదంతా బాగానే ఉన్నప్పటికీ తను వివరమైన ప్రకటనలు, మేనిఫెస్టో వెల్లడించినపుడు గాని ఎవరికైనా సరైన అవగాహన రాదు. తను రాజకీయ సుస్థిరత ఇవ్వగలదీ లేనిదీ కేవలం సీట్ల సంఖ్యను బట్టిగాక, ఈ అవగాహనపైన కూడా ఆధారపడి ఉంటుంది. తమిళనాడు సమాజం ఇతర సమాజాల కన్న కొంత భిన్నమైనదని ఈ సందర్భంలో గుర్తుంచుకోవాలి.

అటువంటి భిన్నత్వాన్ని గుర్తుంచుకోవలసిన మరొక అంశం తమిళనాడులోని ద్రవిడ జాతి వాదం. ఎంజి రామచంద్రన్ మలయాళీ అయినా తమిళజాతి వాదంలో అన్ని విధాలుగా భాగం అయినందున అదొక సమస్య కాలేదు. అదేవిధంగా రజనీకాంత్ మహారాష్ట్రుడైనా, తగిన ధర్మాలను పాటిస్తే తమిళజాతి జండాను తేలికగా మోయగలరు. ఎంజిఆర్ వలె ఆయనకు తమిళ ఉద్యమాల నేపథ్యం లేకపోవచ్చు గాక. కాని అది ఎల్లవేళలా తప్పనిసరి కాదు. ఇతర అంశాలు సానుకూలంగా ఉండేట్లు చూసుకోగలిగితే సమస్య ఉండదు. వర్తమానంలో బిజెపి ఏదో ఒక పద్ధతిలో తమిళనాట స్థానం సంపాదించచూడటం ద్రవిడ జాతి వాదులకు కలవరం కలిగిస్తూ, దానిని ప్రతిఘటించే ప్రయ త్నాలు సాగుతున్నందున, రజనీకాంత్ ఈ విధమైన ఆరాటాలకు ప్రాతినిధ్యం వహించగలరా అన్నది ఒక కీలకమైన విషయం కానున్నది.

# మాతృభాష పరిరక్షణపైనా దుష్ప్రచారం



కర్నె ప్రభాకర్,
శాసనమండలి సభ్యులు

'కడలి అంచులు దాటి కదిలింది తెలుగు...
ఎదల లోతులు మీటి ఎగిసింది తెలుగు–

అని ప్రఖ్యాత సాహితీవేత్త డాక్టర్ సి.నారాయణ రెడ్డి మాతృభాష మాధుర్యం గురించి లోకానికి చాటి చెప్పారు. కానీ ప్రపంచీకరణ వేగవంతమై బుసలు కొడుతున్న పరాయి భాష మోజులో కొట్టుమిట్టాడుతున్న నేటి రోజుల్లో 'తేనె కన్న తియ్యనైన తెలుగుభాష' క్రమంగా మసకబారుతోంది. పరాయిభాషల పడగనీడలో అతి ప్రాచీనమైన తెలుగు భాష అంతరించి మృత భాషగా మిగిలిపోతుందేమోనన్న ఆందోళన వ్యక్తమవుతున్న తరుణంలో తెలంగాణ ప్రభుత్వం మాతృభాష పరిరక్షణ బాధ్యతను భుజానికెత్తుకున్నది. ఇందులో భాగమే ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రపంచ తెలుగు మహాసభలు. మాతృభాషను పరిరక్షించుకోవడం, తద్వారా మన సంస్కృతులను కాపాడుకోవడం ఈ మహాసభల ప్రధాన ఉద్దేశ్యం. దీనిని అర్థం చేసుకోలేకపోతున్న కొందరు వ్యక్తులు సామాజిక మాధ్యమాలలో తప్పుడు ప్రచారాలు చేయడం, కొన్ని పత్రికలలో మహాసభల ఉద్దేశ్యాన్ని వక్రీకరించి వ్యాసాలు రాయడం, మాతృభాషకు కులాల రంగు పులమడం నిజంగా దురదృష్టకరం. రాష్ట్రం ఏర్పడటానికి ముందు తెలంగాణ ప్రజలకు తెలుగు మాట్లాడటమే రాదని, విభజన జరిగితే అది తౌరఖ్యాంధ్రం మాట్లాడే రాష్ట్రంగా మారిపోతుందని అప్పట్లో సీమాంధ్రకు చెందిన కొందరు ప్రముఖ సాహితీ వేత్తలు ఎగతాళి చేసిన విషయాన్ని నేను మరోసారి గుర్తుచేస్తున్నా. వారి వ్యాఖ్యలు తెలంగాణ ప్రజల మనసును గాయపర్చడమే కాకుండా ఉద్యమకారులను, ఉద్యమ నేతలను అవహేళన చేసినట్టుగా ఉన్నాయి. బతుకుదెరువు కోసం భాషలు ఎన్నైనా నేర్చుకోవచ్చు. కానీ బతుకుదెరువును నేర్పిన తల్లి భాషను విస్మరించడమే మనసుకు బాధ కలుగుతున్నది. ఈ నేపథ్యంలోనే మాతృభాషను మర్చిపోతే కన్నతల్లిని మర్చిపోయినట్లేనని బలంగా నమ్మిన తెలంగాణ ప్రభుత్వం తెలుగును బతికించే బాధ్యతను మీదేసుకున్నది. మాతృభాషను మాట్లాడటం వల్ల కుటుంబ, సామాజిక అనుబంధాలు బలపడతాయి. మాతృభాషతో మనకు బతుకు నేర్పిన మన సంస్కృతులు పరిఢవిల్లుతాయి. అమ్మను అమ్మ, నాన్నను నాన్న, అక్కను అక్క, చెల్లెను చెల్లె, మామను మామ అని పిలుచుకుంటేనే మనసుకు ఇంపుగా ఉంటుంది. తల్లి భాష మాట్లాడుకోవడం ద్వారా ఆత్మీయత, అనురాగాలు పెరుగుతాయి. అమ్మను మమ్మీ అని, నాన్నను డాడీ అని, మామను, బాబాయిని కలిపి అంకుల్ అని, అత్త, పిన్ని సహా ఇతర వరసలయ్యే మహిళలను ఆంటీ అని పిలుచుకోవడం ద్వారా అనుబంధాలు తరిగిపోతాయే తప్ప బలపడవు. తమిళులనే చూడండి వారు మాతృభాష కోసం పరితపిస్తారు. వారికి ఆంగ్లంతో పాటు ఇతర భాషలు రాక కాదు. ఏదో ఒక జీవనాధారం కోసం వృత్తి, ఉద్యోగ నిర్వహణ సందర్భంలో తప్పనిసరైతే తప్ప తమిళులు పరభాషను మాట్లాడరు. మాతృభాషను పరిరక్షించుకోవడానికి, వారి సంస్కృతులను కాపాడుకోవడానికి తమిళులు ఎన్ని రకాల ఉద్యమాలు చేశారో మనకు తెలుసు. ఆ రాష్ట్రంలో ప్రభుత్వ కార్యాలయాలు, వ్యాపార, వాణిజ్య సముదాయాలు, చిన్న పెద్ద దుకాణాల బోర్డులు తమిళంలో ఉంటాయి. ఇంతెందుకు ఎంతో అభివృద్ధి చెందిన రష్యా, చైనా, జపాన్ వంటి దేశాల అధినేతలు అంతర్జాతీయ వేదికలపైన, వివిధ దేశాల పర్యటనల సందర్భంగా వారి మాతృభాషలోనే మాట్లాడటం మనం చూస్తున్నాం. వారికి ఆంగ్లం రాకనా? కాదు వారికి మాతృభాషపై ఉన్న మమకారం, ఈ దేశాలు ఉత్పత్తి చేసే వస్తువులపైన పేర్లు కూడా వారి దేశాల మాతృభాషలోనే ముద్రించడం మాతృభాషకు ఆయా దేశాలు ఇస్తున్న ప్రాధాన్యానికి నిదర్శనం. కానీ మన దగ్గర మాత్రం రెండు దశాబ్దాలుగా తెలుగు భాషను విస్మరించడం ద్వారా జరుగుతున్న అనేక అనర్థాలు మన అనుభవంలో ఉన్నాయి. పరాయి భాషనే మాతృభాషగా చేసుకోవడం ద్వారా అస్తిత్వాన్నే కోల్పోతున్నాం. మాతృభాష విస్మరణకు గురై చివరకు కుటుంబ అనుబంధాలను, విశిష్టమైన మన సంస్కృతులను కోల్పోతున్నాం. పరాయి భాష పడగనీడలో మన తెలుగు భాష ఎంత విలవిలలాడుతున్నదో, తల్లిదండ్రులు ఆంగ్లభాషపై ఎంత మోజు పెంచుకుంటున్నారో చెప్పడానికి ప్రపంచ తెలుగు మహాసభల వేదిక సాక్షిగా ఉపసభాపతి పద్మా దేవేందర్‌రెడ్డి చెప్పిన మాటలను మీకు నేను గుర్తు చేస్తున్నాను. ఓ కాన్వెంట్ స్కూల్‌లో చదువుతున్న ఒక చిన్నారి లంచ్‌టైమ్‌లో కిందపడి దెబ్బతగలడంతో బిగ్గరగా ఏడుస్తున్నదట. అక్కడే ఉన్న ఆ పాప తల్లి బిడ్డ వద్దకు వెళ్లి ఓదార్చకుండా తను కూడా బిడ్డను కొడుతున్నదట. అక్కడున్నవారు దెబ్బతగిలి ఏడుస్తున్న పాపను లాలించకుండా తిరిగి ఎందుకు కొడుతున్నావని అడిగారట. అప్పుడు ఆ తల్లి మేం వేల రూపాయలిచ్చి కాన్వెంట్‌లో చేర్పించాం కాబట్టి తమ బిడ్డ ఏడుపు కూడా ఇంగ్లీషులోనే ఉండాలి అని చెప్పడంతో అక్కడున్న వారు ముక్కున వేలేసుకున్నారట. దీనిని బట్టి తల్లిదండ్రుల మానసిక స్థితి ఎలా ఉందో విదితమవుతున్నది. ఇలాంటి ఎన్నో అనర్థాలను గమనించిన తెలంగాణ ప్రభుత్వం తెలుగుభాషను పరిరక్షించుకోవడానికి ప్రపంచ మహాసభల నిర్వహణతో అంకురార్పణ చేసింది. మరో అడుగు ముందుకు వేసి ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో ఇంటర్‌మీడియట్ వరకూ తెలుగుభాష బోధనను తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. భాషా అధ్యాపకుల కొరత లేకుండా చేయడానికి కసరత్తు చేపట్టారు. ఇంకా మరెన్నో చర్యలు చేపట్టి మాతృభాష పరిరక్షణకు సిఎం కెసిఆర్ చేస్తున్న కృషిని తెలుగు ప్రజలంతా హర్షిస్తుంటే ప్రభుత్వం చేసే ప్రతి పనిని విమర్శించడమే పనిగా పెట్టుకున్న నిత్య అసంతృప్తి వాదులు. కొంతమంది స్వయం ప్రకటిత మేధావులు చివరకు ప్రపంచ తెలుగు మహాసభలపైనా నోరు పారేసుకుంటున్నారు. మహాసభల ఉద్దేశ్యాన్ని వక్రీకరిస్తూ తప్పుడు వ్యాసాలు రాస్తున్నారు. తెలుగు భాషను కించ పర్చేలా, ఆంగ్ల భాషతోనే భవిష్యత్ ఉందని నమ్మించేలా సామాజిక మాధ్యమాలలో తప్పుడు పోస్టింగ్‌లు పెడుతున్నారు.

రాజకీయాల కోసం ప్రతిదానిని విమర్శించేవారిని పట్టించుకోవాల్సిన పనిలేదు. కానీ చదువుకున్న కొంతమంది బుద్ధి జీవులు తెలుగు మహాసభల ఉద్దేశ్యాన్ని అర్థం చేసుకోకుండా ఇష్టారాజ్యంగా పిచ్చి రాతలతో దుష్ప్రచారం చేయడం బాధ కలిగిస్తున్నది. తెలుగు పేదవాడి భాష అని, అది వెనుకబడిన వర్గాల భాష అని మాట్లాడటం వారి అల్పబుద్ధికి నిదర్శనం. మాతృభాషకు పేద, ధనికుడనే భావన ఉంటుందా? మాతృభాషను పరిరక్షించడం పేదవాడికి, ధనికుడికి మధ్య, వెనుకబడిన వర్గాలకు, అగ్రవర్ణాలకు మధ్య జరిగే భాషాపరమైన వివాదం కాదు. మాతృభాషను కాపాడుకోవాలనే యజ్ఞాన్ని కులాలకు అంటగట్టడం వారి కురూపి మనస్తత్వానికి నిదర్శనం. మాతృభాష పరిరక్షణ అంటే ప్రభుత్వ ప్రయత్నమైనా, సాహితీవేత్తల తాపత్రయమైనా మనిషి మనుగడకు సంబంధించిన మూలాలను వెతుక్కోవడమే. విద్యాసంస్థల్లో తెలుగును తప్పనిసరి చేయడమంటే ఒక్క తెలుగుభాషను మాత్రమే నేర్పాలని ఆంక్షలు విధించడం కాదు. తెలుగును తప్పనిసరిగా నేర్చుకొని మిగిలిన భాషలను కూడా నేర్చుకోవచ్చన్నది ప్రభుత్వ భావన. అలాగే మన రాష్ట్రంలో 80శాతానికి పైగా వ్యవసాయం, కులవృత్తులపై ఆధారపడి జీవిస్తున్నారు. రైతులు, చేతివృత్తిదారుల జీవన విధానంలో భాగమైన మాతృభాషతో ముడిపడి ఉన్నది. ఈ క్రమంలో మన సంస్కృతులను పరిరక్షించుకోవడంతో పాటు తెలుగుజాతి మనుగడకు మాతృభాషను, జీవనాధారం కోసం ఇతర భాషలను నేర్చుకోవచ్చన్న ప్రభుత్వ ఉద్దేశ్యాన్ని అర్థం చేసుకోకుండా పిచ్చి విమర్శలు చేస్తున్నవారు తెలుగు మాత్రమే నేర్చుకోవాలని ప్రభుత్వం ఆంక్షలు విధించలేదని గమనించాలి. ఇప్పటికైనా అలాంటి వారు మాతృభాష సోయిలోకి వచ్చి తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన తెలుగు మహాసభల అసలు ఉద్దేశ్యాన్ని అర్థం చేసుకోవాలన్నదే తాపత్రయం.




రామేతి మధుర భక్తిభావనలో 96 కోట్ల పర్యాయాలు రామనామాన్ని జపించి స్వీయానుభావాలే కృతులుగామలిచి గాంధర్వగాన మధురానుభూతులను లోకానికి అందించిన త్యాగరాజస్వామి సుప్రసిద్ధ సంగీతవిద్వాంసుడు.స్వరార్ణవం నారదీయం అనే రెండు సంగీత రహస్యార్థ శాస్త్ర గ్రంథాలను రచించిన ధన్యుడు. త్యాగరాజస్వామికీర్తనలో ఘనరాగ పంచరత్న కీర్తనలు ముఖ్యమైనవి. శ్రీత్యాగరాజస్వామి రామభక్తామృతాన్ని సేవించి,కర్ణాటక సంగీత సంప్రదాయంలో అనేక కృతులను మధురకీర్తనలుగా మలిచి సంగీత,సాహిత్య రసజ్ఞుల హృదయాల్లో చిరంజీవిగా నిలిచారు. త్యాగరాజ ఆరాధనోత్సవాల్లో విశేషంగా పంచరత్న కీర్తనలు ఆలపించడం సంప్రదాయం.

# శ్రవణానందకారకుడు త్యాగయ్య




సంగీత సాగరాన్ని మదించి కర్ణాటకసంగీతంలో శాశ్వతకీర్తిని అర్జించిన త్యాగరాజు కీర్తనలు ఎల్లవేళల ప్రజలను భక్తిమార్గంలోకి పయనింపచేస్తూనే ఉన్నాయి. అసంఖ్యాకమైన కీర్తనలు రచించి కర్ణాటక సంగీత నియమాలను సోదాహరణంగా నిరూపించి శాశ్వతకీర్తిని సముపార్జించిన త్యాగరాజు సంగీత సామ్రాజ్యంలో రారాజు. కర్ణాటక సంగీతానికి మూలస్తంభమైన త్యాగరాజు కంభం మండలం కాకర్లలో సీతమ్మదంపతుల మూడవసంతానం. 1847 జనవరి 6న ఆయన భౌతికంగా దూరమైన ఆయనకృతులు సంగీత సామ్రాజ్యాన్ని ఏలుతూనే ఉన్నాయి. త్యాగరాజు జన్మ నామం కాకర్ల త్యాగబ్రహ్మం. త్రిలింగవైదికులైన ఆయన పూర్వకులు తమిళదేశానికి వలసవెళ్ళారు. తండ్రి రామబ్రహ్మం తంజావూరు ప్రభువు శంభోజి దగ్గర విధులు నిర్వహించారు. తాత గిరిరాజ కవి. ఒకసందర్భంలో త్యాగయ్య బంగాళ రాగంలో గిరి రాజసుతా తనయ అంటూ తాతను స్తుతించిన సందర్భం ఉంది.

నాదోపాసన తో భగవంతుని తెలుసుకోవచ్చని నిరూపించిన గొప్పవాగ్గేయకారుడు. ఆయన కీర్తనలు శ్రీరామచంద్రునిపై ఉన్న విశేషభక్తిని ప్రదర్శిస్తాయి. భక్తిని,వేదాలను,ఉపనిషత్తులపై ఆయనకున్న జ్ఞానాన్ని తెలియచేస్తాయి.ఉపనయనం అనంతరం తండ్రి బోధనలు,18వ ఏట రామకృష్ణానంద పరబ్రహ్మం ఉపదేశించిన రామ షడాక్షరీ మంత్రప్రభావం,తల్లి అలవర్చిన భక్తి సంగీతాలు బాల్యంలోనే బీజాంకురాలై త్యాగరాజస్వామిని మూర్తీభవింపచేశాయి. త్యాగరాజు తన సంగీత శిక్షణను శొంఠి వెంకటయ్య దగ్గరపిన్న వయసులోనే ప్రారంభించారు. పదమూడేళ్ళ చిరుప్రాయంలో త్యాగరాజు నమో నమో రాఘవా కీర్తనను దేశిక తోడి రాగంలో స్వరపర్చిన విద్వాంసుడు. గురువు దగ్గర చేసిన కచేరిలో ఎందరో మహానుభావులు కీర్తనను స్వరపర్చి పాడిన కీర్తన నేటికి సంగీతవిద్వాంసుల మన్ననలను పొందుతూనేఉంది.

త్యాగరాజును బాలమేధావిగా తంజావూరు ప్రజలమన్ననలను పొందారు. తంజావూరు రాజు త్యాగరాజకృతులకు పరమానందభరితుడై ధనకనక వస్తూ వాహనాధిరాజలాంచనాలతో త్యాగరాజును సభకు ఆహ్వానించారు. అయితే కానుకలకంటే రామసన్నిధిలోనే ఆత్మానందం ఉందని కానుకలను నిర్ద్వంద్వంగా తిరస్కరించిన రామభక్తుడు ఆయన.ఈ సందర్భంగా స్వరపరిచి పాడిన నిధి చాలాసుఖమా కీర్తన సంగీతంతో భగవంతుని ప్రేమను పొందే మార్గంగా త్యాగరాజు భావించారు. అయితే తంజావూరు రాజు పంపిన కానుకలను తిరస్కరించినందుకు త్యాగయ్య నిత్యం ఆరాధించే శ్రీరామ పట్టాభి షేక విగ్రహాలను కావేరి నదిలో అన్న జపేశుడు విసిరివేడం తట్టుకోలేక దక్షిణభారత యాత్రకు వెళ్ళి అనేక దేవాలయాలను,తీర్థాలను దర్శించి ఎన్నో అద్భుత కీర్తనలు రచించారు.

త్యాగరాజు సుమారు 800ల కీర్తనలు రచించారు. వీటిలో చాలావరకు ఆయన మాతృభాషలో రచించినవే.కొన్ని సంస్కృతంలో రచించినవి ఉన్నాయి. త్యాగరాజు స్వరపర్చిన జగదాందకారక కీర్తన శ్రీరామునికి ఉన్న108 పేర్లను ప్రస్తావిస్తుంది. ప్రహ్లాద భక్తివిజయం,నౌకాచరితం సంగీత నాట్యరూపకాలను రచించారు. త్యాగయ్య సంగీతంలో అత్యుత్కృష్ట మైన అనేక అంశాలు ఉన్నాయి.త్యాగయ్య 24000 రచనలు రచించినట్లు పరిశోధకులు చెపుతుంటారు. దివ్యనామసంకీర్తనలు,ఉత్సవసంప్రదాయకీర్తనలు,బృందకీర్తనలు అనేకం ఉన్నాయి.త్యాగరాజస్వామి రచించిన పంచకృతుల్లో ప్రాపంచికం, తాత్వికం, కీర్తనం,నిత్యానుష్టానాలు ఉన్నాయి. సంగీత కళాకారులు తొలుత ఉంఛవృత్తి భజన,అనంతరం నివాసస్థలమైన తిరుమంజనవీది నుంచి బయలుదేరి సమాధివరకు కీర్తనలు గానం చేస్తారు. వందలాధి సంగీతకళాకారులు త్యాగయ్య రచించిన పంచకృతులను కావేరీ నదీ ఒడ్డున గల సమాధివద్ద బృందగానం చేస్తారు.అలాగే తిరువయ్యూరు లో నిర్వహించే ఆరాధన సుప్రసిద్ధి.

త్యాగరాజ సమాధిని మహాభక్తురాలు నాగరత్నమ్మ నిర్మించారు.1921 లో రాజుల దగ్గరనుంచి స్థలసేకరణ చేసి 1925 లో సమాధి నిర్మించి భక్తులకు అందించారు. సంగీత ప్రపంచంలో సుప్రసిద్ధ వాగ్గేయకారుడు త్యాగరాజస్వామి భౌతికంగా మనలో లేకపోయినా ఆయన కీర్తనలు భక్తిభావాల సుగంధాలను వెదజల్లుతూ శ్రవణానందాన్ని కలిగిస్తూనే ఉన్నాయి.

**తిరువత్తియూరు పంచరత్నములు**


* సుందరి నన్ను
* సుందరి నీ దివ్య
* సుందరి నిన్ను వర్ణింప
* కన్నతల్లి నిన్ను సావేరి
* దారిని తెలుసుకొంటి శుద్ధ సావేరి

**కొవ్వూరు పంచరత్నములు**

* నమ్మివచ్చిన
* కోరి సేవింప
* శంభోమహదేవ
* ఈ వసుధశహాన
* సుందరేశ్వరుని

**ఘనరాగ పంచ పంచరత్నములు**


* జగదానంద
* దుడుకులగల
* సాధించినే
* ఎందరో శ్రీ
* కనకరుచిరా



# ఆశయాలకూ,ఆశకూ అదే తేడా



అడిగిన వరమీయని దేవుడు .... అంటారు పెద్దలు. దేవుడంటే అడిగినదల్లా ఇవ్వాలని, వరాల జల్లు కురిపించే వాడని చాలామంది అభిప్రాయం. అది పాక్షికంగా మాత్రమే నిజం. దేవుడు పరలోకంలోని మన తండ్రి అన్న భావన కరువైనప్పుడు వచ్చే వాదన ఇది. చిన్నపుడు మన తల్లిదండ్రుల్ని ఎన్నో అడిగే వారమే కాని, వాళ్ళు మాత్రం మనకేది అవసరమో, తాము ఏది ఇవ్వగలరో అది మాత్రమే ఇచ్చేవారు. తమ పిల్లలకేది ఇవ్వాలి, ఏది ఇవ్వకూడదన్న తల్లిదండ్రుల విచక్షణ వెనుక వారి అనంతమైన ప్రేమ దాగి ఉందని మర్చిపోవద్దు. కత్తులు, రేజర్లు, కత్తెర్ల వంటి మొనదేలిన వస్తువులను తల్లిదండ్రులు పిల్లలకందకుండా జాగ్రత్తగా దాస్తారు. పిల్లలకేమో తమకేది అందుబాటులో లేదో వాటిని పొంది వాడుకోవాలని ఆసక్తి, సరదగా అలాంటి ప్రయత్నాల్లోనే పిల్లలు గాయపడటం, తల్లిదండ్రుల చేతిలో ఒకటి రెండు దెబ్బల్ని తినడం ఇదంతా అనుభవమే.. ఆకాశపక్షులను చూడండి, అవి విత్తవు, కూయవు, కొట్లలో కూర్చుకొనవు అయినా కూడా తండ్రి వాటిని పోషిస్తున్నాడు కదా.. అలాంటప్పుడు వాటి కంటె శ్రేష్టమైన మిమ్మల్ని దేవుడు పోషించడా? అని యేసు ప్రభువు ఒకసారి బోధించాడు (మత్తయి 6:26) దేవుడలా వరాలిచ్చినా ఇవ్వకపోయినా, పోషణ భద్రత మాత్రం పుష్కలంగా అనుగ్రహిస్తాడన్నది యేసు బోధల తాత్పర్యం. మనకేం కావాలన్నది మన కన్నా బాగా పరలోకపు తండ్రికే బాగా తెలుసునని, అందువల్ల మనమడిగినా అడుగక పోయినా దేవుడిచ్చేవే మనకు ఆశీర్వాదకరమైనవని యేసుప్రభువు చెప్పాడు. మనమడిగింది దేవుడిస్తే అది ఆశీర్వాదం. మనమడిగింది దేవుడను గ్రహించకపోతే అది అంతకన్నా పెద్ద ఆశీర్వాదం అని అర్థంచేసుకోగల ఆత్మీయ ఔన్నత్యంలోకి విశ్వాసం ఎదగాలి. ఆ స్థాయిలో జీవితంలో ఓటమి, అసంతృప్తి అనేది మచ్చుకు కూడా కనిపించవు. అపరిమితమైన కోరికలు, ఆశలు సాధారణంగా జీవితంలో పరాజయ, అసంతృప్త భావనలకు ఆజ్యం పోస్తాయి. ఆశయాలు మంచివి ఎందుకంటే వాటిలో సమాజ శ్రేయస్సు అనే అంశం నిక్షిప్తమై ఉంటుంది. కాని "ఆశలు" సాధారణంగా మన స్వార్థానికి ప్రతీకలుగా ఉంటాయి. కాబట్టే వాటి విషయంలో జాగ్రత్త పడాలంటాడు దేవుడు. పల్లకిలో ఊరేగాలన్న ఆశ ఉండటం సహజం కాని అదెప్పుడైనా ఒక సారి జరిగితేనే ఆనందం. కాని జీవితమంతా పల్లకిలోనే ఊరేగాలనుకోవడం అసహజం దురాశాపూరితం. అందుకే "ఆశల పల్లకి" అన్నారు పెద్దలు.



రెవ.టి.ఎ. ప్రభుకిరణ్
9848821472

# తెలుసుకుందాం!

## ఆలయ గంటల అర్థాలు, పరమార్థాలు



దుష్ట శక్తులను దూరంగా తరిమే ఆలయ గంటలవెనుక ఎన్నో అర్థాలు పరమార్థాలున్నాయి. దేవాలయాలలో మోగించే గంట సకల శుభాలకు సంకేతం. ప్రత్యేక పూజాసమాయాలలో మోగించే గంట, మన మనసులను ఆధ్యాత్మికానందంతో నింపుతుంది. గంట నాలుకలో సరస్వతీదేవి కొలువై ఉంటుందనీ, గంట ముఖ భాగంలో బ్రహ్మదేవుడు, కడుపు భాగంలో రుద్రుడు, కొనభాగంలో వాసుకి ఉండటంవల్ల గంట దైవస్వరూపమని మన పెద్దల నమ్మకం. గంటకు ఉండే పిడిలో ప్రాణశక్తి ఉంటుంది ఈ పిడిభాగం గరుడ, చక్ర, హనుమ, నంది, వృషభ మూర్తులతో దర్శనమిస్తుంటుంది. కంచుతో తయారయ్యే గంటను మోగించినపుడు 'ఓం' అనే ప్రణవనాదం వెలువడుతుంది.ఆ శబ్దం మనోచింతలన్నింటినీ పారద్రోలి, మనసును దైవం వైపుకు మరల్చుతుంది. గంట గరుడునికి ప్రతీకగా పేర్కొంటారు. ఆలయంలో మోగించిన గంటానాదం నలుదిక్కులా వ్యాపించి, దుష్టశక్తులను దూరంగా తరిమివేస్తుందట. తద్వారా మన మనసులు పవిత్రమై, దైవం పట్ల మన మనసు లగ్నమవుతుంది. సాధారణంగా ఆలయాలలో గంటానాదం అర్చన, ధూపసేవ, దీపసేవ, నైవేద్యం, పూర్ణాహుతి సమయాలలో మోగించబడుతుంది. ఇంకా చెప్పాలంటే ఏ ఒక్క పూజ గంటానాదం లేనిదే పూర్తి కాదన్నది నిజం. ఇంత ప్రాముఖ్యత గలిగిన గంటానాదం చాలా స్పష్టంగా ఉండాలి. కర్ణకఠోరంగా కాక, చెవులకు ఇంపుగా ఉండాలి. అందుకే గంటను తయారు చేసేటప్పుడు చాల జాగ్రత్తలు తీసుకుంటుంటారు. శైవాగమంలో గంట తయారీకి సంబంధించిన కొలతలు కూడా చెప్పబడ్డాయి. ఐదంగుళాలు ఎత్తు ఉండే గంట నాలుగు గోధుమ గింజలంత మందంతో కూడి ఉండాలని పేర్కొనబడింది. ఇక, మహాగంట విషయంలో ఎత్తు సుమారు ఏడు అంగుళాలు వరకు ఉండాలి. కింది వైపున చుట్టుకొలత ఎనిమిది అంగుళాలు, పై వైపున రెండు అంగుళాలు ఉండాలి. అయితే ఈ కొలతలను ఎవరూ పట్టించుకోవడం లేదు. గంట మోగుతున్నప్పుడు, శబ్దం శ్రావ్యంగా ఉండాలన్న విషయంపైనే అందరి దృష్టి నిమగ్నమవుతోంది. ఆలయ ప్రధానద్వారం దగ్గర మహాగంట ఉంటుంది.ప్రాత:కాలంలో పూజారి ఆలయ ప్రవేశం చేస్తున్నప్పుడు ఈ మహాగంట మూడుసార్లు మోగించబడుతుంది. ఇది ప్రాత:కాలంలో అందరినీ మేలుకొలపడమేకాక, సమస్త దుష్టశక్తులను దూరంగా పారద్రోలుతుంది. సాధారణంగా మహాగంటానాదం ఆలయం చుట్టుపక్కల ప్రదేశాలలో 10 కిలోమీటర్ల విస్తీర్ణం మేర వినబడుతుంది. నైవేద్యాన్ని సమర్పిస్తున్నపుడు, మోగుతున్న గంటానాదం మహామంగళహారతి వరకు కొనసాగుతుంది. ఇంకా కొన్ని చోట్ల త్రికాలపూజల కోసమే మూడు విభిన్నమైన గంటలను ఉపయోగించడం జరుగుతుంటుంది. మహాగంట నిర్మాణంలో చూస్తున్నదు చాలా సాదాసీదాగా ఉంటుంది. కొండొకచో ఆకృతిలో కొన్నికొన్ని మార్పులుండవచ్చు. కొన్ని గంటలపై పువ్వులడిజైన్లు, శ్లోకాలు ఉండవచ్చు. పూర్వకాలంలో మహాగంటను రాజులు తమ విజయసూచికంగా బహూకరించేవారు. అయితే కర్ణాటకకు చెందిన వీరశైవులు గంటకు బదులుగా గుండ్రని లోహపు రేకులను గంటానాదం కోసం ఉపయోగించడాన్ని చూడగలం. కొన్నికొన్ని దేవాలయాలో గంటతో పాటూ నగారాను కూడ వాడుతుంటారు. మేల్కొటేలోని యోగా నరసింహాలయంలో టిప్పుసుల్తాన్ బహుకరించిన నగారను ఇప్పటికీ మనం చూడవచ్చు. కొన్నికొన్ని దేవాలయాల్లో ఇనుపగంటలను గుత్తులు గుత్తులుగా తగిలించి ఉండటాన్ని మనం



చూస్తుంటాం. ఈ గంటలు అలంకరణకు తప్ప ఆధ్యాత్మికంగా అంత ప్రాధాన్యత ఉండదు. ఇక గర్భాలయంలో అర్చన చేస్తున్నప్పుడు మోగించడానికి చేతిగంట ఉంటుంది. ఈ గంటలు ఆయా దైవానికి సబంధించిన చిహ్నాలతో ఉంటుంటాయి. శ్రీ వైష్ణవ పద్ధతిలో పూజు జరిగే ఆలయాల గంటపైన శంఖువు లేక చక్రం ఉంటుంది. విష్ణువు ఆలయాలలోని గంటలపై గరుడుడు ప్రతిమలు ఉంటాయి. శైవ, స్మార్త, శాక్య పూజలలో నందిరూపం పైనున్న గంటలు తమ రూపాలను వివిధ రకాలుగా మార్చుకుంటుంటాయి. మైసూరులోని పరకాలమఠంలో వేదాంత దేశికుల వారు ప్రతిమతో కూడిన గంటను చూడగలం. దీని వెనుక ఓ కథ ఉంది. వేదాంత దేశికులావారి తల్లిదండ్రులకు శ్రీవేంకటేశుని పట్ల అపారమైన భక్తి. వారికి ఒక రోజు, ఒక విచిత్రమైన కల వచ్చింది. ఆ కలలో దేశికులవారి అమ్మగారు గర్భాలయంలోని గంటను మింగినట్లు కలగన్నారు. ఇద్దరు ఉలిక్కిపడి లేచి, తెల్లవారుఝామున ఆలయానికి వెళ్ళిచూస్తే గంట కనబడలేదు. అనంతరం ఆమె గర్భవతియై వేదాంతదేశికులవారికి జన్మనిచ్చిందట. అందుకే ఆ గంటపై వేదాంత దేశికులవారి ప్రతిమ!హిందూధర్మంలో దేవాలయానికి అత్యంత ప్రాముఖ్యత ఉంది. అధ్యాత్మికాభివృద్ధికి, సర్వ మానవ సౌభ్రాతృత్వానికి దేవాలయాలు ప్రతీకలుగా గోచరిస్తున్నాయి.

## పురాణాలలో 108 సంఖ్య ప్రాముఖ్యత ఏమిటి?



భారతావనిలో ఆధ్యాత్మికం ఎక్కువ. 120 కోట్ల జనాభాలో 90 కోట్లకు పైగానే హిందువులు ఉన్నారు (2010). హిందూ మతం లో 108 నంబర్ కు ఎంతో పాముఖ్యత ఉన్నది. అదేమిటో చదవండి.

* ఉపనిషత్తులు 108 * అష్టోత్తర నామావళి 108 * జపమాలలో పూసలు 108
* చంద్రునికీ, భూమికి మధ్య వున్న దూరం చంద్రుని వ్యాసానికి 108 రెట్లు ఉంటుందని పురాణాలు చెప్తున్నాయి.
* ఆయుర్వేదం మనిషి శరీరంలో 108 మర్మ స్థానాలున్నాయని చెప్తోంది, * శ్రీచక్ర యంత్రం లో 54 స్త్రీ, 54 పురుష అంతర్భాగాలున్నాయి... మొత్తం 108 * దేవభాషలో అక్షరాలు 108 * భరతుడి నాట్యశాస్త్రంలో నాట్యభంగిమలు 108 *దేవాలయానికి 108 ప్రదక్షిణాలు చేయడం వల్ల మంచి ఫలితం ఉంటుందని శాస్త్రాలు చెప్తున్నాయి * 108 సార్లు గాయత్రీ మంత్రం జపిస్తే సకల శాస్త్రాల్ని పూజించిన ఫలితం కలుగుతుందని నమ్మకం.
* 108 సార్లు హనుమాన్ చాలీసా వంటివి చదవడం వల్ల సకల కోరికలు సిద్ధిస్తాయని భక్తుల నమ్మకం,
* తెలుగు రాష్ట్రాల్లో 108 ఫోన్ చేస్తే ఎమర్జెన్సీ అంబులెన్స్ ప్రత్యక్షమవుతుంది. ఆపత్బాంధవి... రోగులను ఆసుపత్రికి తీసుకెళ్తుంది.

## కనీస వేతనాల అమలుకు ఉద్యమించాలి : విజయలక్ష్మి




**మన తెలంగాణ** / హైదరాబాద్ : కనీస వేతనాలు, 'సమాన పనికి సమాన వేతనం' విధానాన్ని పటిష్టంగా అమలు చేయాలని ఎఐటియుసి జాతీయ కార్యదర్శి బి.వి.విజయలక్ష్మి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. సత్యనారాయణరెడ్డి భవన్‌లో శుక్రవారం జరిగిన ఎఐటియుసి రాష్ట్ర సమితి సమావేశంలో ఆమె ప్రసంగించారు. అసంఘటితరంగ కార్మికులకు సామాజిక భద్రత కల్పించాలని, స్కీంలలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం రూ.18వేలు, రూ.3 వేల పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. బ్యాంకులు, బిఎస్‌ఎన్‌ఎల్, రక్షణ, రైల్వే తదితర ప్రభుత్వ సంస్థలను కేంద్రం నిర్వీర్యం చేస్తుందని విమర్శించారు. ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉజ్జిని రత్నాకర్‌రావు రాష్ట్రంలో కనీస వేతనాల జి.ఓ. కాలపరిమితి ముగిసినప్పటికీ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా జి.ఓ.లను సవరించం లేదని విమర్శించారు. సిఎం కెసిఆర్ హామీ ఇచ్చిన మేరకు కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని, వివిధ ప్రభుత్వ శాఖలలో ఉన్న ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు టి.నరసింహన్ అధ్యక్షోపన్యాసం చేస్తూ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్టు రంగానికి ఉపయోగపడే విధంగా కేంద్రం తీసుకువస్తున్న రోడ్‌ట్రాన్స్ పోర్టు సేఫ్టీ బిల్లు–2017ను ఉపసంహరించుకోవాలని, ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలని డిమాండ్ చేశారు.



## దక్షిణ మధ్య రైల్వే జిఎం తనిఖీలు

**మన తెలంగాణ** / హైదరాబాద్ : రైల్వే ప్రయాణికులకు మరింత మెరుగైన సౌకర్యాలను అందించేందుకు, భద్రతాపరమైన ప్రమాణాలను పాటించేందుకు అధికారులు, సిబ్బంది మరింతగా కృషి చేయాలని దక్షిణ మధ్య రైల్వే (ఎస్‌సిఆర్) జనరల్ మేనేజర్ వినోద్‌కుమార్ యాదవ్ సూచించారు. విజయవాడ రైల్వే డివిజన్‌లో జనరల్ మేనేజర్ శుక్రవారం వార్షిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాకినాడ – రాజమండ్రి –విజయవాడ సెక్షన్‌లో పర్యటించారు. కాకినాడ పోర్టు రైల్వే స్టేషన్‌లో కోచింగ్ డిపోను జిఎం పర్యవేక్షించి అక్కడ యాంత్రిక బూట్ (బి.ఒ.ఒ.టి) ల్యాండ్రీని ప్రారంభించారు. సర్పవరం – సామర్లకోట సెక్షన్‌లో విండో ట్రయలింగ్‌ని చేపట్టారు. సామర్లకోట రైల్వే స్టేషన్లో ట్రాక్షన్ సబ్ స్టేషన్‌ను తనిఖీ చేసి అక్కడ గ్యాంగ్ యూనిట్ నెం.7 బృందంతో మాట్లాడి వారు అనుసరిస్తున్న భద్రత నియమాలను అడిగి తెలుసుకుని స్వయంగా పరిశీలించారు. సామర్లకోట – ద్వారపూడి స్టేషన్ల మధ్య స్పీడ్ టెస్ట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా పలు రైల్వే స్టేషన్లలో జనరల్ మేనేజర్‌ను రాష్ట్ర దేవాదాయ శాఖమంత్రి పి. మాణిక్యారావు,ఎంపిలు ఎం.మురళీమోహన్, కె.నారాయణరావు,ఎంఎల్‌ఏలు వి.వెంకటేశ్వరరావు,ఎ.సత్యనారాయణ, జి.బుచ్చయ్య చౌదరి కలిసి రైల్వే అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. ఈ పర్యటనలో జనరల్ మేనేజర్‌తో పాటు విజయవాడ డిఆర్‌ఎం ధనుంజయ, ఎస్‌సిఆర్‌లోని వివిధ విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## విశాఖపట్నం–కొల్లం మధ్య ప్రత్యేక రైళ్లు

మన తెలంగాణ / హైదరాబాద్ : ప్రయాణికుల అదనపు రద్దీ దృష్ట్యా విశాఖపట్నం – కొల్లం మధ్య 8 ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు దక్షిణ మధ్య (ఎస్‌సిఆర్) ప్రకటించింది. విశాఖపట్నం – కొల్లం మధ్య ప్రత్యేక రైలు (నెం.08567) ఈ నెల 10, 13, 17 తేదీల్లో రాత్రి 11 గంటలకు విశాఖపట్నం నుంచి బయలుదేరి రెండవ రోజు ఉదయం 3:45 గంటలకు కొల్లం చేరుకుంటుంది. అదే విధంగా కొల్లం– విశాఖపట్నం మధ్య ప్రత్యేక రైలు (08568) ఈ నెల 12, 15, 17 తేదీల్లో విశాఖపట్నం నుంచి ఉదయం 5:45 గంటలకు బయలుదేరి రెండో రోజు మధ్యాహ్నం 12.30 గంటలకు కొల్లం చేరుకుంటుందని ఎస్‌సిఆర్ సిపిఆర్ఓ ఎం.ఉమాశంకర్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

## ట్రిపుల్ తలాక్ బిల్లు వెనుక రాజకీయ ప్రయోజనాలు : సిపిఎం

**తిరువనంతపురం:** ట్రిపుల్ తలాక్ బిల్లును కేంద్ర ప్రభుత్వం తన రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటోందని సిపిఎం విమర్శించింది. ఈ బిల్లు వెనుక ముస్లింలను వేధించాలనే రహస్య ఏజెండా ఉందని సిపిఎం అనుబంధ పత్రిక 'దేశాభిమాని'లో తాను రాసిన వ్యాసంలో కేరళ రాష్ట్ర కార్యదర్శి కొడియేరి బాలకృష్ణన్ ఆరోపించారు. 'జింక తోలు కప్పుకున్న తోడేలు'లా, దీనిని ప్రచారం కోసం వాడుకుంటున్నారన్నారు. విడాకులు అనేది పౌర వ్యవహారమని, దానిని క్రిమినల్ నేరంగా పరిగణించడం ముస్లిం మహిళలకు రక్షణ కల్పించాలనే ఉద్దేశంతో కాదని, ఆ సమాజాన్ని లక్ష్యంగా చేసుకోవడానికేనని బాలకృష్ణన్ ఆరోపించారు. తక్షణ తలాక్‌పై సుప్రీంకోర్టు తీర్పును తమ పార్టీ స్వాగతించిందని ఆయన పేర్కొన్నారు. 'ప్రాచీన'ట్రిపుల్ తలాక్ పద్ధతిని పాటించడాన్ని సిపిఎం వ్యతిరేకిస్తోందన్నారు. ఇది మహిళల హోదా, గౌరవాన్ని అప్రతిష్టపాలు చేస్తుందన్నారు. ఈ బిల్లుపై చర్చించి, తగిన సవరణలు చేయడానికి సెలెక్ట్ కమిటీకి సిఫార్సు చేయాలన్నారు. హిందూ దేశాన్ని సాధించే దిశగా సంఘ్ పరివార్ ప్రయాణంలో భాగమే కొత్త చట్టమని బాలకృష్ణన్ పేర్కొన్నారు.

## మన్మోహన్‌తో మోడీ కరచాలనం

**న్యూఢిల్లీ:** రాజ్యసభ నిరవధికంగా వాయిదా పడిన వెంటనే ప్రధాని నరేంద్ర మోడీ మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ సీటు వద్దకు వెళ్లి ఆయనతో కరచాలనం కలిపారు. గత నెలలో జరిగిన గుజరాత్ ఎన్నికల్లో మాటల యుద్ధం తర్వాత ఇరువురు నేతలు హృదయ పూర్వకంగా షేక్ హ్యాండ్ ఇచ్చుకుని,కొద్దిసేపు మాట్లాడుకున్నారు. సభలో ప్రధాని డిప్యూటీ చైర్మన్ పిజె కురియన్, కాంగ్రెస్ సీనియర్ నేత కరణ్‌సింగ్‌తో చేతులు కలిపారు. గుజరాత్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మాజీ ప్రధానిమన్మోహన్‌సింగ్ రహస్యంగా పాకిస్థాన్‌తో కలిసి ప్రచారం చేస్తున్నారని మోడీ ఆరోపించారు. తనపై ప్రమాదకరమైన ఉదాహరణ'తో నిందారోపణ చేసిన మోడీ క్షమాపణ చెప్పాలని మన్మోహన్ డిమాండ్ చేశారు. ఈ అంశం కొద్దీ రోజులు పార్లమెంటును కుదిపి వేసింది.

## కాంగ్రెస్ తీరు అభ్యంతరకరం

### మంత్రి అనంత్ కుమార్ ఘాటు వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ :** పార్లమెంటరీ శాఖ మంత్రి అనంత్ కుమార్ ట్రిపుల్ తలాక్ బిల్లుపై కాంగ్రెస్ తీరును ఎండగట్టారు.పార్లమెంట్ ఆవరణలో విలేకరులతో మాట్లాడిన ఆయన కాంగ్రెస్ రాజ్యసభలో వ్యవహరిస్తున్న తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. లోక్‌సభలో బిల్లుకు అడ్డుచెప్పని కాంగ్రెస్ రాజ్యసభలో తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేయడాన్ని ఆయన తప్పుబట్టారు. మహిళాభ్యుదయంపై తరచు మాట్లాడే కాంగ్రెస్ ఆచరణలో మాత్రం వెనకడుగు వేస్తోందని ఆయన ధ్వజమెత్తారు.షా బానో కేసులో ఎలాగైతే అన్యాయంగా ప్రవర్తించారో ఇప్పుడు కూడా అలాగే ప్రవర్తిస్తున్నారని అనంత్ కుమార్ మండిపడ్డారు. రాజ్యసభలో ఏదో ఒక కుంటి సాకుతో సభ కార్యక్రమాలను అడ్డుకునేందుకు కాంగ్రెస్ ప్రయత్నించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు.ట్రిపుల్ తలాక్ విషయంలో ప్రభుత్వం ఎంతో చిత్తశుద్ధితో ఉందని, చట్టాన్ని తీసుకువచ్చి ముస్లిం సోదరీమణుల అభ్యున్నతికి పాటు పడతామని ఆయన స్పష్టం చేశారు. డిసెంబర్ 28న లోక్‌సభ అనుమతి పొందిన ట్రిపుల్ తలాక్ బిల్లు రాజ్యసభలో ఆమోదం పొందాల్సి ఉంది. ఈ బిల్లును సెలక్ట్ కమిటీకి పంపాలని కాంగ్రెస్ చేసిన ప్రతిపాదనను ప్రభుత్వం తిరస్కరించింది. ప్రతిపక్షాలతో ఏకాభిప్రాయం సాధించే విధంగా కృషి చేస్తున్నామని,బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కా గానే కాంగ్రెస్ నేత ఆనంద్ శర్మ చేసిన ప్రతిపాదన పై చర్చ జరగనుందని అధికారిక వర్గాలు తెలియజేశాయి. ట్రిపుల్ తలాక్ బిల్లుపై ఆర్డినెన్స్ తీసుకువచ్చే ఆలోచన ప్రభుత్వానికి లేదని అధికారికవర్గాలు స్పష్టం చేశాయి.

## బడ్జెట్ సమావేశాలు

(మొదటిపేజీ తరువాయి)

మీడియాకు వివరించారు. ఫిబ్రవరి 1న బడ్జెట్ ప్రవేశపెట్టే సంప్రదాయాన్ని కేంద్రం గతేడాది నుంచి ప్రారంభించింది. ఎన్నికల ముందు ప్రవేశపెట్టనున్న పూర్తిస్థాయి బడ్జెట్ ఇదే కావడంతో ప్రజాకర్షక పథకాలకు ఎక్కువ మొత్తంలో కేటాయింపులు ఉంటాయని భావిస్తున్నారు. మరోవైపు శీతాకాల సమావేశాల్లో రాజ్యసభలో ఆమోదం పొందలేకపోయిన ట్రిపుల్ తలాక్ బిల్లు బడ్జెట్ సమావేశాల్లో మరోసారి చర్చకు వచ్చే అవకాశం ఉంది.

# ఎరువుల 'ఆన్‌లైన్'పై ఆరా

- అమ్మకాలపై ఎప్పటికప్పుడు రాష్ట్రాల నుంచి పిఎంఒ నివేదికలు
- రైతు కాకపోయినా ఆధార్ ఉంటే ఎరువు కొనుగోలు చేసే అవకాశం



**మన తెలంగాణ**/హైదరాబాద్ : ఎరువుల ఆన్‌లైన్ విక్రయాలను (నేరుగా రాయితీ బదిలీ విధానాన్ని) ప్రధాన మంత్రి కార్యాలయం ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తోంది. ఈ విధానంలోనూ ఏమైనా అక్రమాలు చోటు చేసుకుంటున్నాయా అనే దానిపై రాష్ట్రాల నుంచి కేంద్ర అధికారులు ఎప్పటికప్పుడు నివేదికలు తెప్పించుకుంటున్నారు. డిబిటిలో ఎరువుల విక్రయానికి రైతుల ఆధార్ సంఖ్యను నమోదు చేయడంతో పాటు వారి వేలిముద్రలను కూడా తీసుకుంటున్నారు.అయితే ఇక్కడ ఎరువు కొనుగోలు చేసేందువు వచ్చింది ఖచ్చితంగా రైతు అని గుర్తించే వీలు మాత్రం లేదు. ఆధార్ కార్డు ఉన్న ఎవరైనా ఎరువులు కొనుగోలు చేసే వీలుంది. ఈ క్రమంలో కంపెనీల కమిషన్‌కు ఆశపడి డీలర్లు అక్రమాలకు పాల్పడే ప్రమాదం ఉందని ప్రభుత్వం భావిస్తోంది. అందులో భాగంగానే రోజువారి ఎరువుల విక్రయాలను కేంద్రం నిశితంగా పరిశీలిస్తున్నట్లు తెలిసింది. ఇష్టారీతిన అమ్మకాలు జరిగినట్లు గుర్తిస్తే చర్యలు కూడా తీసుకోనున్నట్లు వ్యవసాయ శాఖ ఉన్నతాధికారి ఒకరు 'మన తెలంగాణ'కు చెప్పారు. భూసార పరీక్ష కార్డులు రైతులందరికీ అందితే దానికి అనుగుణంగానే ఎరువుల విక్రయాలు చేపట్టాలనే ప్రతిపాదన కేంద్రం వద్ద ఉందన్నారు. ఎరువుల రాయితీ దుర్వినియోగానికి అడ్డుకట్ట వేసేందుకు కేంద్రం అన్ని రాష్ట్రాలలో దశలవారీగా డిబిటి ప్రక్రియను అమలు చేస్తున్న విషయం తెలిసిందే. ఆరు రాష్ట్రాల మినహా దేశంలోని అన్ని రాష్ట్రాలలో ఈ విధానం అమలులోకి వచ్చింది. ఫిబ్రవరి నెల నుంచి దేశం మొత్తం అమలు కానుంది. ఎరువులకు చెల్లించాల్సిన రాయితీ ఏడాదికి రూ. 70 వేల కోట్ల వరకు వెళ్లడం, ప్రతి సంవత్సరం ఈ మొత్తం పెరుగుతుండటం ఆర్థిక భారంగా మారింది. అయితే ఇందులో కంపెనీలు అక్రమంగా సబ్సిడీని కాజేస్తున్నాయనే విమర్శలు ఉన్నాయి. దీనిని నివారించేందుకు డిబిటి అమలు చేస్తోన్న కేంద్ర ప్రభుత్వం గత ఏడాది నుంచే జిల్లాల వారీగా, రాష్ట్రాల వారీగా కేంద్రం ఎరువుల విక్రయాల లెక్కలను సేకరించింది. వివిధ కంపెనీలు ఏయే ఎరువులను ఏ స్థాయిలో ఉత్పత్తి చేస్తున్నాయో, వాటికయ్యే ఖర్చులపై కూడా వివరాలు తెప్పించుకుంది. తద్వారా ఎరువుల అమ్మకం, వినియోగంపై పక్కా లెక్కలు రానున్నాయి. మన రాష్ట్రంలో ఈ నెల 1వ తేదీ నుంచే పాయింట్ ఆఫ్ సేల్ నుంచి ఆన్‌లైన్‌లోనే ఎరువుల విక్రయాలు జరుగుతున్నాయి. రాష్ట్రం మొత్తం 6693 పిఒఎస్ మిషన్‌లు రిటైల్ డీలర్లకు పంపిణీ చేశారు. ఇందులో ఈ నెల 3వ తేదీన 3240 పిఒఎస్‌లతో మొత్తంగా 10041 మెట్రిక్ టన్నులవిక్రయాలు జరిపారు.నిజామాబాద్, కామారెడ్డి,మెదక్ జిల్లాల్లో అమ్మకాలు అత్యధికంగా చేశా రు.మిగిలిన పిఒఎస్‌లు విక్రయాలు మొదలుపెట్టలేదని తెలిసింది.

**ఎరువుల అమ్మకం.. వినియోగంపై పక్కా లెక్కలు !**

ప్రస్తుతం అమలవుతున్న డిబిటి విధానంతో ఎరువుల అమ్మకాలతో పాటు వినియోగంపై కూడా పక్కా లెక్కలు వస్తాయని కేంద్రం భావిస్తోంది. ఇప్పటి వరకు ఎక్కడ ఎంత ఎరువు అమ్ముడుపోయిందనే వివరాలు స్పష్టంగా లేవు. ఆన్‌లైన్ విక్రయాలలో రోజువారీగా వివరాలు నమోదు అవుతున్నాయి. ఫలితంగా ఏ ప్రాంతంలో ఏయే ఎరువును ఎంత కొనుగోలు చేసి వినియోగిస్తున్నారనే దానిపై పూర్తి వివరాలు తెలియనున్నాయి.

## జస్టిస్ థామస్‌పై నారాయణ ఫైర్

**మన తెలంగాణ**/న్యూఢిల్లీ: బిజెపి అనుబంధ సంస్థ అయిన ఆర్‌ఎస్‌ఎస్ ను దేశ సైనికులతో సమానంగా కలుపుతూ, వారు సైన్యం తరువాత దేశానికి సేవచేసారన్న సుప్రీంకోర్టుమాజీ న్యాయ మూర్తి కెటీ థామస్ కి శిక్షవిధించాలని సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ డిమాండ్ చేశారు. భారత దేశంలో రాజ్యాంగ వ్యవస్థలను, రాజకీయ వ్యవస్థలను అవమానించే విధంగా వ్యాఖ్యానించిన ఆయన పై చర్యలు తీసుకోవాలని కోరారు. బిజెపితో సహా అన్ని రాజకీయ పార్టీలను అవమానించే విధంగా కేటీ థామస్ మాట్లాడారని ఆరోపించారు. దేశాన్ని ఆర్‌ఎస్‌ఎస్, సైన్యమే కాపాడుతారని వ్యాఖ్యానించడం అంటే రాజకీయ వ్యవస్థలను, పార్టీలను అవమానించడమే అవుతుందని నారాయణ వ్యాఖ్యానించారు. దేశంలో మతోన్మాదాన్ని పెంచిపోషించన సంస్థ, జాతిపిత మహాత్మాగాంధిని హత్య చేసిన గాడ్సే ఆర్‌ఎస్‌ఎస్ నాయకుడే అని అన్నారు. బాబ్రీ మసీద్ ని కూలగొట్టింది, గోవధ నిషేధం పేరుతో దేశంలో దళితులపై, మైనారిటీలపై దాడులు ప్రోత్సహిస్తున్నది ఆర్ఎస్ఎస్ నాయకులే అని ఆయన ఆరోపించారు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి పై అనేక కేసులున్నాయని, కొంత మంది కమ్యూనిస్టు నేతల తలలు నరికితే కోట్లాది రూపాయలు ఇస్తామంటున్నారు, మరికొంత మంది నేతలయితే దేశ రాజ్యాంగాన్ని మారుస్తామని వ్యాఖ్యానిస్తున్నారని నారాయణ ఆరోపించారు. దేశంలో ఆర్‌ఎస్‌ఎస్ ఒక విచ్ఛిన్నకర పాత్రను పోషిస్తూ, దేశంలో లౌకికవాదాన్ని దెబ్బతీస్తున్నదని అన్నారు. దేశంలో మైనారిటలకు రక్షణ లేని పరిస్థితులను ఆర్‌ఎస్‌ఎస్ కల్పిస్తున్నదని, అలాంటి ఆ సంస్థ దేశాన్ని ఏవిధంగా కాపాడుతుందని నారాయణ ప్రశ్నించారు. సైన్యం మాత్రమే దేశాన్ని కాపాడుతుందంటే, మిలటరీ నియంతృత్వం రావడమే కదా అన్ని అన్నారు. అప్పుడు రాజకీయ వ్యవస్థ ఏమయింది అని ప్రశ్నించిన నారాయణ, ఈ విషయంలో బిజెపి కూడా ఆలోచించాలని కోరారు. ఈ వ్యాఖ్యలు చేసిన థామస్ పై క్రిమినల్ కేసు పెట్టాలని నారాయణ డిమాండ్ చేశారు.

# రైతుకు మద్దతు నిధి



(మొదటిపేజీ తరువాయి)

పీడలు రాకుండా తీసుకోవాల్సిన ముందు జాగ్రత్త చర్యలపై వ్యవసాయ విస్తరణాధికారులు రైతులకు అవగాహన కల్పించాలని సిఎం కోరారు.

**మద్దతు ధరపై కేంద్రంతో మాట్లాడుతాం... పార్లమెంట్‌లో ప్రస్తావిస్తాం :** మద్దతు ధర విషయంలో కేంద్ర ప్రభుత్వం కూడా మరింత ఉదారంగా వ్యవహరించాల్సి ఉందని కెసిఆర్ అన్నారు. వరి, మక్కలకు ప్రస్తుతం ప్రకటించిన మద్దతు ధర పెరగాల్సి ఉందన్నారు. ఈ రెండింటికి రూ.2వేల మద్దతు ధర ప్రకటించాలని కోరారు. కొన్ని వ్యవసాయ ఉత్పత్తులకు అసలు మద్దతు ధరే లేదని, కాబట్టి దేశంలో పండే ప్రతీ పంటకు మద్దతు ధర ప్రకటించే విధంగా కేంద్ర విధానం ఉండాలన్నారు.దీనిపై రాష్ట్ర ప్రభుత్వంగా కేంద్రంతో మాట్లాడుతామని తెలిపారు. టిఆర్ఎస్ పార్టీ పరంగా పార్లమెంటులో కూడా ప్రస్తావిస్తామని సిఎం ప్రకటించారు. రైతులకు మద్దతు ధర వచ్చే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిజాయితీగా వ్యవహరిస్తోందన్నారు. వరిధాన్యం, మక్కలు, పప్పులు లాంటి సంప్రదాయ పంటలే కాకుండా పసుపు, మిర్చి, పత్తి లాంటి వాణిజ్య పంటలకు, మామిడి, నిమ్మ, బత్తాయి లాంటి పండ్లకు కూడా మంచి ధర రావాలన్నదే తమ లక్ష్యమని, ప్రభుత్వ విధానం కూడా అలాగే ఉంటందన్నారు. రాష్ట్రంలో మార్కెటింగ్ శాఖ కొత్తగా గోదాముల నిర్మాణం జరుగుతోందని 22.50 లక్షల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం కలిగిన గోదాములు అందుబాటులోకి వస్తాయన్నారు. వేర్ హౌజింగ్, ఎఫ్.సి.ఐ. గోదాములు కూడా కలుపుకుంటే రాష్ట్రంలో 53 లక్షల టన్నుల నిల్వ సామర్థ్యం కలిగిన గోదాములుంటాయని, వీటిని ఎరువులు, విత్తనాలు నిల్వ చేసుకోవడానికి కూడా ఉపయోగించుకోవచ్చని సిఎం చెప్పారు.

**ఆహార పదార్థల వినియోగం ఆధారంగా పంటకాలనీలు**

రాష్ట్రంలో ప్రజలు వినియోగించే ఆహార పదార్థాలు ఎన్ని అనే విషయంలో ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థతో అధ్యయనం చేయిస్తున్నదని, దానికి అనుగుణంగా క్రాప్ కాలనీలు నిర్ధారించి, పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తామన్నారు. మంచి మార్కెట్ ఉన్న పంటలను, నాణ్యతారకాలను ఎంపిక చేసుకుని సాగు చేయాల్సిందిగా రైతులను కోరనున్నట్లు వెల్లడించారు. కల్తీ విత్తనాల విషయంలో ఈ ఏడాది కూడా వ్యవహరించాలని ముఖ్యమంత్రి అధికారులను కోరారు. విత్తనాల తయారీ దారులు, అమ్మకం దారుల వివరాలు, ఫోటోలు ముందే సేకరించి పెట్టుకోవాలని, ఎక్కడ ఏ పొరపాటు జరిగినా వెంటనే స్పందించాలని సూచించారు.ఈ సమీక్షసమావేశంలో ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్ శర్మ, సలహాదారు అనురాగ్ శర్మ, జెన్‌కో/ట్రాన్స్ కో సిఎండి డి.ప్రభాకర్ రావు, వ్యవసాయ శాఖ కార్యదర్శి సి.పార్థసారథి. ఉద్యాన కమిషనర్ ఎల్. వెంకట్రామ్ రెడ్డి, వ్యవసాయ యూనివర్సిటీ విసి ప్రవీణ్‌రావు, సిసిఎల్ఎ డైరెక్టర్ వాకాటి కరుణ, సిఎంఓ ముఖ్య కార్యదర్శి ఎస్.నర్సింగ్ రావు, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లా కలెక్టర్లు రఘునందన్ రావు, ఎంవి రెడ్డి తదతరులు పాల్గొన్నారు.

**మొదటి దశ రికార్డుల ప్రక్షాళన పూర్తి :** మొదటి దశ భూరికార్డుల ప్రక్షాళన పూర్తయినట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. రాష్ట్రంలో 71,75,096 వ్యవసాయ ఖాతాలున్నట్లు తేలిందని, 1,42,12,826.17 ఎకరాల వ్యవసాయయోగ్యమైన భూమి ఉన్నట్లు లెక్కకొచ్చిందని సిఎం ప్రకటించారు. రాష్ట్రంలో భూ రికార్డుల ప్రక్షాళన కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసిన డైరెక్టర్ వాకాటి కరుణ, రెవెన్యూ అధికారులు, జిల్లాల కలెక్టర్లు, ఇతర సిబ్బందికి కెసిఆర్ శుభాకాంక్షలు తెలిపారు.వీలైనంత తొందరలో రైతులకు కొత్త పాస్ పుస్తకాలు అందివ్వనున్నట్లు వెల్లడించారు. ఇప్పటి నుంచి భూముల క్రయ, విక్రయాలు జరిగిన వెంటనే ఆ వివరాలు రాష్ట్ర అధికారుల వద్ద కూడా నమోదు కావాలని చెప్పారు. భూముల మ్యుటేషన్ అధికారం కూడా ఎమ్ఆర్ఓలకే అప్పగిస్తున్నామని, ఇక ఆర్‌డిఒల దగ్గరికి వెళ్లాల్సిన అవసరం లేదన్నారు.

**మంత్రులకు, అధికారులకు అభినందించిన సిఎం**

రైతులకు సకాలంలో ఎరువులు, విత్తనాలు అందించే విషయంలో మంత్రి పోచారం, వ్యవసాయ కార్యదర్శి పార్థసారథి నాయకత్వంలో అధికారులువిశేష కృషి చేశారని సిఎం అభినందించారు. పెండింగ్ ప్రాజెక్టులతో పాటు, రాష్ట్రంలోని పాలమూరు–రంగారెడ్డి, కాళేశ్వరం, సీతారామ, దేవాదుల పనులను శరవేగంగా పూర్తి చే యడానికి కృషి చేస్తున్న మంత్రి హరీష్ ,అధికారులను కెసిఆర్ ప్రశంసించారు. విద్యుత్ రంగంలో అత్యుత్తమ సేవలందించి సిబిఐపి అవార్డు అందుకున్న జెన్‌కో, ట్రాన్స్‌కోసిఎండి ప్రభాకర్ రావును సిఎం అభినందించారు.

## విఆర్ఎ కాదు

(మొదటిపేజీ తరువాయి)

కాకివాగును పరిశీలించామని తెలిపారు. ఘటన స్థలంలో ఇరువైపులా వ్యవసాయ భూములున్నాయని అక్కడ ఎలాంటి ఇసుక క్వారీలు లేవన్నారు. మృతుడు సాయిలు విఆర్ఎ కాదన్నారు. అతని బాబాయి సాయిలు విఆర్ఏగా పని చేస్తున్నారన్నారు. కాకి వాగును ఇరిగేషన్ ,రెవెన్యూ శాఖలు పరిశీలించి అక్కడ ఏలాంటి ఇసుక లేదని తెలిపారన్నారు. కాకి వాగులో రాళ్లబండలు మాత్రమే ఉన్నాయని అవి దేనికి పనికి రావన్నారు.మృతుని భార్య సాయవ్వను భర్త మృతిపై వివరాలు అడుగగా బుధవారం రాత్రి కుటుంబ తగాదాలతో ఇంటి నుంచి బయటకు వెళ్లారని తెలిపారు. జిల్లాలో కేవలం బిచ్కుంద , బిర్కూర్ మండలాల్లో ఇసుక క్వారీలకు అనుమతులు ఉన్నాయని, వాటి నుండి ప్రభుత్వ పనులకు మాత్రమే ఇసుక రవాణా జరుగుతుందన్నారు. కామారెడ్డి, సిద్దిపేట జిల్లాల సరిహద్దుల్లో బిబిపేట మండలంలో తుజాల్‌పూర్ గ్రామం నుండి ఇసుకను డబుల్ బెడ్‌రూం ఇళ్లకు, ప్రభుత్వ పనులకు మాత్రమే ఉపయోగిస్తున్నారని తెలిపారు. ఏడుగురు రైతులు పట్టేదారులకు మాత్రమే అనుమతులు ఇచ్చామన్నారు. స్థానిక తహసీల్దార్,ఆర్‌డిఒలఅనుమతులతో ఒక్కో ట్రాక్టర్‌కు 630 రూపాయల చొప్పున ప్రభుత్వ పనులకు విక్రయిస్తున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా అక్రమంగా తరలిస్తున్న ఇసుకను నివారించేందుకు టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేశామన్నారు.44 ట్రాక్టర్‌లను సీజ్ చేసి 32 కేసులు నమోదు చేసి రూ.3 లక్షల 82 వేలు జరిమానా విధించామన్నారు. జిల్లాలోని ప్రభుత్వ పనులకు సిరిసిల్ల జిల్లా కోడిపుంజ వాగు నుండి ఇసుకను జిల్లాకు తీసుకొస్తున్నామన్నారు. జిల్లాలో ప్రైవేటు వ్యక్తులకు ఏలాంటి అనుమతులు ఇవ్వలేదన్నారు. బుధవారం రాత్రి జరిగిన ఘటన ప్రమాదవశాత్తు మాత్రమే జరిగిందని తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేశామన్నారు. విఆర్ఏ సాయిలు మృతిపై తమ శాఖకు ఏలాంటి ఫిర్యాదులు అందలేదన్నారు. అనంతరం ఎస్‌పి శ్వేతారెడ్డి మాట్లాడుతూ పిట్లం మండలంలో జరిగిన ఉదంతంపై శుక్రవారం సంఘటనా స్థలాన్ని పరిశీలించామని సంఘటనకు సంబంధించి 8 మంది సాక్షులను విచారించగా ఇసుక ట్రాక్టర్‌తో మృతి చెందలేదని తెలిపారన్నారు. ట్రాక్టర్‌ను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్ తరలించామని తెలిపారు. భార్యభర్తల మధ్య జరిగిన గొడవే సాయిలు మృతికి దారి తీసిందని, మృతుడు తాగి ఉన్నాడా లేదా అనే కోణాల్లో పరిశీలిస్తున్నామని, పోస్టుమార్టం నివేదిక ద్వారా పూర్తి సమాచారం వెల్లడిస్తామని తెలిపారు. ఐపిసి 304 సెక్షన్ కింద కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌పి తెలిపారు.మృతుని కుటుంబానికి నష్టపరిహారం అందిస్తున్నారా అని విలేకరులు అడిగిన ప్రశ్నకు కలెక్టర్ స్పందిస్తూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం నష్టపరిహారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో జెసి సత్తయ్య, మైనింగ్ ఎడి రవి కుమార్, బాన్సువాడ డిఎస్‌పి నరసింహారావు, ఆర్డిఒలు రాజేశ్వర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## గజ్వేల్‌లో ధర్మదీక్షకు హైకోర్టు అనుమతి

**మన తెలంగాణ**/ హైదరాబాద్ : సిద్ధిపేట జిల్లా గజ్వేల్‌లో ఈ నెల 7న తలపెట్టిన 'ధర్మదీక్ష'కు హైకోర్టు అనుతినిచ్చింది. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్‌ను వ్యతిరేకిస్తూ దాని స్థానంలో పాత పెన్షన్ విధానాన్నే ప్రవేశపెట్టాలనే డిమాండ్‌తో దీక్షకు తెలంగాణ స్టేట్ కాంట్రిబ్యూటరీ పెన్షన్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అనుమతి కోరగా, అందుకు పోలీసులు తొలుత అనుమతినిచ్చారు. ఆ తరువాత దానిని రద్దు చేశారు. దీనిపై అసోసియేషన్ హైకోర్టును ఆశ్రయించింది. శాంతియుతంగా తలపెట్టిన 'ధర్మదీక్ష' అనుమతించాల్సిందిగా జస్టిస్ భట్ ధర్మాసనం ఎదురుగా పిటిషనర్‌ల తరుపున న్యాయవాది జంధ్యాల రవి శంకర్ వాదనలు వినిపించింది. దీంతో హైకోర్టు అనుమతినిచ్చింది.

## నేటి నుంచి గొంగడి ప్రదర్శన !

**మన తెలంగాణ**/హైదరాబాద్ : దెక్కని గొర్రెల, మేకల పెంపకందార్ల సంఘం, ఆహార సార్వభౌమత్వ సంఘటన సంయుక్త ఆధ్వర్యంలో శనివారం, ఆదివారం హైదరాబాద్‌లో బేగంపేటలోని 'దారం'లో ఉన్ని హస్తకళ గొంగడి ప్రదర్శన జరగనుంది. ఈ వివరాలను దెక్కని గొర్రెల మేకల పెంపకందార్ల సంఘం ప్రతినిధి యాదగిరి శుక్రవారం మీడియాకు వెల్లడించారు. నల్లగొర్రె జాతి నుంచి వచ్చే ఉన్నితో తయారయ్యే గొంగడి కనుమరుగవుతోందని దీనిపై ప్రభుత్వం దృష్టి సారించాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ మీద ముందుగా దెక్కని గొర్రెలను పంపిణీ చేస్తామని చెప్పినప్పటికీ ఇతర రాష్ట్రాల నుంచి తెచ్చే గొర్రెలు ఆ రకంలో లేవన్నారు. దీని ఫలితంగా నల్లగొర్రెల ఉనికి,గొంగడి మనుగడ దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. అత్యంత పురాతనమైన ఈ హస్తకళను కొన సాగించడం వాటికి కావాల్సిన నల్లగొర్రెలను ప్రోత్సాహించడంపై అవగాహన కల్పించేందుకే గొంగడి ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ మీడియా సమావేశంలో కృప కూడా పాల్గొన్నారు.

## అవమానాల నుంచి అద్భుతాల దిశగా తెలంగాణ : స్పీకర్

**మన తెలంగాణ**/హైదరాబాద్: ఉద్యమ సమయంలో ఎదురైన అనుభవాలు, అవమానాలనే సవాల్‌గా తీసుకొని రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తోందని శాసనసభ స్పీకర్ సిరికొండ మధుసూధనాచారి అన్నారు. తెలంగాణ ఎలక్ట్రిసిటీ అకౌంట్స్ స్టాఫ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 2018 డైరీని స్పీకర్ శుక్రవారం ఆవిష్కరించారు. మింట్ కాంపౌండ్‌లో శుక్రవారం జరిగిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యుత్ కోతలు లేని రాష్ట్రం తెలంగాణ అని, మిషన్ కాకతీయ, ప్రాజెక్టులతో సాగునీరు, మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ మంచినీరు అందిస్తున్న రాష్ట్రమని సంతోషం వ్యక్తపరిచారు.ఈ సమావేశంలో ఎంఎల్‌ఎ శ్రీనివాస్ గౌడ్, టిఎస్ ఎస్‌పిడిసిఎల్ సిఎండి గౌరవరం రఘుమారెడ్డి పాల్గొన్నారు.

## ఈనెల 21న 'బిసి ఉద్యోగుల రాష్ట్ర మహాసభ'

**మన తెలంగాణ**/హైదరాబాద్: బిసి ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు, జాతీయ బిసి కమిషన్‌కు రాజ్యాంగబద్ధమైన హక్కును కల్పించాలనే డిమాండ్‌తో ఈ నెల 21న హైదరాబాద్‌లోని ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో 'బిసి ఉద్యోగుల రాష్ట్ర మహాసభ'ను నిర్వహించనున్నట్లు తెలంగాణ రాష్ట్ర బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్, బిసి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఇ.నిరంజన్ తెలిపారు. ఈ మహాసభలకు ముఖ్యఅతిథులుగా కేంద్ర మంత్రులు హన్సరాజ్ గంగారం, రామ్‌దాస్ ఆథ్‌వాలే, రాష్ట్ర మంత్రులు ఈటల రాజేందర్, జోగు రామన్న హాజరుకానున్నట్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బిసి క్రీమీలేయర్‌ను పూర్తిగా ఎత్తివేయాలని, బిసి ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, జాతీయ స్థాయిలో ఒబిసిలను వర్గీకరించి బిసి కులాలన్నింటికీ సమన్యాయం చేయాలని, ప్రత్యేకంగా బిసి కులాల జనాభాను లెక్కించాలని వారు డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు.

## పదోన్నతులకు వివరాలను పంపండి

### సాగునీటిపారుదల కార్యదర్శి ఆదేశం

**మన తెలంగాణ**/హైదరాబాద్: జోన్ 5, 6 లలో పనిచేస్తున్న ఇరిగేషన్ ఉద్యోగుల జాబితాలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి సమర్పించాలని నీటి పారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శైలేంద్ర కుమార్ జోషి ఆదేశించారు. హైకోర్టు ఆదేశాల ప్రకారం రెండు జోన్లలో 2014 జూన్ 1వ తేదీ నాటికి పనిచేస్తున్న ఎఇఇ, ఎఇ, టెక్నికల్ అధికారుల జాబితాతో పాటు వార్షిక కాన్ఫిడెన్షియల్ రిపోర్టులు, చార్జెస్ వెరిఫికేషన్ రిపోర్టులు ఇవ్వాలని ఇఎన్‌సి (అడ్మినిస్ట్రేషన్) నాగేందర్‌కు సూచించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి సహకరించేందుకు వీలుగా ప్రత్యేక అధికారిని sనియమించాలని కోరారు.



## భూముల మార్కెట్ ధరను నిర్ణయించేది ప్రభుత్వమే

**మన తెలంగాణ**/ హైదరాబాద్ : భూసేకరణ చట్టం కింద ఎకరాకు రూ.85 వేలు, అదే భూసేకరణలో రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఇచ్చిన భూమి ఎకరాకు రూ. 6 లక్షలు చెల్లించడం అన్యాయమని సింగిల్ జడ్జి గతంలో వెలువరించిన ఉత్తర్వులను శుక్రవారం హైకోర్టు డివిజన్ బెంచ్ రద్దు చేసింది. తమకు తాముగా ముందుకు వచ్చిన రైతులకు పరిహారంగా చెల్లించిన రూ.6 లక్షలను మార్కెట్ విలువగా నిర్ణయించినట్లుగా సింగిల్ జడ్జి ఉత్తర్వులు ఉన్నాయని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి శ్యాంప్రసాద్‌లతో కూడిన డివిజన్ బెంచ్ జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వుల్లో పేర్కొంది. స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన రైతులకు రూ.6 లక్షలు, భూసేకరణలో రైతులకు రూ.85 వేలు చెల్లించడం రాజ్యాంగ వ్యతిరేకమని సింగిల్ జడ్జి ఉత్తర్వుల అమలును బెంచ్ రద్దు చేసింది. మార్కెట్ ధరను ప్రభుత్వం నిర్ణయిస్తుందేగానీ కోర్టులు కాదని బెంచ్ స్పష్టం చేసింది. అయితే సిద్దిపేట జిల్లా కలెక్టర్ భూముల మార్కెట్ విలువల సవరణకు ఇచ్చిన ఉత్తర్వుల అమలును నిలిపివేస్తూ సింగిల్ జడ్జి ఉత్తర్వుల్లో జోక్యం చేసుకునేందుకు బెంచ్ నిరాకరించింది. కలెక్టర్ భూముల ధరల ఉత్తర్వులను సిద్దిపేటకు చెందిన నర్సింహారెడ్డి ఇతరులు సవాల్ చేసిన కేసులో హైకోర్టు పైవిధంగా మధ్యంతర ఆదేశాలిస్తూ.. స్టే రద్దుకు తిరిగి సింగిల్ జడ్జి దగ్గరకు వెళ్లాలని బెంచ్ స్పష్టం చేసింది.

# వికలాంగుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**జాతీయ సెన్సార్ పార్కు ప్రారంభోత్సవంలో కెటిఆర్**




**మన తెలంగాణ**/హైదరాబాద్/ మాదన్నపేట్ : దేశంలో ఎక్కడా లేనివిధంగా వికలాంగుల కోసం జాతీయ సెన్సార్ పార్క్‌ను ఏర్పాటు చేయడం తెలంగాణ రాష్ట్రానికే గర్వకారణమని ఐటి, పురపాలక శాఖ మంత్రి కెటిఆర్ అన్నారు. మలక్‌పేట్ నల్గొండ క్రాస్‌రోడ్‌లోని వికలాంగుల సహకార సంస్థ ఆవరణలో జిహెచ్‌ఎంసి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాతీయ సెన్సార్ పార్క్ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథులుగా డిప్యూటీ సిఎం మహమూద్ అలీ, కెటిఆర్, హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి, రవాణాశాఖ మంత్రి మహేందర్‌రెడ్డి,హైదరాబాద్ పార్లమెంట్ సభ్యులు అసదుద్దీన్ ఒవైసీ, మేయర్ బొంతు రామ్మోహన్, మలక్‌పేట్ ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్ బలాల, డిప్యూటీ మేయర్ బాబా ఫసీయుద్దీన్, జిహెచ్‌ఎంసి కమిషనర్ జనార్ధన్‌రెడ్డి, రాష్ట్ర వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ వాసుదేవారెడ్డిలు విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ వికలాంగుల సంక్షేమానికి కెసిఆర్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. వికలాంగులు శారీరకంగా, మానసికంగా అభివృద్ధి చెందడానికి ఇక్కడ ఆర్థోపెడిక్ థెరపీ, ఆంపి థియేటర్, ఫిజియోథెరపీ బ్లాక్‌లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జిహెచ్‌ఎంసి, ఆయేషా ఎడ్యుకేషనల్ సొసైటీ ఇది సహకారంతో నడుస్తుందన్నారు. వికలాంగుల అభివృద్ధి కోసం పాటుపడుతున్న ఆయేషా సొసైటీ నిర్వాహకురాలు ఆయేషా రూబినాను అభినందించారు. రాష్ట్రంలోని ఆరు కార్పొరేషన్‌లో వికలాంగుల కోసం ఇలాంటి పార్క్‌లను ఏర్పాటు చేస్తామని తెలిపారు. రాష్ట్రంలో వికలాంగుల జనాభా 3శాతం ఉందని, డబుల్ బెడ్‌రూం పథకంలో వీరికి అవకాశం కల్పిస్తామన్నారు. వారికి అనుగుణంగా గ్రౌండ్ ఫ్లోర్‌లో నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఇందు కోసం వెంటనే ఉత్తర్వులు జారీ చేస్తానని పేర్కొన్నారు. రానున్న కాలంలో వికలాంగుల కోసం మరిన్ని సంక్షేమ పథకాలను తీసుకొస్తామని తెలిపారు. డిప్యూటీ సిఎం మాట్లాడుతూ తెలంగాణ అభివృద్ధికి కెసిఆర్ ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. వికలాంగుల పింఛన్‌ను రూ.500 నుంచి 1500లకు పెంచిన ఘనత కెసిఆర్‌కే దక్కిందన్నారు. హోంమంత్రి నాయిని మాట్లాడుతూ జిహెచ్‌ఎంసి ఆధ్వర్యంలో వికలాంగుల కోసం ఇక్కడ జాతీయ పార్క్‌ను ఏర్పాటు చేయడం శుభపరిణామమన్నారు. వికలాంగులకు సహాయం చేస్తే సమాజం గౌరవిస్తుందని తెలిపారు. మహేందర్ రెడ్డి మాట్లాడుతూ వికలాంగుల మానసిక, శారీరక దారుఢ్యానికి కోసం ఈ పార్క్‌ను ఏర్పాటు చేశామన్నారు. మేయర్ మాట్లాడుతూ సిఎం సూచన మేరకు దేశంలో ఎక్కడా లేనివిధంగా వికలాంగుల కోసం జాతీయ సెన్సార్ పార్క్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఈ పార్క్ కోసం జిహెచ్‌ఎంసి నిధుల నుంచి రూ.2కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. వికలాంగులను పెళ్లి చేసుకున్నా వారికి రూ.50వేల నుంచి లక్ష వరకు పారితోషికం ఇస్తున్నట్లు తెలిపారు. వికలాంగుల సంక్షేమ డైరెక్టర్ శైలజ, జిహెచ్‌ఎంసి సౌత్‌జోన్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి,ఓల్డ్ మలక్‌పేట్ కార్పొరేటర్ జువేరియా ఫాతిమా, టిఆర్‌ఎస్ నాయకులు చొవ్వ సతీష్, బాలగౌని మల్హోత్ర గౌడ్, దర్శనం నర్సింగ్, మన్నె రంగా వికలాంగుల ఫెడరేషన్ సభ్యులు గంగారాం, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

**ఫ్లెక్సీల ఏర్పాటుపై కెటిఆర్ ఆగ్రహం : కార్పొరేటర్లకు జరిమానా విధింపు**

మలక్‌పేట్ శ్రీపురంకాలనీలో షటిల్ బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియం ప్రారంభోత్సవానికి వచ్చిన మంత్రి కెటిఆర్‌కు స్వాగతం పలుకుతూ పెద్ద ఎత్తున ఫ్లెక్సీలు, బ్యానర్లు రహదారులు, మలక్‌పేట్ ఫ్లైఓవర్లపై ఏర్పాటు చేశారు. ఈ ఫ్లెక్సీల ఏర్పాటుపై నిషేధం ఉన్నప్పటికీ పెద్ద ఎత్తున ఫ్లెక్సీలు ప్రదర్శించడంపై నగర మేయర్ బొంతు రామ్మోహన్ మంత్రి దృష్టికి తీసుకవచ్చారు. దీంతో ఫ్లెక్సీ నిషేధం అమలులో ఆదర్శంగా ఉండాల్సిన కార్పొరేటరే స్వయంగా నిబంధనలను అతిక్రమించి ఫ్లెక్సీ బ్యానర్లు ఏర్పాటు చేయడంపై కెటిఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన కార్పొరేటర్ సునరితారెడ్డితో పాటు మాజీ కార్పొరేటర్ మహ్మద్ అస్లాంలకు జరిమానా విధించాల్సిందిగా కెటిఆర్ ఆదేశించారు. దీంతో సునరితారెడ్డికి రూ.50 వేలు, మహ్మద్ అస్లాంకు రూ.25 వేలు జరిమానా విధిస్తూ జిహెచ్‌ఎంసి అధికారులు నోటీసులు జారీ చేశారు. మంత్రికి స్వాగతం పలుకుతూ ఏర్పాటు చేసిన బ్యానర్లు, ఫ్లెక్సీలు, తోరణాలు, జెండాలను మేయర్, డిప్యూటీ మేయర్‌లు జిహెచ్‌ఎంసి సిబ్బందితో తొలగింప చేశారు. కాగా, జరిమానాగా విధించిన మొత్తాన్ని చెక్‌ల రూపంలో కార్పొరేటర్ సునరితారెడ్డి, మాజీ కార్పొరేటర్ అస్లాంలు జిహెచ్‌ఎంసి అధికారులకు అందచేశారు.

## భర్తను కడతేర్చిన భార్య



**మన తెలంగాణ**/చౌటుప్పల్ : ప్రియుడి మోజులో పడి కట్టుకున్న భర్తనే కడతేర్చిన భార్యను పోలీసులు అరెస్టు చేశారు. చౌటుప్పల్ ఎసిపి కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యాదాద్రి భువనగిరి డిసిపి రామచంద్రారెడ్డి ఈ హత్య కేసు వివరాలు వెల్లడించారు. నిందితులను విలేకరుల ఎదుట ప్రవేశపెట్టారు. మహబూబ్‌నగర్ జిల్లా రాచర్ల గ్రామానికి చెందిన కమ్మరి నాగరాజు (28) అదే గ్రామానికి చెందిన జ్యోతిని గత ఐదేళ్ల క్రితం పెళ్లి చేసుకున్నాడు. వీరికి ఒక పాప జీవిత (4), ఒక బాబు యశ్వంత్ (01) అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు. పెళ్లికి ముందు జ్యోతి హైదారాబాద్ నాచారంలోని తన మేనమామ ఇంట్లో జరిగే ఒక శుభ కార్యానికి వెళ్లింది. అక్కడ మహంకాళి కార్తీక్ అనే యువకుడితో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం కాస్తా ప్రేమించుకునే దాకా వెళ్లింది. ఇద్దరూ కలిసి పెళ్లికూడా చేసుకుందామనుకున్నారు. కాని..ఆమె తల్లిదండ్రులు కమ్మరి నాగరాజుతో పెళ్లి చేశారు. పెళ్లి చేసుకున్న కొద్ది రోజులకు జ్యోతి ప్రియుడు కార్తీక్‌ను కలుసుకోవడం మొదలు పెట్టింది. విషయం తెలుసుకున్న భర్త నాగరాజు జ్యోతిని మందలించడంతో నాగరాజును చంపేస్తే తమకు అడ్డు ఏమీ ఉండదని నిర్ణయించుకున్నారు. కార్తీక్ స్నేహితులైన మహ్మద్ బిస్మిల్లాఖాన్ అలియాస్ యాసిన్, నదియల్ గౌరవ్ అలియాస్ దీపక్, రాంబో అలియాస్ సిరప్ప నరేష్‌లతో కలసి డిసెంబరు 30న రాత్రి నాగరాజు ముఖంపై దిండుతో ఊపిరాడకుండా చేసి చంపేసింది. శవాన్ని జిల్లేడుచెల్క వద్ద ముళ్ల పొదల్లో నాగరాజు శవాన్ని పడేసి వెళ్లారు. మృతుడి జేబులో లభించిన చిరునామా ఆధారంగా మృతుడి భార్య జ్యోతిని చౌటుప్పల్‌కు పిలిపించారు. నాగరాజును హత్య చేసిన నిందితులైన మృతుడి భార్య జ్యోతి, ఆమె ప్రియుడు మహంకాళి కార్తీక్‌లను శుక్రవారం అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. నాగరాజు హత్యలో పాల్గొన్న మరో ముగ్గురు నిందితులను త్వరలోనే అరెస్టు చేయనున్నట్లు డిసిపి రామచంద్రారెడ్డి తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో ఎసిపి రామోజు రమేష్, స్థానిక పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఎస్. నవీన్‌కుమార్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

## గజల్ శ్రీనివాస్ బెయిల్ పిటీషన్ కొట్టివేత

**మన తెలంగాణ**/హైదరాబాద్/ పంజాగుట్ట: లైంగిక ఆరోపణల నేపథ్యంలో జైలు పాలైన గజల్ శ్రీనివాస్ తరపు న్యాయవాది బెయిల్ కోసం వేసిన పిటీషన్‌ను శుక్రవారం నాంపల్లి 14వ ఎసీఎంఎం కోర్టు తిరస్కరించింది. బెయిల్ కోరుతూ న్యాయవాది వేసిన పిటీషన్‌లో ఇరు వర్గాల వాదనలు బలంగా వినిపించారు. మొదట గజల్ కస్టడీ కోరుతూ పోలీసులు వేసిన పిటీషన్‌లో కూడా ఆసక్తి కరమైన వాదనలు చోటు చేసుకున్నాయి. దీంతో కస్టడీ కోసం పోలీసులు వేసిన పిటిషన్‌ను న్యాయస్థానం కొట్టి వేసింది. దీంతో శుక్రవారం బెయిల్ పిటీషన్‌పై వాదనలు జరిగాయి. ఈ సందర్భంగా కోర్టు పోలీసులు కేసులో రెండవ ముద్దాయిని ఎందుకు అరెస్టు చేయడంలేదన్న విషయంలో పోలీసుల తీరును మందలించింది. మీడియాకు కనిపించిన వ్యక్తి మీకేందుకు కనిపించడం లేదంటూ పోలీసులను ప్రశ్నించింది. తాము ఈ విషయంలో కౌంటర్ దాఖలు చేయడానికి ఒక రోజు సమయం కావాలంటూ పబ్లిక్ ప్రాసిక్యూటర్ చేసిన అభ్యర్థనను న్యాయస్థానం తిరస్కరించింది. దీంతో అరగంట సమయంలో కౌంటర్ దాఖలు చేసేందుకు సమయం ఇవ్వాలంటూ పిపి కోరడంతో అందుకు అంగీకరించింది. దీంతో అరగంటలో పిపి కౌంటర్‌ను దాఖలు చేశారు. కౌంటర్ దాఖలు చేసిన తరువాత బెయిల్ పిటిషన్‌ను రద్దు చేస్తున్నట్లు న్యాయమూర్తి తీర్పును వెల్లడించారు. దీంతో కస్టడీ పిటీషన్‌ను తిరస్కరించడంతో బెయిల్ వచ్చినట్లేనని అందరూ భావించారు. కాని శుక్రవారం న్యాయమూర్తి బెయిల్‌ను నిరాకరిస్తూ శ్రీనివాస్‌కు షాక్ ఇచ్చారు. దీంతో బెయిల్ కోరుతూ సోమవారం పిటిషన్‌ను దాఖలు చేసే అవకాశముంది.

## ఖైదీల ఉత్పత్తులను ఆదరించాలి



**మన తెలంగాణ**/ హాలియా : నల్లగొండ జిల్లా ఖైదీలు తయారు చేసిన ఉత్పత్తులను వినియోగ దారులు ఆదరించి వారు సమజాంలో సన్మార్గంలో నడవడానికి దోహదపడాలని జిల్లా జైలు సూపరింటెండెంట్ శ్రీనివాస్ అన్నారు. నల్లగొండ జిల్లా ఖైదీలు తయారు చేసిన ఉత్పత్తులను హాలియాలో స్టాల్ ఏర్పాటు చేసి శుక్రవారం విక్రయాలు ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఖైదీలు తమ స్వశక్తితో కొన్ని ఉత్పత్తులను తయారు చేశారని ఇవి నాణ్యతతో ఉంటాయని వినియోగదారులు ఆదరించినట్లైతే జైలు జీవితం నుంచి బయటికి వచ్చిన తర్వాత వారు సన్మార్గంలో నడవడానికి ఉపయోగ పడుతుందన్నారు. వినియోగదారులు కూడా కొనుగోలు చేయడానికి ఆసక్తి కనబరిచారు. కార్యక్రమంలో సబ్ జైల్ సూపరింటెండెంట్ నాగరాజు, హాలియా ఎస్‌ఐ సతీష్‌కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కాలుష్య కంపెనీలపై చర్యలు తీసుకోవాలి : కోదండరాం



**మన తెలంగాణ**/భూదాన్ పోచంపల్లి : కాలుష్యాన్ని వెదజల్లుతూ ప్రజలకు హాని కలిగిస్తున్న రసాయన కంపెనీలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని జెఎసి చైర్మన్ కోదండరాం డిమాండ్ చేసారు. మండలంలోని ధోతిగూడెం గ్రామం శివార్లలోని రసాయన కంపెనీలను శుక్రవారం ఆకస్మికంగా ధోతిగూడెం రసాయన కంపెనీల పరిసరాలలో గల పంట పొలాలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. కాలుష్యంతో బోర్లలోని నీరు కలుషితమై పంటలు పండక పశు పక్ష్యాలు తాగు నీరు లేక తీవ్ర ఇబ్బందులు పడు తున్నారని రైతులు వాపోయారు. రైతుల పక్షాన అండగా ఉండి పోరాడుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భువనగిరి జెఎసి కన్వీనర్ పూస శ్రీనివాస్, రైతులు గద్దం వెంకట్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, సందీప్ రెడ్డి, మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఎమ్మార్ ప్రాపర్టీస్ కేసులో కోనేరు మధుకు ఊరట

**మన తెలంగాణ**/ హైదరాబాద్ : ఎమ్మార్ ప్రాపర్టీస్ కేసులో సిబిఐ నమోదు చేసిన కేసులో కోనేరు మధు అనే పారిశ్రామికవేత్తకు శుక్రవారం ఊరట లభించింది. ఇదే కేసులో సీనియర్ ఐఎఎస్ అధికారి ఎల్వీ సుబ్రమణ్యంపై సిబిఐ పెట్టిన కేసును నిన్న హైకోర్టు కొట్టివేసింది. శుక్రవారం కోనేరు మధుపై సిబిఐ నమోదు చేసిన కేసులో కూడా ఆధారాలు లేవంటూ న్యాయమూర్తి బి.శివశంకర్ రావు తీర్పు చెప్పారు. మధుపై కేసును కొట్టివేశారు. మధు ఆదేశిస్తే ఆయన ఖాతాలోకి డబ్బు డిపాజిట్ కాలేదని హైకోర్టు తేల్చింది. రాజేంద్రప్రసాద్, మధు తండ్రీ కుమారులు అయితే మధుకి నేరంలో పాత్ర ఉందనడం సరికాదని హైకోర్టు స్పష్టం చేసింది. మధుపై అన్యాయంగా కేసు పెట్టారంటూ ముకుల్ రోహత్గీ గతంలో చేసిన వాదనలతో న్యాయమూర్తి ఏకీభవిస్తూ తీర్పు చెప్పారు.

## 8 నుంచి హైకోర్టుకు సెలవులు

**మన తెలంగాణ**/ హైదరాబాద్ : ఈ నెల 8 నుంచి 17 వరకు హైకోర్టుకు సంక్రాంతి పండుగ సెలవులను ప్రకటించారు. అత్యవసర కేసుల్ని ఈ నెల 11న విచారణకు న్యాయమూర్తులు ఎస్‌వి భట్, దుర్గాప్రసాదరావులతో కూడిన డివిజన్ బెంచ్, న్యాయమూర్తి రామలింగేశ్వర రావు ఏకసభ్య కోర్టులు పనిచేస్తాయి.

# ప్రజా సంక్షేమానికి కెసిఆర్ పెద్దపీట

**జూన్ 2న మియాపూర్ –ఎల్బీనగర్ మెట్రో రైలు ప్రారంభం : మంత్రి కెటిఆర్**




**మన తెలంగాణ**/వనస్థలిపురం : గ్రేటర్ హైదరాబాద్ ఔటర్ రింగ్‌రోడ్ పరిధిలోని సుమారు 170 గ్రామాలను కూడ త్వరలోనే నిరంతరం మంచినీరు అందించేందుకు సిఎం కెసిఆర్ కృషి చేస్తున్నారని మంత్రి కెటిఆర్ అన్నారు. శుక్రవారం బిఎన్‌రెడ్డినగర్‌లోని సాహెబ్‌నగర్ రిజర్వాయర్‌లో రూ.325 కోట్ల హడ్కో నిధులతో నిర్మించిన నూతన మంచినీటి రిజర్వాయర్లను ఆయన వాటర్ బోర్డ్ ఎండి దానం కిషోర్, రవాణా శాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, ఎల్బీనగర్ ఎమ్మెల్యే ఆర్. కృష్ణయ్య, ఎంపి మల్లారెడ్డి, మహేశ్వరం ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, మేయర్ బొంతు రామ్మోహన్, డిప్యూటీ మేయర్ ఫసియుద్దీన్ బాబా, ఎంబిసి చైర్మన్ తాడూరి శ్రీనివాస్, ఎల్బీనగర్ టిఆర్‌ఎస్ నియోజకవర్గ ఇంచార్జి ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో ఎల్బీనగర్ గడ్డకు ప్రత్యేక స్థానం ఉంటుందని అమరుడు శ్రీకాంతచారి ఆత్మబలిదానంతో తెలంగాణ సాధనకు బాటలు వేసిన సంఘటనలను గుర్తుచేశారు. 2018 జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మియాపూర్ నుండి ఎల్బీనగర్‌కు మెట్రోరైలును ప్రారంభిస్తామన్నారు. ప్రజలకోసం సిఎం కెసిఆర్ దూరదృష్టితో అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు అందజేయడం ఒక కెసిఆర్‌కే సాధ్యం అని మంత్రి మహేందర్‌రెడ్డి అన్నారు. దేశంలోనే దమ్మున్న సిఎం కెసిఆర్ అని మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యులు చామకూర మల్లారెడ్డి అన్నా రు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సిఎం కెసిఆర్ ప్రజా పరిపాలనను సాగించడం సంతోషకరమని ఎల్బీనగర్ ఎమ్మెల్యే ఆర్. కృష్ణయ్య అన్నారు. అంతకు ముందు ఎల్బీనగర్ టిఆర్‌ఎస్ నియోజక వర్గ ఇంచార్జి ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ సర్దార్ పుటం పురుషోత్తంతో పాటు కార్పొరేటర్లు ముద్దగౌని లక్ష్మీ ప్రసన్నగౌడ్, జిట్టా రాజశేఖర్‌రెడ్డి, సామ తిరుమల్ రెడ్డి, హస్తినాపురం, మన్సూరాబాద్,నాగోల్, లింగోజిగూడ, కొత్తపేట్, చంపాపేట్, ఆర్కేపురం కార్పొరేటర్లు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, టిఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వనపర్తి మార్కెట్ యార్డులో వ్యాపారుల సిండికేట్


- వేరుశనగ రైతుకు దక్కని మద్దతు ధర
- క్వింటాల్‌కు రూ.2,800 చెల్లింపు
- ఐదు గంటలపాటు రైతుల రాస్తారోకో



**మన తెలంగాణ**/వనపర్తి ప్రతినిధి : వనపర్తి జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో వ్యాపారులు సిండికేట్‌గా మారి రైతులను దోచుకోవడంపై ఆగ్రహం చెందిన రైతులు కడుపుమంటతోఅధికారుల తీరుకు నిరసనగా తమకు మద్దతు ధర కల్పించాలని ఐదు గంటల పాటు మార్కెట్ యార్డు రోడ్డు ముందు ధర్నా, రాస్తారోకోను నిర్వహించారు. మూడు గంటల పాటు రైతులు నడిరోడ్డుపై రాస్తారోకో చేసిన వ్యవసాయ మార్కెట్ యార్డు అధికారులు స్పందించకపోవడంతో విషయం తెలుసుకున్న వనపర్తి ఎంఎల్‌ఎ డా.జి.చిన్నారెడ్డి, కాంగ్రెస్ నాయకులు , సిపిఎం జిల్లా కార్యదర్శి జబ్బార్, సిపిఎం నాయకులు రైతులతో కలిసి రాస్తారోకోలో పాల్గొన్నారు. పోలీసులు రాస్తారోకో దగ్గరికి చేరుకొని రైతులతో మాట్లాడే ప్రయత్నం చేసినప్పటికి రైతులు శాంతించలేదు. వనపర్తి జిల్లాలోని పెబ్బేరు, మదనాపురం మార్కెట్ యార్డుల్లో శుక్రవారం అత్యధికంగా క్వింటాల్‌కు రూ. 4,700, తక్కువగా రూ. 3060 లు చెల్లిస్తున్నప్పటికి వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డులో కొన్ని రోజులుగా క్వింటాల్‌కు ధర రూ. 2,600 నుండి రూ. 2,800 లు మాత్రమే చెల్లిస్తుండడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. క్వింటాల్ విత్తనాలు రూ.8 వేల నుండి రూ.10 వేల దాకా చెల్లించి ఎకరాకు రూ. 25వేలు ఖర్చు చేసి సాగుచేస్తే కనీసం పెట్టుబడి ఖర్చు కూడా వెళ్లడం లేదని వ్యాపారస్తులు అధికారులతో కుమ్మక్కై రైతులను దోచుకుంటున్నారని వారు ఆరోపించారు. సాయంకాలం మూడు గంటల ప్రాంతంలో రాస్తారోకో దగ్గరికి చేరుకున్న వనపర్తి ఎంఎల్‌ఎ చిన్నారెడ్డి, కాంగ్రెస్ నాయకులు, సిపిఎం జిల్లా కార్యదర్శి ఎండి.జబ్బార్, పార్టీ నాయకులు ,200 మంది రైతులకు మద్దతు తెలిపి వారితో కలిసి రాస్తారోకో నిర్వహించడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. రోడ్డుపై నుండి ఎంఎల్‌ఎను, రైతులను తప్పించేందుకు పోలీసులు ప్రయత్నించినప్పటికి రైతులు పోలీసులను అడ్డుకున్నారు. సాయంత్రం 5 గంటల సమయంలో పోలీసులు బలవంతంగా ఎంఎల్‌ఎ చిన్నారెడ్డిని ,సిపిఎం నాయకులను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

# ఇసుక మాఫియా నుంచి రక్షణ కల్పించాలి

**హత్య చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని విఆర్‌ఎల వినతి**



**మన తెలంగాణ**/బోధన్ (నిజామాబాద్ జిల్లా): ఇసుక మాఫియా ఆగడాల నుంచి తమకు రక్షణ కల్పించాలని మండల విఆర్‌ఎల సంఘం నాయకులు శుక్రవారం తహసీల్దార్ రేణుక చవాన్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. పిట్లం మండలం కారేగావ్ గ్రామానికి చెందిన విఆర్‌ఎ బోయిని సాయిలు అక్కడి తహసీల్దార్ ఆదేశాల మేరకే అక్రమ ఇసుక వాహనాన్ని అడ్డుకునేందుకు వెళ్లగా ఆయనను పొట్టన పెట్టుకున్నారని తహసీల్దార్‌కు వివరించారు. అనంతరం సాయిలు మృతికి సంతాపం తెలిపి నిరసన వ్యక్తం చేశారు. ఈ నిరసనలో అధ్యక్ష, కార్యదర్శులు గంగాధర్, శంకర్, నాయకులు తదితరులు ఉన్నారు. కాగా, వర్నిలో కామారెడ్డి జిల్లా పిట్లం మండలం కారేగావ్ గ్రామ విఆర్‌ఎ సాయిలును ఇసుక మాఫియా దారుణంగా హతమార్చిన సంఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని కోరు తూ మండల విఆర్‌ఎల సంఘం శుక్రవారం నల్లబ్యాడ్జీలు ధరించి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపిన అనంతరం తహసీల్దార్ హరిబాబుకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో గజ్జెల శంకర్, మండల అధ్యక్షుడు మైబూబ్, బాలకృష్ణ, శ్రీనివాస్,సాయిలు, ఈశ్వర్, ఆయూబ్ తదితరులు పాల్గొన్నారు.

Dwaraka



## 'బాహుబలి-2'కు రెండో స్థానం

దర్శక ధీరుడు రాజమౌళి తెరకెక్కించిన 'బాహుబలి 2' భారతదేశ సినీ చరిత్రలో ఇప్పటివరకు ఉన్న రికార్డులన్నింటినీ తిరగరాసింది. ఈ చిత్రం రిలీజైన ప్రతి భాషలోనూ కలెక్షన్ల వర్షం కురిపించింది. ఇందులో నటించిన ప్రభాస్, రానా, అనుష్క, తమన్నా తదితరులంతా దేశవ్యాప్తంగా పాపులర్ అయ్యారు. తెలుగు సినిమా కీర్తిని ఆకాశమంత ఎత్తుకు తీసుకెళ్లింది ఈ చిత్రం. ఇప్పటికే బాహుబలి ఖాతాలో ఎన్నో అరుదైన రికార్డులున్నాయి. తాజాగా మరో ఘనత ఈ సినిమా ఖాతాలో చేరింది. హాలీవుడ్‌లో రోటెన్ టమాటాస్ అనే పాపులర్ వెబ్‌సైట్ ఉంది. హాలీవుడ్ సినిమాలకు ఈ సైట్ ఇచ్చే రివ్యూలు, రేటింగ్‌లకు ఎంతో విలువ ఉంది. ఈ వెబ్‌సైట్ 2017లో ప్రపంచవ్యాప్తంగా విడుదలైన వేలాది సినిమాల్లో టాప్10 లిస్ట్‌ను ఎంపికచేసింది. ఇందులో బాహుబలి2 చిత్రానికి రెండో స్థానం దక్కింది. దర్శకుడు రాజమౌళి ఈ చిత్రాన్ని అద్భుతంగా తీర్చిదిద్దారని వెబ్‌సైట్ వారు కితాబిచ్చేశారు. భారతదేశం నుంచి వచ్చిన వండర్‌ఫుల్ మూవీ ఇదని వారు ప్రశంసించారు.





రవితేజ

## రవితేజ చిత్రం షూటింగ్ షురూ

'రాజా ది గ్రేట్' వంటి బిగ్ హిట్ తర్వాత రవి తేజ హీరోగా, సోగ్గాడే చిన్న నాయన, రారండోయ్ వేడుక చూద్దాం లాంటి భారీ విజయాలతో దూసుకుపోతున్న యంగ్ డైరెక్టర్ కళ్యాణ్ కృష్ణ దర్శకత్వంలో ఎస్ఆర్‌టి ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లో రామ్ తాళ్లూరి ఓ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ హైదరాబాద్‌లో ప్రారంభమైంది. మాళవిక శర్మ ఈ చిత్రంలో హీరోయిన్‌గా చేస్తోంది. ఈ సందర్భంగా నిర్మాత రామ్ తాళ్లూరి మాట్లాడుతూ ''ఎస్ఆర్‌టి ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లో మొదటి చిత్రంగా రవితేజ హీరోగా కళ్యాణ్‌కృష్ణ దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నాము. ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ మొదలైంది. కళ్యాణ్‌కృష్ణ దర్శకుడిగా చేసిన రెండు ఫ్యామిలీ ఎంటర్‌టైనర్స్ మంచి విజయాన్ని అందుకున్నాయి. ఫ్యామిలీ ఆడియన్స్‌లో అతని చిత్రాలకు ఎంతో ప్రత్యేకత ఉంది. రవితేజ చిత్రానికి అన్ని వర్గాల ప్రేక్షకుల్లో మంచి క్రేజ్ ఉంటుంది. ఇప్పుడు మంచి సక్సెస్‌లో ఉన్న వీరిద్దరి కాంబినేషన్‌లో ఈ చిత్రం చేయడం ఆనందంగా ఉంది. మాళవిక శర్మను హీరోయిన్‌గా ఎంపిక చేశాం. ముఖేష్ కెమెరామెన్‌గా చేస్తున్నారు. మరిన్ని వివరాలను అతి త్వరలో తెలియజేస్తాం''అని అన్నారు.

## అతనితోనే అఖిల్ మూడవ చిత్రం

అఖిల్ అక్కినేని తన రెండవ చిత్రం 'హలో'తో మంచి విజయాన్ని అందుకున్నాడు. ఈ చిత్రం అతనికి హీరోగా మంచి క్రేజ్‌ను తెచ్చిపెట్టింది. ఇక తాను చేయబోయే మూడవ సినిమా గురించి ఈనెల 10న ప్రకటిస్తానని ఇదివరకే అఖిల్ చెప్పిన సంగతి తెలిసిందే. దీంతో ప్రేక్షకులు ఆ చిత్రం వివరాల గురించి ఎదురుచూస్తున్నారు. అయితే అఖిల్ వద్ద ప్రస్తుతానికి రెండు ఆప్షన్స్ ఉన్నాయట. మొదటిది సత్య పినిశెట్టి చెప్పిన కథ. ఈమధ్య తెలుగులో మంచి పాత్రలు దక్కించుకుంటున్న ఆది పినిశెట్టికి అతను అన్నయ్య కాగా... ప్రసిద్ధ దర్శకుడు రవిరాజా పినిశెట్టికి అతను పెద్ద కుమారుడు. యంగ్ డైరెక్టర్ సత్య గతంలో 'మలుపు' అనే సినిమా తీసి మంచి ప్రశంసలను అందుకున్నాడు. కానీ ఆ సినిమా కమర్షియల్‌గా అంత సక్సెస్ కాలేదు. సత్య చెప్పిన స్టోరీ అఖిల్‌కు బాగా నచ్చిందట. గత కొన్ని రోజులుగా సత్యతో అఖిల్ దీని గురించి చర్చిస్తున్నాడట. ఈనెల 10న ఇదే చిత్రాన్ని ప్రకటిస్తారనే టాక్ వినిపిస్తోంది. మరోపక్క స్టార్ డైరెక్టర్ కొరటాల శివతో ఓ సినిమా చేసే ప్లాన్ కూడా అఖిల్ వద్ద ఉన్నట్టు తెలిసింది. మ్యాట్నీ ఎంటర్‌టైన్‌మెంట్ అధినేత నిరంజన్ రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తారని అంటున్నారు. అయితే మహేష్‌తో కొరటాల శివ 'భరత్ అను నేను' చిత్రంలో ఎంతో బిజీగా ఉన్నాడు. మరో మూడు నెలల దాకా అతను ఖాళీ అయ్యే ప్రశ్నే లేదు. అంత దాకా అఖిల్ ఖాళీగా ఉండడం కష్టం. ఇక రామ్‌చరణ్‌కొరటాల నిరంజన్ రెడ్డి కాంబినేషన్‌లో ఓ సినిమాను తెరకెక్కించాలని గతంలోనే ప్లాన్ చేశారు. కానీ అది ఆలస్యం అయ్యే అవకాశం ఉండటంతో ఆలోపు అఖిల్‌తో సినిమా చేస్తే ఎలా ఉంటుంది అని కొరటాల ఆలోచిస్తున్నాడని అంటున్నారు. కానీ ఇప్పుడున్న పరిస్థితుల్లో అఖిల్‌తో కొరటాల సినిమా చేయడం కష్టంగా కనిపిస్తోంది. దీంతో చివరికి సత్య చిత్రానికే అఖిల్ ఓకే చెబుతాడని చెబుతున్నారు. ఈ సస్పెన్స్ వీడాలంటే ఈనెల 10 వరకు ఆగాల్సిందే. సత్య చెప్పిన కాన్సెప్ట్ రెగ్యులర్ లవ్ స్టోరీ తరహాలో కాకుండా వినూత్నంగా ఉండటం వల్లే అఖిల్ ఈ చిత్రం పట్ల పాజిటివ్‌గా ఉన్నాడని టాక్.



అఖిల్



రానా

## రానా వద్దకు క్రేజీ స్క్రిప్ట్

విభిన్నమైన కథలను తయారుచేసుకుంటున్న రచయితలు, దర్శకులు ఇప్పుడు తమ మొదటి ఛాయిస్‌గా రానాను ఎంచుకుంటున్నారు. ఇప్పటికే రానా 1945, హాథీ మేరే సాథీ వంటి విభిన్నమైన సినిమాల్లో నటిస్తుండగా ఇప్పుడు ఆయన వద్దకు మరో క్రేజీ స్క్రిప్ట్ వచ్చినట్టు తెలిసింది. 'కిట్టు ఉన్నాడు జాగ్రత్త' దర్శకుడు వంశీ ఒకప్పటి గజదొంగ, పేదవాళ్ల రాబిన్‌హుడ్‌గా పిలవబడే టైగర్ నాగేశ్వరరావు జీవితం ఆధారంగా ఒక చిత్రం తీయనున్నాడు. ఇందులో టైగర్ నాగేశ్వరరావు పాత్రకు రానా అయితే బాగుంటుందని ఆయనతో సంప్రదింపులు జరుపుకున్నాడట వంశీ. ఈ సినిమాను రానా ఒప్పుకుంటాడా, లేదా అనేది చూడాలి. ఈ బయోపిక్‌ను అనిల్ సుంకర నిర్మించనున్నాడు.

## వాయిదాపడిన బయోపిక్ మూవీ



రణబీర్ కపూర్

ఈ ఏడాది బాలీవుడ్‌లో ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాల్లో సంజయ్‌దత్ బయోపిక్ మూవీ ఇకటి. తనకు ఆప్త మిత్రుడైన సంజయ్ జీవిత కథతో బాలీవుడ్ స్టార్ డైరెక్టర్ రాజ్‌కుమార్ హిరానీ ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాడు. 'పీకె' వంటి ఆల్‌టైమ్ బ్లాక్‌బస్టర్ తర్వాత హిరానీ తెరకెక్కిస్తున్న సినిమా కావడంతో దీనిపై అంచనాలు భారీగానే ఉన్నాయి. ఈ చిత్రంలో సంజయ్‌దత్ పాత్రను యంగ్ స్టార్ రణబీర్ కపూర్ పోషిస్తున్నాడు. రణబీర్ పూర్తిగా సంజయ్‌దత్ అవతారంలోకి మారిపోయి కనిపించిన లుక్ ప్రేక్షకుల్లో సినిమాపై ఆసక్తిని పెంచింది. హిరానీ ఏ సినిమా అయినా చాలా నెమ్మదిగా తీస్తాడు. ఏ విషయంలోనూ రాజీ పడడు. సంజయ్‌దత్ బయోపిక్ మొదలై కూడా దాదాపు ఏడాది కావస్తోంది. ఈ చిత్రాన్ని ముందుగా మార్చి 30న రిలీజ్ చేయాలని అనుకున్నారు. కానీ సినిమా ఆలస్యం అవుతుండడంతో చివరికి జూన్ 29న ఈ చిత్రాన్ని రిలీజ్ చేస్తామని దర్శకుడు హిరానీ ప్రకటించాడు. అయితే ఈ చిత్రానికి ఇంకా టైటిల్‌ను ఖరారు చేయలేదు. ఈ మూవీకి 'సంజయ్‌దత్' అనే పేరును ఖరారు చేయవచ్చని సమాచారం. ఈ చిత్రంలో సంజయ్ తండ్రి సునీల్‌దత్ పాత్రలో పరేష్ రావల్ నటిస్తుండగా... దత్ తల్లి నర్గీస్ పాత్రలో మనీషా కోయిరాలా నటిస్తోంది. సోనమ్ కపూర్, అనుష్క శర్మ, విక్కీ కౌశల్ కీలక పాత్రల్లో కనిపించబోతున్నారు. ఇప్పటిదాకా హిరానీ తీసిన సినిమాలన్నీ సామాజిక అంశాల నేపథ్యంలో సాగినవే. మరి కేసుల్లో చిక్కుకొని జైలుకు కూడా వెళ్లొచ్చిన దత్ జీవితాన్ని హిరానీ ఎలా చూపిస్తాడో అన్నది ఆసక్తికరంగా మారింది.

## అతని చేతిలో ఇతర నిర్మాతలు మోసపోకూడదు: ఎస్.కె.బషీద్

సందీప్‌కిషన్, లావణ్య త్రిపాఠి హీరోహీరోయిన్లుగా ఎస్‌బికె ఫిలిమ్స్ కార్పొరేషన్ పతాకంపై ఎస్‌కె అబ్దుల్లా నిర్మించిన చిత్రం 'ప్రాజెక్ట్ జెడ్'. ఈ చిత్రం ఇటీవల విడుదలైంది. హైదరాబాద్‌లో ఏర్పాటైన విలేకరుల సమావేశంలో చిత్ర సమర్పకుడు ఎస్.కె.బషీద్ మాట్లాడుతూ ''ప్రాజెక్ట్ జెడ్ చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరిస్తున్నారు. మంచి చిత్రమని అభినందిస్తున్నారు. అయితే ప్రతి సినిమాలో ఒక విలన్ ఉంటాడు. కానీ నా జీవితంలో హీరో సందీప్‌కిషన్ విలన్‌గా మారి ఈ సినిమాను చంపేస్తున్నాడు. సందీప్ చేసిన 19 సినిమాలు వరుసగా ఫెయిల్ అయ్యాయి. అందుకే నేను సెంటిమెంటల్‌గా ఆలోచించి తన వాయిస్‌ను కాదని డబ్బింగ్‌ను వేరే వారి చేత చెప్పించాను. దాంతో సందీప్‌కిషన్ ఈ చిత్రంలో నా వాయిస్ కాదన్నారని... సినిమా ప్రమోషన్స్‌లో పాల్గొనను, సినిమా విడుదలను అడ్డుకుంటానని పలుసార్లు ప్రయత్నించాడు. చివరికి ఎంతో కష్టపడి ఈ సినిమాను విడుదల చేశాను. కానీ సందీప్‌కిషన్ నాపై పగబట్టినట్లుగా వ్యవహరిస్తున్నాడు. సినిమా బాగా రాలేదు కాబట్టి నేనే మళ్లీ రీషూట్ చేసి త్వరలో విడుదల చేస్తానంటూ ప్రచారం చేస్తున్నాడు. అతని చేతిలో ఇతర నిర్మాతలు మోసపోకూడదని ఈ విషయాన్ని తెలియజేస్తున్నాను''అని అన్నారు.



ఎస్.కె.బషీద్

## అమీర్‌పేట్ టు అమెరికా



'అమీర్‌పేట్ టు అమెరికా' పోస్టర్‌ను విడుదల చేస్తున్న బొంతు రామ్‌మోహన్, బాబా ఫసివుద్దీన్. చిత్రంలో రామ్‌మోహన్ కొమండూరి, చల్లా భానుకిరణ్ తదితరులు.

రాధా మీడియా బ్యానర్‌పై శ్రీమతి స్వప్న కొమండూరి సమర్పిస్తున్న చిత్రం 'అమీర్‌పేట్ టు అమెరికా'. చల్లా భానుకిరణ్ దర్శకత్వంలో ఈ సినిమా రూపుదిద్దుకుంటోంది. ఈ చిత్రం ఫస్ట్ పోస్టర్‌ను హైదరాబాద్ మేయర్ బొంతు రామ్‌మోహన్, డిప్యూటి మేయర్ బాబా ఫసివుద్దీన్ కలిసి విడుదల చేశారు. ఈ చిత్రానికి కర్త, కర్మ, క్రియగా ఉన్న రామ్‌మోహన్ కొమండూరి 'ఎ టు ఎ' సినిమా పోస్టర్‌ను వినూత్నంగా డిజైన్ చేశారు. బ్రహ్మానందం, మణిచందన, సమ్మెట గాంధీ, రజని, వేణుగోపాల్, వేణుమాధవ్, వారిజ, తేజస్, పల్లవి దొర, వంశీ కోదూరి, మేఘనా లోకేష్ తదితరులు ముఖ్య పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరాః అరుణ్, జి.ఎల్.బాబు, ఎడిటర్ః ప్రవీణ్ పూడి, సంగీతంః కార్తీక్ కొడకండ్ల.

## ఐష్‌కు భారీ పారితోషికం



ఐశ్వర్యారాయ్

మాజీ మిస్ వరల్డ్ ఐశ్వర్యారాయ్‌కు ఇప్పటికీ బోలెడంత ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. తన అందం, అభినయంతో కోట్లాది మంది అభిమానులను కూడగట్టుకున్న ఈ నీలి కళ్ల సుందరి ఇప్పటికీ తన రేంజ్‌ను చాటుతూనే ఉంది. 2016లో 'యే దిల్ హై ముష్కిల్' తర్వాత కొంత బ్రేక్ తీసుకున్న ఐష్ ఇప్పుడు వరుసగా సినిమాలు చేస్తోంది. 'ఫన్నే ఖాన్' అనే చిత్రంలో నటిస్తున్న ఈ బ్యూటీ మరోవైపు ఇంకా పేరు నిర్ణయించని ఓ థ్రిల్లర్‌లో కూడా నటిస్తోంది. వీటితో పాటు 1967 నాటి 'రాత్ ఔర్ దిన్' రీమేక్‌లో కూడా నటించేందుకు ఓకే చెప్పిందట ఐశ్వర్యారాయ్. అప్పట్లో నర్గీస్ చేసిన ఈ పాత్రను ఇప్పుడు ఈ బ్యూటీతో చేయించనున్నారు ఫిల్మ్‌మేకర్స్. అయితే ఈ సినిమా కోసం ఐష్‌కు ఏకంగా 10 కోట్ల పారితోషికం ఇవ్వనున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. 44 ఏళ్ల వయసులోనూ లీడ్ రోల్స్ అందుకోవడమే ఆశ్చర్యమైతే... ఇంతటి భారీ పారితోషికం అందుకోవడంతో ఆమెకు ఎంత పాపులారిటీ ఉందో తెలుస్తుంది. అయితే 'రాత్ ఔర్ దిన్' మూవీలో ఐష్ డ్యుయల్ రోల్ చేయనుందని తెలిసింది. రెండు పాత్రలకు వేరియేషన్ చూపిస్తుందట. ఈ చిత్రం కోసం సుదీర్ఘ కాలం డేట్స్ కేటాయించడంతో పాటు ఐశ్వర్య ఇతర సినిమాలు చేయడానికి కుదరదట. అందుకే ఐష్‌కు అంత భారీ మొత్తాన్ని ఇచ్చేందుకు నిర్మాత ప్రేరణా అరోరా ఒప్పుకున్నట్లు తెలిసింది.



రకుల్‌ప్రీత్ సింగ్

## చివరికి ఇద్దరూ హీరోయిన్లుగా...

ప్రస్తుతం సౌత్‌లో నార్త్ భామలకు హీరోయిన్స్‌గా మంచి క్రేజ్ ఉంది. అయితే ఈమధ్య కాలంలో వారికి ఎక్కువగా మలయాళీ ముద్దుగుమ్మల నుంచి తీవ్రమైన పోటీ ఎదురవుతోంది. నార్త్ స్టార్ హీరోయిన్స్ ఆఫర్స్‌ను చివరి నిమిషంలో లాగేసుకునే పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం మలయాళ భామలు అనుపమా పరమేశ్వరన్, సాయి పల్లవిలకు వరుసగా మంచి ఆఫర్లు వస్తున్నాయి. ఇటీవల సూర్య హీరోగా నటించే ఓ సినిమాలో రకుల్ స్థానంలో సాయి పల్లవి ఎంపికైందని ఓ వార్త బయటకు వచ్చింది. సెల్వ రాఘవన్ దర్శకత్వంలో తెరకెక్కే ఈ చిత్రంలో రకుల్‌ను తీసేశారనే టాక్ వినిపించింది. కానీ తాజాగా కాస్ట్యూమ్ డిజైనర్ నీరజా కోన చేసిన ట్వీట్‌ను బట్టి చూస్తే ఆ సినిమాలో రకుల్‌ని తీసేయలేదని తెలిసింది. సూర్య చిత్రంలో రకుల్‌తో పాటు సాయి పల్లవి కూడా నటిస్తుందని క్లారిటీ వచ్చేసింది. ఇక ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ త్వరలో ప్రారంభంకానుంది. ప్రస్తుతం సూర్య 'గ్యాంగ్' చిత్రం విడుదలకు సిద్ధమైంది.



సాయి పల్లవి

మన తెలంగాణ
9
హైదరాబాద్
శనివారం
6, జనవరి 2018
www.manatelangana.news



## ఆధార్ డేటాబేస్ బలహీనమే: ఎడ్వర్డ్ స్నోడెన్

**న్యూఢిల్లీ:** ఆధార్ వివరాలు రోజుకో ఆందోళన వ్యక్తమవుతోంది. ఆధార్ డేటా సురక్షితంగా ఉందని యుఐడిఐఎ స్పష్టం చేసినా కొందరు అదేమీ లేదని, చిటికలో ఆధార్ సమాచారం రాబట్టవచ్చని సవాల్ విసురుతున్నారు. ఇది దేశ ప్రజలను మరింత ఆందోళనకు గురిచేస్తోంది. అమెరికా రహస్య పత్రాలను బయటపెట్టిన ఎడ్వర్డ్ స్నోడెన్ ఆధార్ గోప్యతపై సంచలన వ్యాఖ్యలు చేశారు. వంద కోట్ల భారతీయుల ఆధార్ డేటాను హ్యాక్ చేయడం చాలా సులువని అన్నారు. భారత్ ప్రవేశపెట్టిన ఆధార్ సంఖ్య వివరాలు అక్రమ వినియోగానికి దారితీయవచ్చని అమెరికా గూఢచర్య సంస్థ సిఐఎ మాజీ ఉద్యోగి స్నోడెన్ వెల్లడించారు. ప్రజల డేటాను సురక్షితంగా ఉంచామని ప్రభుత్వాలు చెబుతున్నప్పటికీ డేటా హ్యాకింగ్‌కు గురికావడం సాధారణ విషయమేనని అన్నారు. చట్టాలు ఉన్నా, దుర్వినియోగాన్ని ఆపలేకపోయిందని చరిత్ర చెబుతోందని అన్నారు. భారత్‌లో ఆధార్ డాటాబేస్ ఉల్లంఘనపై సిబిఎస్ విలేఖరి జాక్ విట్టేకర్ వ్యాఖ్యలకు స్నోడెన్ స్పందిస్తూ ఈ విధంగా ట్వీట్ చేశారు. గురువారంనాడు ఆధార్ సమాచారమంతా భద్రంగా ఉందని, పుకార్లు నమ్మొద్దని యుఐడిఎఐ స్పష్టం చేసింది. రూ.500 చెల్లిస్తే ఆధార్ వివరాలను తెలుసుకోవచ్చు అని వస్తున్న వార్తలపై యుఐడిఎఐ ఈ విధంగా స్పందించింది.

## బకాయి రుణాల్ని చెల్లించండి

### ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు వినూత్న నిరసన



**మన తెలంగాణ** / హైదరాబాద్ : బ్యాంకు నుండి రుణాలు తీసుకుని తిరిగి చెల్లించకుండా నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్న సంస్థలు, ఖాతా దారుల ఇళ్లు, కార్యాలయాల ఎదుట ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ (ఐఓబి) వినూత్న నిరసన ప్రదర్శనలను నిర్వహించింది. '' నేమ్ అండ్ షేమ్'' పేరిట మొండి బకాయిదారులు, రుణ ఎగవేతదారుల సంస్థల ముందు ఐఓబి చీఫ్ జనరల్ మేనేజర్ శివ కుమార్ చతుర్వేది నేతృత్వంలో బ్యాంకు ఎజిఎం అచ్చయ్య, హైదరాబాద్‌లోని ఆదర్శనగర్ బ్రాంచ్ ఎజిఎం వి. రామమూర్తి, బషీర్‌బాగ్ బ్రాంచ్ చీఫ్ మేనేజర్ ఎం. వహీదుల్లా , ప్రాంతీయ కార్యాలయ అధికారులు, సిబ్బంది నేతృత్వంలో టిసిఐ కన్‌స్ట్రక్షన్స్ లిమిటెడ్ సంస్థ ముందు ప్లకార్డులతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. శ్రీనగర్ కాలనీ రోడ్‌లోని మారుతి నగర్‌లో ఉన్న టిసిఐ సంస్థ ఎండి ముప్పనేని వెంకటేశ్ ఐఓబికి తన పర్సనల్ పేరుతో సహా తీసుకున్న రుణాలన్నీ కలిపి మొత్తం రూ.26,45,36,036 చెల్లించాల్సి ఉందని ఐఓబి అధికారులు తెలిపారు.

## స్టాక్ మార్కెట్

| ఈరోజు మార్కెట్ | ముగింపు | మార్పు | % |
|---|---|---|---|
| సెన్సెక్స్ | 34153.85 | 184.21 | 0.54% |
| నిఫ్టీ | 10558.85 | 54.05 | 0.51% |

### CLOSING SENSEX REPORT




## కరెన్సీ మారక రేట్లు

| | |
|---|---|
| అమెరికన్ డాలర్ | 64.89 |
| యూరో | 75.33 |
| బ్రిటిష్ పౌండ్ | 85.18 |
| ఆస్ట్రేలియన్ డాలర్ | 49.84 |
| కెనెడియన్ డాలర్ | 50.64 |
| ఎమిరైట్ దిర్హామ్ | 17.67 |
| స్విస్ ఫ్రాంక్ | 64.97 |
| చైనీస్ యువాన్ | 9.76 |
| మలేషియన్ రింగిట్ | 15.3 |
| న్యూజిలాండ్ డాలర్ | 44.67 |
| హాంగ్‌కాంగ్ డాలర్ | 8.31 |
| జపనీస్ యెన్ | 0.57 |
| కువైట్ దినార్ | 214.41 |
| సౌతాఫ్రికన్ రాండ్ | 4.59 |

## బులియన్




### బంగారం ధర

| నగరం | ధర (రూ / 10 గ్రాములు) | | |
|---|---|---|---|
| | 22క్యారట్ | 24క్యారట్ | మార్పు(%) |
| చెన్నై | 28180 | 30139.04 | 0.43% |
| ముంబై | 28930 | 30941.18 | – 0.1% |
| ఢిల్లీ | 28350 | 30320.86 | – 0.53% |
| కోల్‌కతా | 28930 | 30941.18 | –0.52% |
| కేరళ | 27350 | 29251.34 | 0.55% |
| బెంగళూరు | 27600 | 29518.72 | 0.73% |
| హైదరాబాద్ | 28200 | 30160.43 | 0.53% |
| గల్ఫ్ | 1346.4 | 1440.00 | 0.65% |

### వెండి ధర (రూ./ కిలో)

| నగరం | సోమవారం | శనివారం | మార్పు (%) |
|---|---|---|---|
| చెన్నై | 41700.00 | 42000.00 | –0.71 |
| ముంబై | 41700.00 | 42000.00 | –0.71 |
| ఢిల్లీ | 41700.00 | 42000.00 | –0.71 |
| కోల్‌కతా | 41700.00 | 42000.00 | –0.71 |
| హైదరాబాద్ | 41700.00 | 42000.00 | –0.71 |



### కోడిగుడ్లు (100కు) నెక్ రేటు

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 390 | విశాఖపట్నం | 395 |
| వరంగల్ | 392 | చిత్తూరు | 398 |
| విజయవాడ | 388 | చెన్నై | 405 |
| గోదావరి | 388 | బెంగళూరు | 395 |

# బ్యాంకింగ్ యాప్స్‌తో జాగ్రత్త..

- ట్రోజన్ మాల్‌వేర్‌తో 232 బ్యాంక్ యాప్‌లకు ముప్పు
- క్విక్ హీల్ సెక్యూరిటీ ల్యాబ్ హెచ్చరిక

**ముంబై:** స్మార్ట్‌ఫోన్లు అందుబాటులోకి వచ్చిన తర్వాత అంతా చేతిలోనే పనులు చకచకా అవుతున్నాయి. డిజిటల్ టెక్నాలజీతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నా.. హ్యాకర్ల బారిన పడితే నష్టం అంతా ఇంతా కాదనే విషయం గుర్తుంచుకోవాలి. ప్రస్తుతం స్మార్ట్‌ఫోన్లలో 'యాప్'ల ట్రెండ్ నడుస్తోంది. ఏం కావాలన్నా యాప్‌లోకి వెళితే చాలు పనులు పూర్తయ్యే రోజులు వచ్చాయి. లావాదేవీలను నిర్వహించేందుకు ప్రతి బ్యాంకూ యాప్‌ను నిర్వహిస్తోంది. 'గూగుల్ ప్లే'లోకి వెళితే బ్యాంకింగ్ యాప్‌లు బోలెడు కనిపిస్తాయి. వాటిలో అసలు ఏదో నకిలీ ఏదో గుర్తించడం కష్టం.. ఇప్పుడు హ్యాకర్లకు వరంగా మారింది. అసలు యాప్‌ను వదిలేసి అసలులా ఉండే నకిలీ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నారా.. ఇక అంతే సంగతులు నిపుణులు హెచ్చరిస్తున్నారు.

### 232 బ్యాంకింగ్ యాప్స్ టార్గెట్

బ్యాంకింగ్ యాప్స్ లక్ష్యంగా చేసుకుని మాల్‌వేర్‌లు వచ్చాయని ఇంటర్నెట్, సైబర్‌సెక్యూరిటీ సంస్థ 'క్విక్ హీల్' సెక్యూరిటీ ల్యాబ్ హెచ్చరిస్తోంది. దేశంలోని 232 బ్యాంకింగ్ యాప్స్‌ను 'ఆండ్రాయిడ్.బ్యాంకర్.ఎ9480' అనే ట్రోజన్ మాల్‌వేర్ టార్గెట్ చేసిందని నివేదికలు వెల్లడించాయి. వీటిలో ఎస్‌బిఐ, హెచ్‌డిఎఫ్‌సి, ఐసిఐసిఐ, ఐడిబిఐ, యాక్సిస్ వంటి దేశీయ ప్రధాన బ్యాంక్‌ల యాప్‌లు ఉన్నాయి. యూజర్ల లాగిన్ డేటా, ఎస్‌ఎంఎస్, కాంటాక్ట్ లిస్టులను హానికర సర్వర్‌లో అప్‌లోడ్ చేసినట్టు పేర్కొన్నాయి. అదనంగా బ్యాంకింగ్ యాప్స్‌తో పాటు, వినియోగదారులు ఫోన్లలో వాడే క్రిప్టోకరెన్సీ యాప్స్‌ను కూడా ఈ ట్రోజన్ లక్ష్యంగా చేసిందని తెలిపింది.

### లక్ష్యంగా చేసుకున్న యాప్స్ జాబితా

ఆండ్రాయిడ్ బ్యాంకింగ్ ట్రోజన్ మాల్‌వేర్ లక్ష్యంగా చేసుకున్న దేశీయ బ్యాంకింగ్ యాప్స్ జాబితాను ఈ సందర్భంగా క్విక్ హీల్ విడుదల చేసింది. ఈ బ్యాంకింగ్ యాప్స్ వాడుతున్న కస్టమర్లు జాగ్రత్తగా ఉండాలని నిపుణులు సూచించారు.

- ☞ యాక్సిస్ మొబైల్
- ☞ హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు మొబైల్ బ్యాంకింగ్
- ☞ ఎస్‌బిఐ ఎనీవేర్ పర్సనల్
- ☞ హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ మొబైల్ బ్యాంకింగ్ లైట్
- ☞ ఐసిఐసిఐ బ్యాంకు ఐమొబైల్
- ☞ ఐడిబిఐ బ్యాంకు గో మొబైల్+
- ☞ ఐడిబిఐ బ్యాంకు లిమిటెడ్ అభయ్
- ☞ ఐడిబిఐ బ్యాంకు గో మొబైల్
- ☞ ఐడిబిఐ బ్యాంక్ ఎంపాస్‌బుక్
- ☞ బరోడా ఎంపాస్‌బుక్
- ☞ యూనియన్ బ్యాంకు మొబైల్ బ్యాంకింగ్
- ☞ యూనియన్ బ్యాంకు కమర్షియల్ క్లయింట్స్






### హ్యాకర్లు డేటాను దొంగిలిస్తారు..

థర్డ్‌పార్టీ స్టోర్ల ఫేక్ ఫ్లాష్ ప్లేయర్ ద్వారా ఆండ్రాయిడ్.బ్యాంకర్.ఎ9480 మాల్‌వేర్ విజృంభిస్తుందని క్విక్ హీల్ నివేదిక పేర్కొంది. సైబర్‌క్రిమినల్స్ ఫ్లాష్ ప్లేయర్ యాప్‌తో గాలం వేస్తారు. ఒక్కసారి వినియోగదారులు ఈ హానికర అప్లికేషన్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, ఇన్‌స్టాల్ చేస్తే, కనిపించని ఐకాన్ యూజర్ల స్మార్ట్‌ఫోన్‌లోకి వచ్చేస్తుంది. అది టార్గెట్ చేసిన 232 బ్యాంకింగ్ యాప్స్‌కు సంబంధించి ఏ ఒక్క యాప్‌ను యూజర్లు చెక్ చేసుకున్నా, ఆ హానికర యాప్ బ్యాక్‌గ్రౌండ్‌లో పని చేస్తూ ఉంటుంది. యూజర్ల డేటాను దొంగలించడానికి ప్రయత్నిస్తూ ఉంటుంది. కీలక డేటాను దొంగలిస్తుందని క్విక్ హీల్ నివేదిక వెల్లడించింది.

### ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి..

థర్డ్ పార్టీ యాప్ స్టోర్ల నుంచి లేదా ఎస్ఎం, ఇ మెయిల్‌లలో ఇచ్చే లింక్‌ల నుంచి ఎలాంటి యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవద్దని బ్యాంకర్లు, ఇంటర్నెట్ సెక్యూరిటీ సంస్థలు హెచ్చరిస్తున్నాయి.

ఇది వారి ఆధారాలను సురక్షితంగా ఉంచుతుందని అంటున్నారు. ఒటిఎ సెక్యూరిటీ అప్‌డేట్ వెంటనే ప్రభావిత బ్యాంకింగ్ యాప్స్‌కు సమాచారం పంపుతుంది. ఒఎస్, మొబైల్ సెక్యూరిటీ యాప్లను అప్–టు–డేట్‌గా ఉంచుకోవాలని వినియోగదారులకు సూచిస్తున్నారు.

## నాలుగేళ్ల కనిష్ఠానికి జిడిపి వృద్ధి రేటు


- 2017–18లో వృద్ధి రేటు అంచనా 6.5 శాతం
- జిఎస్‌టి, వ్యవసాయ ఉత్పత్తి తగ్గడమే కారణం: సిఎస్‌ఒ వెల్లడి




**న్యూఢిల్లీ :** దేశీయ ఆర్థిక వృద్ధి రేటు నాలుగేళ్ల కనిష్ఠానికి పడిపోయింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2017–18) జిడిపి(స్థూల దేశీయోత్పత్తి) 6.5 శాతమే నమోదనుందని ప్రభుత్వం అంచనా వెల్లడించాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి గాను ముందస్తు జిడిపి వృద్ధి అంచనాలను శుక్రవారం సిఎస్‌ఒ(కేంద్ర గణాంకాల శాఖ) విడుదల చేసింది. 2017–18కు జిడిపి అంచనా 6.5 శాతంగా ఉందని ప్రధాన గణాంకాల నిపుణుడు టిసిఎ అనంత్ మీడియా సమావేశంలో తెలిపారు. జిఎస్‌టి(వస్తు, సేవల పన్ను) అమలు, వ్యవసాయ ఉత్పత్తు తగ్గుముఖం పట్టడమే జిడిపి మందగించడానికి కారణమని అన్నారు. 2016–17 ఆర్థిక సంవత్సరంలో జిడిపి 7.1 శాతంగా ఉండగా, అంతకుముందు 2014–15 సంవత్సరంలో ఇది 7.5 శాతంగా ఉండడం గమనార్హం. నరేంద్ర మోడీ నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం 2014లో అధికారంలోకి వచ్చింది. తయారీ రంగంలో జివిఎ(గ్రాస్ వాల్యూ యాడెడ్) కూడా 7.9 శాతం నుంచి 6.1 శాతానికి క్షీణించింది. వ్యవసాయ రంగంలో ఉత్పత్తి కూడా తగ్గింది. వ్యవసాయ, అటవీ, మత్స్య రంగాల్లో వృద్ధి 4.9 శాతం నుంచి 2.1 శాతానికి పడిపోయింది. జిఎస్‌టి అమలు ప్రభావం పలు రంగాలపై చూపిందని, ఇది జిడిపి తగ్గడానికి కారణమవుతోందని అనంతర్ వివరించారు. ఏడాది – ఏడాది ఆధారంగా చూస్తే జివిఎ 6.1 శాతానికి పడిపోయింది. అలాగే వ్యవసాయ రంగం వృద్ధి రేటు అంచనా 2.1 శాతానికి తగ్గింది. కేంద్రం గతేడాది ప్రవేశపెట్టిన జిఎస్‌టి, 2016లో పెద్దనోట్ల రద్దు చర్యల వల్ల ఆర్థిక వ్యవస్థపై ప్రభావం పడింది. దీంతోపాటు వ్యవసాయ, తయారీ రంగంలో మందగమనం కారణంగా వృద్ధి రేటు అంచనాలను సిఎస్‌ఒ తగ్గించింది.

## ఎస్‌బిఐ 'కనీస బ్యాలెన్స్' తగ్గింపు!

**న్యూఢిల్లీ :** జరిమానాల నుంచి వేల కోట్ల లాభాలు పొందుతోందనే ఆరోపణలు వెల్లువెత్తంతో ప్రభుత్వరంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బిఐ( స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా) కనీస బ్యాలెన్స్ మొత్తాన్ని తగ్గించాలని యోచిస్తున్నట్టు సమాచారం. ప్రస్తుతం మెట్రో నగరాల్లో ఈ నెలవారీ నగదు నిల్వ రూ.3000 ఉండగా, దీన్ని రూ.1000కి తగ్గించనున్నట్టు తెలుస్తోంది. సేవింగ్ అకౌంట్లలో కనీస నిల్వలు నిర్వహించని ఖాతాదారులపై బ్యాంక్ చార్జీలు విధించడం ద్వారా రూ.1,771 కోట్లు పొందినట్టు ఇటీవల నివేదికలు తెలిపాయి. ఛార్జీలు వసూలు చేసి ఎస్‌బిఐ లాభం పొందుతున్నట్టు ఆరోపణలు ఎక్కువ కావడంతో కనీస నగదు నిల్వపై బ్యాంక్ పునరాలోచనలో పడింది. ఎస్‌బిఐలో మొత్తం 40.5 కోట్ల పొదుపు ఖాతాలు ఉన్నాయి. నెలవారీ సగటు నిల్వ నిర్వహించని ఖాతాదారుల నుంచి ఛార్జీలు వసూలు చేయడాన్ని ఆరేళ్ల తరవాత గత ఏడాది ఏప్రిల్‌లో ఎస్‌బిఐ ప్రారంభించింది. తొలుత మెట్రో నగరాల్లో రూ.5000 కనీస నిల్వలు ఉండాలని నిర్ణయించినా ప్రజల నుంచి వ్యతిరేకత రావడంతో దాన్ని రూ.3000కు తగ్గించింది. మెట్రో, అర్బన్ నగరాల్లో రూ.3000, సెమీఅర్బన్ ప్రాంతాల్లో రూ. 2000, గ్రామీణ ప్రాంతాల్లో రూ.1000 చొప్పున నెలవారీ నగదు నిల్వలు ఉండాలని స్పష్టం చేసింది. అలా లేకపోతే వారి నుంచి ఛార్జీలు వసూలు చేసింది. ఈ విధంగా ఛార్జీల రూపంలో ఎస్‌బిఐ వసూలు చేసిన మొత్తం రూ.1,771.67 కోట్లుగా ఉంది. ఈ ఆర్థిక సంవత్సరం తొలి 8 నెలల్లో వసూలు చేసిన మొత్తమిది.



## సరికొత్త శిఖరాలకు..

- కొనుగోళ్ల జోరుతో 10,559 పాయింట్లకు నిఫ్టీ
- 34,153 పాయింట్ల వద్ద బిఎస్‌ఇ సూచీ

**ముంబై:** దేశీయ స్టాక్‌మార్కెట్లు వారాంతం శుక్రవారం సరికొత్త శిఖరాలను తాకాయి. అంతర్జాతీయంగా సానుకూల సంకేతాలు, విదేశీ నిధుల ఇన్‌ఫ్లో కొనసాగుతుండడంతో కన్స్యూమర్ డ్యూరబుల్స్, టెక్, రియాల్టీ స్టాక్స్ కౌంటర్లలో కొనుగోళ్లు జోరుగా సాగాయి. దీంతో సెన్సెక్స్, నిఫ్టీ సూచీలు రికార్డు స్థాయి గరిష్ఠానికి చేరుకున్నాయి. మార్కెట్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 184 పాయింట్లు లాభపడి 34,153 పాయింట్ల వద్ద ముగిసింది. మూడు రోజుల నష్టాల తర్వాత గురువారం జోరందుకున్న మార్కెట్లు వారాంతం లాభాల జోరును చూపాయి. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ నిఫ్టీ 54 పాయింట్లు పెరిగి 10,559 వద్ద స్థిరపడింది. ఇక రంగాల వారీగా చూస్తే పిఎస్‌యు బ్యాంక్స్ మాత్రమే 0.7 శాతం బలహీనపడగా, మిగిలిన అన్ని రంగాలూ లాభపడ్డాయి. ప్రధానంగా ప్రైవేట్ బ్యాంక్స్, ఎఫ్‌ఎంసిజి, ఆటో, రియల్టీ, ఫార్మా 10.7 శాతం మధ్య ఎగశాయి. గురువారం తాజా పెట్టుబడుల ఆకర్షణతో జోరందుకున్న ప్రభుత్వరంగ బ్యాంకులలో ట్రేడర్లు లాభాల స్వీకరణకు దిగారని, దీంతో ఈ కంపెనీల షేర్లు డీలా పడ్డాయని నిపుణులు పేర్కొన్నారు. ప్రధాన కంపెనీల్లో యస్‌బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్, అదానీ పోర్ట్స్, ఇండస్‌ఇండ్, భారతీ, లుపిన్, డాక్టర్ రెడ్డీస్, ఐషర్, హెచ్‌డీఎఫ్‌సీ, టిసిఎస్‌లు లాభపడ్డాయి. అయితే ఇన్‌ఫ్రాటెల్, హిందాల్కో, యుపిఎల్, హెచ్‌పిసిఎల్, ఐఒసి, ఒఎన్‌జిసి, సిప్లా, బిపిసిఎల్, విప్రో, ఐసిఐసిఐ నష్టాల్లో పయనించాయి. నగదు విభాగంలో గురువారం ఎఫ్‌పిఐ(విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు) రూ. 212 కోట్లు, దేశీ ఫండ్స్(డిఐఐలు) రూ. 325 కోట్ల చొప్పున ఇన్వెస్ట్ చేశాయి.

### 34వేల మార్క్‌ను దాటిన సెన్సెక్స్

సెన్సెక్స్ కీలక 34000 పాయింట్ల మార్క్‌ను క్రాస్ చేసి మరింత ముందుకు సాగుతోంది. దేశీయ సేవల రంగం పుంజుకోవడం, మూలధన బాండ్లకు లోక్‌సభ ఆమోద ముద్ర వేయడం, అంతర్జాతీయ మార్కెట్ నుంచి అందిన సానుకూల పవనాలు ఈక్విటీ మార్కెట్ల సెంటిమెంట్‌ను బలపర్చాయి. శుక్రవారం సెన్సెక్స్ 102 పాయింట్ల లాభంతో 34,021.27 వద్ద, నిఫ్టీ 10,534.25 వద్ద ప్రారంభమయ్యాయి.


### 10,550కు చేరిన నిఫ్టీ

వరుసగా రెండో రోజు ఇన్వెస్టర్లు కొనుగోళ్లకు ఆసక్తి చూపడంతో నిఫ్టీ 10,550 స్థాయిని దాటింది. నిఫ్టీ సూచీ 10,563 వద్ద జీవితకాల గరిష్ఠానికి చేరింది. ఇక మరో సూచీ 34,189 వద్దకు చేరింది. యస్ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్, అదానీ పోరట్స్, ఇండస్ ఇండ్, ఏయిర్‌టెల్ షేర్లు 5 నుంచి 3శాతం లాభపడ్డాయి.

### 52 వారాల గరిష్ఠానికి ఎన్‌ఎండిసి

ప్రభుత్వరంగ జాతీయ ఖనిజాభివృద్ధి సంస్థ (ఎన్‌ఎండిసి) షేరు శుక్రవారం 52 వారాల గరిష్ఠానికి చేరింది. ఎన్‌ఎస్‌ఇ ట్రేడింగ్‌లో కంపెనీ షేరు ఓ దశలో 3.59 శాతం పెరిగింది. ర్యాలీ చేసి 158.30 వద్ద ఏడాది గరిష్టాన్ని తాకింది. ఈ ఏడాది(2018)లో ఎన్‌ఎండిసి ఫైన్స్‌లూప్స్ ధరలు విశ్లేషకుల అంచనాలకు మించి పెంచింది. ప్రతి టన్ను ఏకంగా రూ.500లు పెంచుతున్నట్లు ఎన్‌ఎండిసి ప్రకటించింది.

## మార్చి 2 నుంచి 8 వరకు హైదరాబాద్‌లో 'క్రెడాయ్ ప్రాపర్టీ షో'




**మన తెలంగాణ**/హైదరాబాద్: కాన్ఫిడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (క్రెడాయ్) 6వ ఎడిషన్ ''హైదరాబాద్ ప్రాపర్టీ షో–2018''ను మార్చి2 నుంచి 4 వరకు నిర్వహించనున్నట్లు ప్రకటించింది. హైదరాబాద్‌లో శుక్రవారం ''ప్రాపర్టీ షో '' బ్రోచర్‌ను జిహెచ్‌ఎంసి కమిషనర్ డాక్టర్ బి.జనార్ధన్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో క్రెడాయ్ హైదరాబాద్ అధ్యక్షులు ఎస్. రామ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి, కోశాధికారి కె.రాజేశ్వర్, ఉపాధ్యక్షులు ఆదిత్యగౌర, ఆనం ద్‌రెడ్డి మురళీకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో హైదరాబాద్‌లో రియల్ రంగం అభివృద్ధి జరుగుతుందన్నారు. ఆన్‌లైన్ విధానం ద్వారా పారదర్శకంగా భవన నిర్మాణాలకు అనుమతులను మంజూరు చేస్తున్నామన్నారు. రామ్‌రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో జరిగే ప్రాపర్టీ షోలో 120 మంది డెవలపర్‌లు, ఫైనాన్షియల్, నిర్మాణ రంగానికి చెందిన వివిధ కంపెనీలు పాల్గొంటాయని వివరించారు. తమ అంచనా ప్రకారం ఈ షోకు సుమారు ఒక లక్ష మంది సందర్శకులు హాజరవుతారన్నారు. ప్రపంచ పారిశ్రామిక సదస్సులు లాంటి కార్యక్రమాలతో హైదరాబాద్ అంతర్జాతీయ స్థాయిలో ప్రసిద్ధిచెందుతూ ఉందని పేర్కొన్నారు. ఇతర మెట్రో నగరాలతో పోలిస్తే హైదరాబాద్‌లో రియల్ ధరలు తక్కువగా ఉన్నాయని, అందుకే చాలా మంది హైదరాబాద్ వైపు మొగ్గు చూపుతున్నారని వివరించారు.

మన తెలంగాణ
10
హైదరాబాద్
శనివారం
6, జనవరి 2018
www.manatelangana.news

## హింసకు కారణం బయటివాళ్లే : కోరేగావ్ వాసులు


శంభాజీ భిడే

**పూణె:** భీమా కోరేగావ్ అల్లర్లకు బయట నుంచి వచ్చిన వాళ్లే ప్రధాన కారణమని ఆ గ్రామస్థులు పేర్కొన్నారు. పోలీసులు సరైన భద్రత కల్పించి ఉంటే ఈ దుర్ఘటన జరిగి ఉండేది కాదని వారు అభిప్రాయపడ్డారు. భీమా కోరేగావ్ గ్రామస్థులు కొందరు శుక్రవారం నాడు ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. జనవరి 1న జరిగిన సంఘటనలను వివరించారు. ఆ నాటి దుర్ఘటనలో అనేక షాపులు దగ్ధమయ్యాయని, అనేక ఇళ్లు, వాహనాలు అగ్నికి ఆహుతయ్యాయని విచారం వ్యక్తం చేశారు. అల్లర్లలో మృతిచెందిన రాహుల్ ఫటంగేల్ కుటుంబానికి కోటి రూపాయల నష్ట పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదే విధంగా అల్లర్లలో అనేక మంది గ్రామస్థులు తమ ఆస్తులను నష్టపోయారని, వాటికి కూడా ప్రభుత్వం పరిహారం చెల్లించాలని భీమా కోరేగావ్ సర్పంచ్ సునీతాకాంబ్లీ కోరారు. అలాగే ఆందోళనకారులు ధ్వంసం చేసిన దళిత నాయకుడు గోవింద్ గైక్వాడ్ సమాధిని త్వరలోనే కట్టితీరతామని గ్రామస్థులు ప్రతిన బూనారు. ఇదిలా ఉంటే భీమా కోరేగావ్ అల్లర్లలో నిందితుడిగా ఉన్న శంభాజీ భిడే తాను నిర్దోషినని పేర్కొన్నాడు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశాడు. బిఆర్ అంబేద్కర్ మనమడు ప్రకాశ్ అంబేద్కర్ తనపై చేసిన ఆరోపణలను శంభాజీ ఖండించాడు.



## మహిళా ఖైదీల స్థితిగతులపై సర్వే

**న్యూఢిల్లీ:** జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌సిడబ్ల్యు)తో కలిసి దేశంలోని 144 సెంట్రల్ జైళ్లలో మహిళా ఖైదీల స్థితిగతులపై ప్రభుత్వం సర్వే నిర్వహించనున్నట్టు మహిళా శిశు, సంక్షేమ కేంద్ర మంత్రి మేనకా గాంధీ తెలిపారు. ఇందులో భాగంగా ఎన్‌సిడబ్ల్యు, ఎన్‌జివో సభ్యులచే ప్రశ్నాపత్రాలను వివిధ జైళ్లకు పంపించినట్టు తెలిపారు. అనంతరం ఎన్‌సిడబ్ల్యూ బృందాలు ఈ జైళ్లను సందర్శించి రాష్ట్ర ప్రభుత్వాలకు సిఫార్సులు చేస్తాయని చెప్పారు. శుక్రవారం ఆమె ఇక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జైళ్లలో మహిళా ఖైదీల పరిస్థితులపై కొన్నేళ్లుగా ఇలాంటి పలు నివేదికలు వచ్చాయని వివరించారు. ఎన్‌సిడబ్ల్యూ ఓ నమూనాను రూపొందించి వివిధ డైరెక్టర్ జనరల్స్ (జైళ్లు), ప్రధాన కార్యదర్శులకు పంపించిందని వెల్లడించారు. వీటిపై ఫిబ్రవరి 15 లోగా వారు స్పందించాల్సివుంటుందని ఆమె చెప్పారు. ఎన్‌సిడబ్ల్యు యాక్టింగ్ చైర్ పర్సన్ రేఖా శర్మ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వాలకు ప్యానెల్ సిఫార్సులను సంబంధించి రాష్ట్రాల శాసనసభలకు అందజేయనున్నట్టు తెలిపారు. కాగా, మహిళా ఖైదీలకు జైలు మాన్యువల్‌ను రూపొందించాలని ఎన్‌సిడబ్ల్యు న్యాయశాఖకు విజ్ఞప్తి చేసింది.

## నేను బంద్‌లో లేను : మేవాని



**న్యూఢిల్లీ:** మహారాష్ట్రలో జరిగిన బంద్‌లో తాను పాల్గొనలేదని, అలాం టప్పుడు రెచ్చగొట్టేలా ప్రసంగాలు ఎలా చేస్తానని దళిత నేత జిగ్నేష్ మే వాని ప్రశ్నించారు. పుణెలో తాను రెచ్చగొట్టేలా ప్రసంగించినట్లు వచ్చిన ఆరోపణలను ఆయన ఖండించారు. బిజెపి, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌లు తనను లక్ష్యం చేసుకొని అబాసుపాలు చేస్తున్నారని ఆరో పించారు. బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ తనను లక్ష్యంగా చేసుకొని కావాలనే తనపై బురదజల్లుతున్నారని మేవానీ శుక్రవారం విలేకరులకు వెల్లడించారు. కాగా, డిసెంబర్ 31న జరిగిన ఓ కార్యక్రమంలో రెచ్చగొట్టేలా ప్రసంగాలు చేసినట్లు ఆరోపణలు రావడంతో గురువారం గుజరాత్ ఎంఎల్‌ఎ, జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్శిటీ విద్యార్థి నేత ఉమర్ ఖలీద్‌పై ఎఫ్‌ఐఆర్ నమోదైంది.

## ఛత్తీస్‌గఢ్‌లో ఇద్దరు నక్సల్స్ హతం

**రాయ్‌పూర్:** ఛత్తీస్‌గఢ్‌లో శుక్రవారం ఎన్‌కౌంటర్ జరిగింది. బిజాపూర్ జిల్లాలోని దట్టమైన అడవుల్లో భద్రతా దళాలకు, నక్సల్స్‌కు మధ్య ఎదురు కాల్పులు జరిగాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో ఓ మహిళ సహా ఇద్దరు నక్సల్స్ హతమైనట్లు పోలీసులు తెలిపారు. మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా భద్రతా దళాలు సంయుక్తంగా కూంబింగ్ నిర్వహిస్తుండగా ముదువండి–కవాడ్‌గాన్ అడవుల్లో ఉదయం 7.30 గంటలకు ఎన్‌కౌంటర్ చోటు చేసుకుందని దక్షిణ బస్తర్ రేంజ్ డిప్యూటీ ఐజి సుందర్ రాజ్ మీడియాకు చెప్పారు. ఈ ఆపరేషన్‌లో సిఆర్‌పిఎఫ్ కోబ్రాకు చెందిన 24వ బెటాలియన్, జిల్లా రిజర్వ్ గార్డ్‌లు సంయుక్తంగా గురువారం రాత్రి గంగలూర్‌లో కూంబింగ్‌ను ప్రారంభించాయన్నారు. ఈ నేపథ్యంలోనే దళాలకు తారసపడిన నక్సల్స్ వారిపై కాల్పులు జరపగా వెంటనే దళాలు అప్రమత్తమై మావోయిస్టుల కాల్పులను సమర్థవంతంగా తిప్పికొట్టాయన్నారు. కాల్పుల అనంతరం అక్కడ పరిశీలించగా ఇద్దరి నక్సల్స్ మృతదేహాలను లభించాయని, వారి వద్ద నుంచి ఒక 303 రైఫిల్, 12 బోర్‌గన్, ఒక దేశవాళీ తుపాకీ స్వాధీనం చేసుకున్నట్లు డిఐజి వెల్లడించారు. కాల్పుల నుంచి తప్పించుకొని పారిపోయిన మరికొంత మంది నక్సల్స్‌ను అంతమొందించేందుకు కూంబింగ్ ఇంకా కొనసాగుతుందని ఆయన చెప్పారు.

## రజినీకాంత్ అంటే 'కేవలం మంచి'



**చెన్నై:** రజినీకాంత్ అంటే తన దృష్టిలో 'కేవలం మంచి' అని అర్థమని ఆస్కార్ అవార్డు గ్రహీత, సంగీత దర్శకులు ఎఆర్ రెహమాన్ పేర్కొన్నారు. డిసెంబరు 31న రజినీకాంత్ రాజకీయ రంగ ప్రవేశ ప్రకటన చేస్తూ తాను 'ఆధ్యాత్మిక రాజకీయాలు' మాత్రమే చేస్తానని, కులాలు, మతాలకు దూరంగా ఉంటానని, ఆధ్యాత్మిక రాజకీయాలు అంటే నిజాయితీ, లౌకిక రాజకీయాలు అని చెప్పిన నేపథ్యంలో ఈ అర్థం రజినీకాంత్‌కు సరిపోతుందని రెహమాన్ వ్యాఖ్యానించారు. లౌకిక పాత్రపై ఆధ్యాత్మిక రాజకీయాల గురించి రజినీకాంత్ మాట్లాడారని, అందుకే రజినీకాంత్ అంటే 'కేవలం మంచి' అని అర్థమని అన్నారు. నటుల రాజకీయ రంగ ప్రవేశంపై అడిగిన ప్రశ్నకు రెహమాన్ సమాధానమిస్తూ... మంచి నాయకత్వం అవసరమని వారు భావిస్తున్నారని అన్నారు. రాజకీయాల్లోకి వచ్చే ఎవరైనా కాని ప్రజల అవసరాలను తీర్చగలిగే వారై ఉండాలని సూచించారు.

## ఉ.కొరియాపై పినరయి ప్రశంసలు

**పుదుచ్చేరి:** కమ్యూనిస్టు పాలనలో ఉన్న చైనా కంటే ఉత్తర కొరియా అధ్యక్షుడు జాంగ్ అమెరికాపై కఠిన వైఖరితో ఉన్నారని సిపిఐ(ఎం) సీనియర్ నాయకులు, కేరళ సిఎం పినరయి విజయన్ ప్రశంసించారు. అమెరికా సామ్రాజ్యవాదాన్ని ప్రతిఘటిస్తూ ధైర్యంగా నిలబడ్డారని అన్నారు. శుక్రవారం ఇక్కడ జరిగిన సిపిఐ(ఎం) జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సామ్రాజ్యవాద శక్తులను ఎదుర్కోవడంలో ఉత్తర కొరియా చక్కటి ఉదాహరణగా నిలిచిందని అన్నారు. అయితే, ప్రజలు ఆశించిన మేరకు చైనా సామ్రాజ్యవాద శక్తులతో పోరాడలేకపోతోందని చెప్పారు. కాని ఉత్తర కొరియా తాను తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి అమెరికాకు ఎదురొడ్డి నిలుస్తోందన్నారు.

## కిరణ్‌బేడీకి ముఖ్యమంత్రి సవాల్

**పుదుచ్చేరి:** ప్రభుత్వ పథకాల అమలులో అవకతవకలపై దమ్ముంటే విచారణకు ఆదేశించాలని లెఫ్టినెంట్ గవర్నర్ కిరణ్ బేడీకి ముఖ్యమంత్రి వి.నారాయణస్వామి సవాల్ విసిరారు. ప్రభుత్వ పథకాల అమలులో అవకతవకలు జరుగుతున్నాయని కిరణ్‌బేడీ ఇటీవల ప్రధాన నరేంద్ర మోడీకి లేఖ రాసిన నేపథ్యంలో నారాయణస్వామి ఈ వ్యాఖ్యలు చేశారు. ఆమె ఆరోపిస్తున్నట్టుగా జరిగిన అవకతవకలపై విచారణకు ఆదేశిస్తే, నిజాలేమిటో బయటకు వస్తాయని ఆయన అన్నారు. శుక్రవారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలపై బేడీ తరచుగా విమర్శలు చేసున్నారని, గురువారం ప్రధానికి లేఖ రాశారని ఆయన చెప్పారు. ఆమె తాను చేసిన ఆరోపణలను నిరూపించుకోగలరా? అని ప్రశ్నించారు.

# చర్చకు రాని ట్రిపుల్ తలాక్

- **పార్లమెంట్ నిరవధిక వాయిదా**
- **లోక్‌సభలో 12 బిల్లులకు ఆమోదం**

**మన తెలంగాణ**/న్యూఢిల్లీ: రాజకీయంగా అధికారం, విపక్షాల మధ్య విపరీతమైన వేడిని పుట్టించిన పార్లమెంట్ శీతాకాల సమావేశాలు శుక్రవారంతో ముగిశాయి. చివరి రోజు గందరగోళం నడుమ ఉభయసభలూ నిరవధికంగా వాయిదాపడ్డాయి. లోక్‌సభలో మొత్తం 12 బిల్లులకు ఆమోదం లభించింది. అయితే కీలక బిల్లులు పార్లమెంటులో నిలిచిపోయాయి. లోక్‌సభలో ఆమోదం పొందినప్పటికీ ట్రిపుల్ తలాక్ బిల్లు రాజ్యసభలో ఆగిపోయింది. మెడికల్ కమిషన్ బిల్లును లోక్ సభ సెలక్ట్ కమిటీకి పంపించింది. వివాదాస్పద ఎఫ్.ఆర్.డి.ఐ బిల్లు పార్లమెంటు ఉభయ సభల్లో ప్రవేశానికి నోచుకోలేదు. వెనుకబడిన తరగతుల జాతీయ కమిషన్‌కు రాజ్యాంగబద్ధత కల్పించే బిల్లు కూడా ఏ సభలోనూ ప్రవేశానికి నోచుకోలేదు. వీటికితోడు మాజీ ప్రధాని మన్మోహన్‌పై మోడీ వ్యాఖ్యలు, కేంద్ర మంత్రి అనంత్ కుమార్ హెగ్డే రాజ్యగంపై చేసిన వ్యాఖ్యలు, మహారాష్ట్ర కోరేగావ్ ఘటన, కులభూషణ్ జాదవ్ కుటుంబసభ్యులపై పాకిస్తాన్ అనుచిత ప్రవర్తన తదితర అంశాలపై ఉభయ సభలు అట్టుడికాయి. 13 పనిదినాల్లో లోక్‌సభలో 78 శాతం పనిచేయగా, రాజ్యసభలో 54 శాతం మాత్రమే కార్యకలాపాలు జరిగాయి. ఈ శీతాకాల పార్లమెంటు సమావేశాల్లో లోక్‌సభలో 16 బిల్లులను కేంద్రం ప్రవేశపెట్టింది. లోక్ సభలో హైకోర్టు సుప్రీంకోర్టు న్యాయమూర్తుల వేతనాల పెంపు బిల్లు, జిఎస్టీ లో రాష్ట్రాలకు నష్టపరిహార సవరణ బిల్లు, సెంట్రల్ రోడ్ ఫండ్ సవరణ బిల్లు, ఇన్సాల్వెన్సీ అండ్ బాంక్రప్టసీ బిల్లులు ఆమోదం పొందాయి. శీతాకాల సమావేశాల్లో 13 పనిదినాల్లో లోక్ సభ 61 గంటల 48 నిముషాల పాటు సాగగా,లోక్ సభలో 280 స్టార్డ్ ప్రశ్నలు నమోదవగా, 45 ప్రశ్నలకు మౌఖిక సమాధానం, మిగతావాటికి రాతపూర్వక సమాధానాలను కేంద్రమంత్రులు ఇచ్చారు. 3220 అన్ స్టార్డ్ ప్రశ్నలను సభ ముందు లోక్‌సభ ఎంపిలు ఉంచారు.198 ప్రజా ప్రాముఖ్యత కలిగిన అంశాలను ఎంపీలు పార్లమెzH ఉభయసభల ముందుంచగా, రూల్ 377 కింద 225 అంశాలను లోకసభలో ఎంపిలు ప్రస్తావించారు. ఈ రాజకీయ వ్యవస్థలో మనమంతా ముఖ్యమైన భాగస్వాములం, పార్లమెంటు రాజకీయ సంస్థ, కాని విలక్షణ రూపంలో విరోధ రాజకీయాలకు పార్లమెంటు కొనసాగింపు కాదు, పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి మూలకారకులైన ఈ దేశ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడానికి, సామాజిక లక్ష్యాలను చేరుకోవడానికి పార్లమెంటు ముఖ్యమైన సంస్థ అని రాజ్యసభ శీతాకాల సమావేశాలు ముగింపు సందర్భంగా వెంకయ్యానాయుడు వ్యాఖ్యానించారు .



**34గంటలు వృథా : వెంకయ్య**

సభను అడ్డుకో వడం వల్ల సభా కా ర్యకలాపాల 34 గంటల సమ యం వృథా అయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అభిప్రాయాలను చెప్పడం, చర్చించడం వంటివి ప్రజాస్వామ్య క్రమం, కాని అడ్డుకోడం కాదు, ఈ విషయంలో సభ్యులంతా సీరియస్‌గా ఆత్మవిమర్శ చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పాకిస్తాన్ జై ల్లో ఉన్న కుల్ భూషణ్ జాదవ్‌ను చూడ్డానికి వెళ్లిన ఆయన కుటుంబ సభ్యుల పట్ల పాక్ అధికారులు చూపిన వైఖరిపై పార్టీలకతీతంగా ఒక్కతాటిపై నిలిచారని ప్రశంసించారు. జనవరి 2వ తేదీన 15ఏళ్ల సుదీర్ఘ కాలం తర్వాత ప్రశ్నోత్తరాల సమయంలో అన్ని ప్రశ్నలు పూర్తి చేసి రాజ్యసభ రికార్డు సృష్టించిందదని గుర్తు చేశారు.

## ముగ్గురు సభ్యులకు వీడ్కోలు

**న్యూఢిల్లీ:** రాజ్యసభ శీతాకాల సమావేశాల చివరి రోజున ముగ్గురు సభ్యులు పదవీ విరమణ చేశారు. కరణ్‌సింగ్,జనార్దన్ ద్వివేది, పర్వేజ్ హస్మీల రాజ్యసభ సభ్యత్వం జనవరి 27న ముగియనుంది. దీంతో శుక్రవారమే వారికి సభ వీడ్కోలు తెలిపింది.ఈ సందర్భంగా కరణ్‌సింగ్, జనార్ధన్ ద్వివేదీ సభలో చివరి ప్రసంగాలు చేశారు. తన అనుభవాలను పంచుకున్నారు. అనంతరం పలు పార్టీలకు చెందిన సభ్యులు పదవీ విరమణ చేసిన సభ్యులపై ప్రశంసలు కురిపించారు. కాంగ్రెస్ నేత గులాం నబీ ఆజాద్ కరణ్‌సింగ్‌ను పొగడ్తలతో ముంచెత్తారు. 86 ఏళ్ల కరణ్‌సింగ్ 57 ఏళ్ల పాటు ప్రజాజీవితంలో ఉన్నారని గులాంనబీ గుర్తుచేశారు. దేశంలో అందరు ప్రధానులతో మాట్లాడిన అనుభవం కరణ్ సింగ్ సొంతమని ఆయన తెలిపారు. నాలుగు సార్లు లోక్‌సభ నుంచి నాలుగు సార్లు రాజ్యసభ నుంచి ప్రాతినిధ్యం వహించిన ఘనత ఆయనకే సొంతమని ఆజాద్ అన్నారు. ఎంతో ఉన్నతమైన రాజవంశంలో జన్మించినప్పటికీ, రాజకీయాల్లో అత్యున్నత పదవులు నిర్వహించినప్పటికీ ఆయన మద్యం, సిగరెట్ల జోలికి పోలేదని ఆజాద్ గుర్తుచేశారు. కనీసం పాన్‌కు కూడా ఆయన దూరంగా ఉన్నారని పొగడ్తల వర్షం కురిపించారు. బిజెపి సభ్యుడు, కేంద్ర న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ కరణ్‌సింగ్ రచనా ప్రతిభను ప్రశంసించారు. ఆయనను తిరిగి రచనలు చేయాలని కోరారు. అదే విధంగా 72 ఏళ్ల జనార్దన్ త్రివేది రాజ్యసభ నుంచి ఆయన మూడుసార్లు ప్రాతినిధ్యం వహించారు. ప్రజా జీవితంలో చాలా ఏళ్లు గడిపారు. ఆయనపైనా సభ్యులు ప్రశంసలు వర్షం కురిపించారు.

## లోక్‌పాల్‌పై తాత్సారమెందుకు?



**న్యూఢిల్లీ:** లోక్‌పాల్ నియామకంలో కేంద్ర ప్రభుత్వం కాల యాపన చేస్తున్నదని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ధ్వజమెత్తారు. గత నాలుగేళ్లుగా దీ ని ఏర్పాటు పట్ల ప్రభుత్వం నిర్ల క్ష్యంగా వ్యవహరిస్తున్నదని విమ ర్శిం చారు. ఇంకా ఎంతకాలం కాలయాపన చేస్తారని ప్రశ్నించారు. 'నాలుగేళ్లు గడిచిపోయిం ది, కాని లోక్‌పాల్ మాత్రం ఏర్పాటు కాలేదు. ఇంకా ఎంత కా లం సాగదీస్తారు? అని ప్రజలు ఇప్పుడు ఒకే ఒక్క ప్రశ్న అడుగుతున్నారు' అని పేర్కొన్నారు. మీరు ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేవారా? లేక బాధ్యతారాహిత్యంతో వ్యవహరించేవారా? అని రాహుల్ ట్విటర్‌లో ప్రశ్నించారు. ప్రభుత్వ సంస్థల్లో అవినీతి ఆరోపణలపై విచారణ జరిపేందుకు లోక్‌పాల్, లోకా యుక్త చట్టం 2013 ప్రకారం అంబుడ్స్‌మెన్‌లను కేంద్రం నియమించాల్సివుందని అన్నారు.

## ప్లీజ్, థాంక్యూ పదాలు నేర్చుకోండి

- **ఇండిగో సిబ్బందికి పార్లమెంట్ కమిటీ హితవు**



**న్యూఢిల్లీ:** ప్రయాణికుల పట్ల ఇండిగో ఎయిర్‌లైన్స్ సిబ్బంది దురుసు ప్రవర్తనను పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఖండించింది. ఇటీవల ఇండిగో సిబ్బంది ఓ ప్రయాణికుడి పట్ల దురుసుగా వ్యవహరించి చేయి చేసుకున్న సంఘటనను ప్రస్తావిస్తూ.. 'వారు (ఇండిగో సిబ్బంది) దయచేసి...కృతజ్ఞతలు.. వంటి పదాలను నేర్చుకోవాలి' అని సూచించింది. 'ఇటీవల తరచూ ఎయిర్‌లైన్స్ సిబ్బంది, గ్రౌండ్, కేబిన్ సిబ్బంది కూడా ప్రయాణికుల పట్ల అమర్యాదగా ప్రవరిస్తున్నారని, దాడులకు దిగుతున్నారని, ఇందులో కొద్దిమంది మీడియాకు చెబుతున్నారని, చాలా మంది మౌనంగా వెళ్లిపోతున్నారని కమిటీ పేర్కొంది. ఎయిర్‌లైన్స్ సిబ్బంది దుందుడుకు తనంతో ఉంటున్నారని, ప్రత్యేకించి ఇండిగో సిబ్బంది వ్యవహార శైలి ఖండించ దగినదిగా ఉంటున్నదని వివరించింది. ప్రయాణికులపై సహాయకారిగా ఉండడం లేదని, చాలా సందర్భాల్లో మొరటుతనంతో ఉంటున్నారని వివరించింది. 'ఎయిర్‌లైన్స్ ప్రయాణికులకు మెరుగైన సేవలను అందించేందుకు సంబంధించిన అంశాలు' పేరుతో రూపొందించిన 26 పేజీల నివేదికలో పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీపై వివరాలను పేర్కొంది. ఈ వ్యవహార శైలిపై సంబంధిత సిబ్బందిపై కేవలం కఠిన చర్యలు తీసుకోవడం వల్ల సమస్యలు పరిష్కారం కావని పేర్కొంది. సిబ్బంది వల్ల ఉత్పన్నమయ్యే సమస్యలు వ్యక్తిగతం కావని, ఇవి సంస్థకు సంబంధించినవి, అందువల్ల ప్రయాణికులతో సిబ్బంది స్నేహ భావంతో మెలిగాలని కమిటీ సూచించింది. కాగా, కమిటీ వివిధ ఎయిర్‌లైన్స్ సంస్థలకు చెందిన సిఇఒలతో సుదీర్ఘంగా చర్చించింది.

# కన్న కొడుకు కర్కశత్వం

- **అనారోగ్యంతో బాధపడుతున్న తల్లిని భవంతిపై నుంచి నెట్టేసి దారుణ హత్య**
- **గుజరాత్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్ అమానుష చర్య**



**రాజ్‌కోట్:** గుజరాత్‌లో ఓ అసిస్టెంట్ ప్రొఫెసర్ దారుణానికి ఒడిగట్టాడు. అనారోగ్యం పాలైన తన తల్లికి సేవలు చేయలేక భవనం పైకి తీసుకెళ్లి తోసేసాడు. గత సెప్టెంబర్‌లో ఈ ఘటన జరగగా, ఇది హత్య అని ఓ అజ్ఞాత వ్యక్తి ఫిర్యాదు చేయడంతో ఆల స్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ కేసులో నింది తుడిని గురువారం అరెస్టు చేశారు. రాజ్‌కోట్‌లో స్థానికంగా ఉన్న ఫార్మసీ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న సందీప్ నత్వాని సెప్టెం బర్ 29న తన తల్లి జయశ్రీబెన్‌ను హతమార్చినట్లు పోలీసులు తెలిపారు. అయితే అనారోగ్యం వల్లే తన తల్లి భవనం పై నుంచి పడిందని సందీప్ కట్టుకథ చెప్పా దన్నారు. జయశ్రీబెన్ మొదడుకు సంబంధిం చిన వ్యాధితో బాధపడుతున్నారని, ఈ నేపథ్యం లో ఆమె అదుపుతప్పి భవనం పైనుంచి కింద పడిపోయిందని అప్పట్లో సందీప్ బంధువు లు కూడా పోలీసులకు చెప్పారు. అయితే జయ శ్రీబెన్‌ది హత్య అని ఓ అజ్ఞాత వ్యక్తి నుంచి ఫిర్యా దు రావడంతో పోలీసులు ఆ దిశగా దర్యాప్తు చే పట్టారు. అపార్ట్‌మెంట్‌లో ఏర్పాటు చేసిన సిసి టివి ఫుటేజీలను పరిశీలించారు. సందీప్ తన త ల్లిని టెర్రాస్ నుంచి తోసేసిన దృశ్యాలు స్పష్టంగా కనిపించాయని రెండో జోన్ డిసిపి కరాంజ్‌రాజ్ వఘే లా వెల్లడించారు. దీంతో సందీప్‌ను ప్రశ్నించగా మొదట్లో అతడు తాను హత్య చేయలేదని బుకాయించాడని, ఆ తరువాత తన తల్లి మృతితో తనకు సంబంధమున్నట్లు అంగీకరించినట్లు ఆయన చెప్పారు. అనంతరం అతన్ని అదుపులోకి తీసుకొని విచారిస్తుండగా అస్వస్థతకు లోను కావడంతో సందీప్‌ను ఆసుపత్రిలో చేర్పామన్నారు. ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయిన వెంటనే అధికారికంగా సందీప్‌ను అరెస్టు చేస్తామన్నారు. అజ్ఞాత వ్యక్తి ఫిర్యాదు అందిన వెం టనే సందీప్ పై పోలీసులు ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు.

## జడ్జిగారూ..శిక్ష తగ్గించండి

- **నేడు లాలూ ప్రసాద్‌కు శిక్ష ఖరారు**



**రాంచి:** రాష్ట్రీయ జనతా దళ్ (ఆర్ జెడి) చీఫ్ లాలూప్రసాద్ యాదవ్ ఆరోగ్య పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని అతనికి తక్కువ శిక్ష విధించాలని లాలూ తరఫు న్యాయవాది శుక్రవారం రాంచిలోని సిబిఐ ప్రత్యేక కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దాణా కుంభకోణం కేసులో ప్రత్యక్షంగా తన పాత్రలేదని, వయస్సు, ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని తక్కువ శిక్ష విధించాలని లాలూ ఆ పిటిషన్‌లో విజ్ఞప్తి చేశారు.

- **గడ్డకట్టిన అమెరికా**






**అమెరికా** తూర్పు తీరాన్ని బాంబు తుఫాను గడగడలాడిస్తోంది. మంచు భారీగా కురుస్తుండడంతో ప్రయాణాలకు ఆటంకం కలుగుతోంది. వేలాది విమానాలు మంచు కారణంగా రద్దయ్యాయి. ఈ వారాంతం వరకు పరిస్థితులు ఇలాగే ఉంటాయని అమెరికా జాతీయ వాతావరణ కేంద్రం శుక్రవారం తెలియజేసింది. మంచు, శీతల గాలులు నలుగురు ప్రాణాలను బలి తీసుకుంది. అనేక ప్రాంతాలలో పాఠశాలలు మూతబడ్డాయి. అమెరికా ఈశాన్య ప్రాంతంలో కూడా మంచు విపరీతంగా కురుస్తుండడంతో ప్రజలు బయటకు రాడానికి జంకుతున్నారు. పలు ప్రాంతాల్లో మంచు కుప్పలు కుప్పలుగా పేరుకుపోయింది. కెన్నడీ విమానాశ్రయం, లా గార్డినా విమానాశ్రయాలు రన్ వే ను మూసి వేశాయి. అమెరికా కెనడా సరిహద్దులో ఉన్న ప్రపంచ ప్రఖ్యాత నయాగరా జలపాతం గడ్డకట్టుకుపోయింది. ఉష్ణోగ్రతలు మైనస్ 13 డిగ్రీలకు పడిపోయాయి.

- న్యూయార్క్



## కశ్మీర్‌లో హిమపాతం

- **ఏడుగురు గల్లంతు**

**జమ్మూకశ్మీర్:** ఉత్తర కశ్మీర్‌లోని కుప్వారా జిల్లాలో ప్రయాణికులతో వెళ్తున్న వాహనాన్ని మంచు చరియలను ఢీకొనడంతో ఏడుగురు గల్లంతయ్యారు. శుక్రవారం తంగ్‌ధార్ సెక్టార్‌లో ఘటన చోటు చేసుకుంది. శిశువు సహా ఏడుగురు వ్యక్తులతో వెళ్తున్న టాటా సుమోను మంచు చరి యలు ఢీ కొట్టాయని సీనియర్ పోలీస్ అధికారి తెలిపారు. బాధితులను రక్షించేందుకు సహాయ చర్యలు కొన సాగుతున్నాయన్నారు. వారిని వెలికి తీసిన తర్వాత పూర్తి వివరాలు వెల్లడిస్తామని ఆయన తెలిపారు. కుప్వారాలో మైనస్ రెండు డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. వచ్చే 24 గంటల్లో మంచు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. డిసెంబర్ 21 నుంచి కశ్మీర్‌లో 40 రోజులపాటు కొనసాగే తీవ్ర చలికాలంగా పిలిచే చిల్లాయ్ కలన్ మొదలైంది. ఈ సీజన్‌లో ఉష్ణోగ్ర తలు పడి పోవడంతోపాటు తీవ్ర మంచు కురుస్తుంది.



## ‘ఇండియన్-అమెరికన్లను తరిమేస్తే ప్రతిభ హుళక్కి’

**వాషింగ్టన్ :** హెచ్–1బి వీసాల పొడిగింపు ఆంక్షల వల్ల 5 లక్షల నుంచి ఏడున్నర లక్షల మంది ఇండియన్ – అమెరికన్లను వెనక్కి పంపేయడమే అవుతుందని, ఇందువల్ల అమెరికాలో ప్రతిభకు చోటు లేకుండా అవుతుందని కాంగ్రెస్ సభ్యులు, సలహా బృందాలు ట్రంప్ ప్రభుత్వ సంకల్పాన్ని విమర్శించాయి. ‘అమెరికా ఫస్ట్ (అమెరికా వస్తువులే కొనండి–అమెరికన్లనే నియమించండి)’ విధానం కింద ట్రంప్ ప్రతిపాదించిన హెచ్ –1బి వీసాల పొడిగింపు కోతపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. హోమ్ లాండ్ సెక్యూరిటీ విభాగం అధికార్లు ట్రంప్ సంకల్పానికి అనుగుణంగా ముసాయిదా సిద్ధం చేస్తున్నారు. అత్యంత ఉన్నత స్థాయి నిపుణులను విదేశాల నుంచి నియమించుకోడానికి తాత్కాలికంగానే హెచ్–1బి వీసాలను ఇచ్చే కార్యక్రమం అది. తగిన అర్హతలుగల అమెరికన్లు లభించని సందర్భంలోనే కంపెనీలు ఈ వెసులుబాటును వినియోగించుకోవాలి. హెచ్–1బి వీసాదార్లపై ఇటువంటి కఠిన ఆంక్షలు విధించడం కుటుంబాలను విడగొట్టి, మన సమాజంలో ప్రతిభాపాటవాలను కొల్లగొడుతుందని డెమొక్రాటిక్ కాంగ్రెస్ సభ్యులు తుల్సీ గబ్బార్డ్ వ్యాఖ్యానించారు. దీని ప్రభావంతో ఐదు లక్షల నుంచి ఏడున్నర లక్షల మంది భారతీయ హెచ్–1బి వీసాదార్లు వెనక్కి వెళ్లిపోతారని, మన ఆర్థిక వ్యవస్థకు గట్టి ఊతం మాయం అవుతుందని గబ్బార్డ్ విమర్శించారు.

# పాక్‌కు రక్షణ సహాయం కట్

● నిలిపివేసిన అమెరికా ● 1.15 బిలియన్ డాలర్ల స్తంభన



**వాషింగ్టన్ :** పాకిస్థాన్‌కు భద్రతా సహాయాన్ని అమెరికా శుక్రవారం నాడు స్తంభింపచేసింది. 1.15 బిలియన్ డాలర్ల సహాయం నిలిపివేసింది. ఆ దేశాన్ని నిఘాలో ఉంచుతూ ఈ చర్య తీసుకుంది. భీకర టెర్రరిస్టు బృందాలపై స్థిరమైన నిర్ణయాత్మక వైఖరి అవలంబించనందుకు ఈ చర్య తీసుకొంది. దీనితో ఆదేశానికి భద్రతా సహాయం మొత్తం నిలిపివేసినట్లు అయింది. కొత్త ఏడాది ట్వీట్‌లో అధ్యక్షుడు ట్రంప్ తమ దేశానికి పాకిస్థాన్ అబద్ధాలను, మోసాలను తప్ప ఏమీ ఇవ్వలేదని నిందించారు.పైపెచ్చు తాము ఇంతవరకూ అందించిన 33 బిలియన్ డాలర్ల సహాయానికి ప్రతిగా ఉగ్ర గ్రూపులకు పాక్ గడ్డపై స్వర్గంలాంటి ఆశ్రయం కల్పించినట్లు కూడా ట్రంప్ నిందించారు. విదేశీ సైనిక నిధుల (ఎఫ్ ఎంఎఫ్) మొత్తం 255 మిలియన్ డాలర్ల సహాయం కూడా ఈ నిలిపివేసిన భద్రతా సహాయంలో ఉంది. అదే కాకుండా అమెరికా సంకీర్ణానికి ఉద్దేశించిన900 మిలియన్ డాలర్ల రక్షణ శాఖ సిఎస్ఎఫ్ సహాయాన్ని కూడా నిలిపివేశారు. ఆయా ఉగ్ర గ్రూపులపై నిర్ణయాత్మకంగా పాకిస్థాన్ వ్యవ హరించే దాకా ఈ జాతీయ భద్రతా సహాయం నిలుపుదల కొనసాగుతుందని అధికార్లు వివ రించారు. విదేశాంగ శాఖ ప్రతినిధి హీదర్ ఈ విషయం చెప్పారు. అఫ్గాన్ తాలిబన్లు, హక్కానీ నెట్‌వర్క్ వంటి సంస్థ లపై కూడా పాక్ చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. భవిష్యత్తులో పాకిస్థాన్ ఈ నిలిపివేసిన సహాయం మొత్తాన్ని తిరిగి పొం దాలంటే తాము చెప్పిన విధంగా ఉగ్ర స్థావరాలను తొలగించాలని ఆయన సూచించారు.

## కాబుల్‌లో ఆత్మాహుతి దాడి, 11 మంది దుర్మరణం

**కాబూల్:** ఇక్కడ శుక్రవారం నాడు ఆత్మాహుతి బాంబర్ తనను తాను పేల్చుకోవడంతో 11 మంది మరణించగా, 25 మంది గాయపడ్డారు. అఫ్గాన్ రాజధానిలో సాగుతున్న హింసాత్మక దాడుల్లో ఇది తాజాది. ఈ పేలుడుకు తాము బాధ్యులమని ఇంకా ఏ ఉగ్రవాద సంస్థ ప్రకటించలేదు. మద్యం అక్రమ రవాణా దుండగులను పట్టుకునే ప్రయత్నంలో పోలీసులు ఒక దుకాణదారుని చంపారు. దానికి నిరసన ప్రదర్శనలో ఈ బాంబు దాడి చోటు చేసుకుంది. అక్కడ భద్రతా పనిలో ఉన్న పోలీసులను గురిపెట్టి ఆత్మాహుతి బాంబర్ తనను తాను పేల్చుకున్నాడు. మృతుల సంఖ్య పెరిగే ప్రమాదం ఉంది. ముస్లింలు మెజారిటీలో గల ఆ దేశంలో అఫ్గాన్‌లు మద్యం సేవించడాన్ని, రవాణా చేయడాన్ని నిషేధించారు.

## 31న సంపూర్ణ చంద్ర గ్రహణం



**న్యూఢిల్లీ:** ఈ ఏడాది మొట్ట మొదటి గ్రహణం జనవరి 31 న ఏర్పడనుంది. ఆ రోజు సంపూర్ణ చంద్ర గ్రహణం వలన ఈ నెలలో రెండవ సారి పాడ్యమి ఏర్పడుతుంది. 150 ఏళ్లలో ఇలా జరగడం ఇదే ప్రథమం. ఫసిపిక్ మహా సముద్రం చంద్ర గ్రహానికి ఎదురుగా తిరుగుతుంది. భారత్ తదితర చోట్ల గ్రహణానికి సూచనగా చంద్రుడు పైకి లేవడం జరుగుతోంది. సాయంత్రం ఆకాశంలో ఈ అద్భుతాన్ని తూర్పు ఆసియా,ఇండోనేషియా, న్యూజిలాం డ్, ఆస్ట్రేలియాలో చాలా భాగం నేరుగా చూడవచ్చు. అలాస్కా, హవాయి, కెనడాలో కొంత భాగంలో ఈ గ్రహణం పట్టువిడుపుల దాకా సమగ్రంగా చూడవచ్చు. ఈ గ్రహణం 17 నిమిషాల పాటు ఉంటుంది.

## ట్రక్కును ఢీ కొన్న రైలు : 18 మృతి

**254 మందికి గాయాలు – మంటల్లో బోగీలు**




**క్రూన్‌స్టాడ్:** దక్షిణాఫ్రికాలో ఒక లెవల్ క్రాసింగ్ వద్ద ప్రయాణీకుల రైలు ట్రక్కును ఢీ కొట్టడంతో కనీసం 18 మంది మరణించారు. 254 మంది గాయపడ్డారు. ఈ ప్రభావంతో ఆ రైలుకు సంబంధించిన అనేక బోగీలు పట్టాల మీంచి దూరంగా విసిరివేయబడ్డాయి. శిథిల బోగీలలోంచి మంటలు లేచాయి. నల్లటి పొగ దట్టంగా గాలిలోకి లేచి ప్రయాణీకులు నిస్సహాయ స్థితిలో హాహాకారాలు చేశారు. ఆ రైలు పోర్ట్ ఎలిజబెత్ నుంచి జోహన్నెస్ బర్గ్‌కు వెళుతుండగా ఈ ప్రమాదం సంభవించింది. 12 బోగీలు పక్కకు ఒరిగిపోయి ఒకటి పూర్తిగా కాలిపోయింది.

## సల్మాన్‌కు గ్యాంగ్‌స్టర్ వార్నింగ్



**న్యూఢిల్లీ:** బాలీవుడ్ హీరో సల్మాన్ ఖాన్‌ను ఓ గ్యాంగ్‌స్టర్ బెదిరించాడు. ఈ ఘటన శుక్రవారం జోద్‌పూర్ కోర్టులో జరిగింది.1998లో జరిగిన కృష్ణజింక కేసులో విచారణకు హాజరయ్యేందుకు సల్మాన్ జోద్‌పూర్ కోర్టుకు వచ్చారు. అయితే అక్కడే ఉన్న గ్యాంగ్‌స్టర్ లారెన్స్ విష్ణోయ్.. సల్మాన్‌ను బెదిరించినట్లు సమాచారం. ఏ కారణం చేత సల్మాన్‌ను గ్యాంగ్‌స్టర్ బెదిరించారన్న విషయం ఇంకా వెల్లడికాలేదు. గ్యాంగ్‌స్టర్ విష్ణోయ్‌ను భారీ సెక్యూర్టీ మధ్య కోర్టు ముందు ప్రవేశపెట్టారు. బెదిరింపు కేసులోనే అతను జైలుకు వచ్చాడు. అయితే సల్మాన్ కోర్టుకు వచ్చిన సమయంలో అక్కడే ఉన్న గ్యాంగ్‌స్టర్ విస్ణోయ్ మళ్లీ బెదిరింపులకు పాల్పడినట్లు తెలుస్తున్నది. కృష్ణజింకల కేసులో వరుసగా రెండవ రోజు సల్మాన్ కోర్టుకు హాజరయ్యాడు. ఈ కేసులో సెప్టెంబర్ 13 నుంచి తుది విచారణ ప్రారంభమైంది.

## ఆరుగురు విద్యార్థులు దుర్మరణం



**ఇండోర్ :** మధ్యప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఇండోర్ కనాడియ లో శుక్రవారం మధ్యా హ్నం స్కూల్ బస్సు, ట్రక్ ఢీ కొన్న ఘటనలో ఆరుగురు చిన్నారులు సహాడ్రైవ ర్ దుర్మర ణం చెందారు. ఇండోర్‌లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ బస్సు విద్యార్థులతో వెళుతుండగా, ఎదురుగా వస్తున్న ట్రక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో స్కూల్ బస్సు ముందు భాగం నుజ్జు నుజ్జు అయింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడినవారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఇందుకు సంబంధించి పూర్తి వివరాలు తెలి

## ఇసుక మాఫియాపై చోద్యం : టిడిపి

**మన తెలంగాణ**/హైదరాబాద్ : ఇసుక మాఫియా చేలరేగిపోతుంటే ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని టిడిపి అధికార ప్రతినిధి అనుషరామ్ అన్నారు. ట్రాక్టర్లతో తొక్కించి చంపుతున్నా చోద్యం చూస్తున్నారని, ఇసుక మాఫియా అధికంగా మంత్రి కె. తారకరామారావు జిల్లాలోనే ఉందని ఆమె ఆరోపించారు. ఎన్‌టిఆర్ భవన్‌లో శుక్రవారం అనూషరామ్ మీడియాతో మాట్లాడారు. నేరెళ్లలో ఇసుక దుర్ఘటన మరిచిపోక ముందే కామారెడ్డి జిల్లాలో ఇసుక మాఫియా మళ్లీ రెచ్చిపోయిందని, ఇందుకు ప్రభుత్వ ఉదాసీనతే కారణమన్నారు. నోరు మెదిపితే బాధిత కుటుంబాల మహిళలపై బ్రోకర్ కేసులు పెడతామని పోలీసులు బెదిరిస్తున్నారన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఇసుక అక్రమార్కులపై కఠిన చర్యలకు దిగి వాటిని అరికట్టకపోతే టిడిపి ప్రత్యక్ష కార్యాచరణ చేపడుతుందన్నారు. ఇదిలా ఉండగా గురువారం ప్రారంభమైన మొదటి విడత టిడిపి శిక్షణ తరగతులు శుక్రవారం ముగిసాయి. ఈ కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షులు ఎల్. రమణ హాజరయ్యారు. యాల్సి ఉంది.

## బోధన్‌లో మరో భరత్‌రెడ్డి!

**మనతెలంగాణ**/బోధన్: పెద్ద హనూమాన్ మందిర్ చైర్మన్‌గా కొనసాగుతున్న గుమ్ముల అశోక్‌రెడ్డి అశోక్ అనే రజక కులస్తున్ని నోటితో చెప్పరాని అసభ్యకర మాటలతో దూషిస్తూ పెట్రోల్ పోసి కాల్చేస్తానట్టు చేసిన హెచ్చరికలు సోషల్ మీడియాలో సంచలనం రేకేత్తించింది. ఇటీవల కాలంలో ఒక దళిత యువకుడిని మారుతి మందిర్‌లోకి ప్రవేశించకూడదని ఆంక్షలు విధిస్తూ హెచ్చరికలు జారీ చేయడంతో సదరు వ్యక్తి కంటతడి పెట్టుకుని వెళ్ళిపోయినట్టు స్థానికులు పేర్కొన్నారు. తాను చెప్పింది వినాల్సిందేనంటూ హుకుం జారీ చేసేవాడని ,తిరగబడ్డ వారి పట్ల బెదిరింపులు, దాడులకు సైతం పూనుకుంటాడని పలువురు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో బోధన్ పట్టణానికి చెందిన చాకలి కులానికి చెందిన ఒక వ్యక్తిని పెట్రోల్ పోసి కాల్చేస్తానంటూ బెదిరించిన ఆడియో పుటేజ్ శుక్రవారం వైరల్ అయింది. ఇలాంటి వివాదాస్పద వ్యక్తికి మారుతి మందిర్ చైర్మన్ పదవిని ఎలా కట్టాబెట్టారంటూ పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం దవాఖనాలో సైతం ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్న సదరు వ్యక్తి దవాఖనాలో సైతం అధికార పార్టీ అండదండాలతో తాను చెప్పిందే నడవాలని హుకుం జారీ చేస్తాడని పలు విమర్శలు సైతం ఉన్నాయి. ఇంత జరుగుతున్నా స్థానిక ఎమ్మెల్యే స్పందించకపోవడం గమనార్హం.

## రెటీనా ఔషధానికి రూ.5.4కోట్లు!



**వాషింగ్టన్ :** కంటి వ్యాధుల్లో ఒకటైన రెటీనా(కంటి పొర) సమస్యను పరిష్కరించి, అంధత్వ సమస్యను శాశ్వతంగా నయం చేసే ఔషధానికి అయ్యే ఖర్చు అక్షరాల రూ.5.4కోట్లు(8.5లోలక్షల డాలర్లు)గా నిర్ధారించారు. అమెరికాలో రూపొందించిన ఈ ఔషధం ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన ఔషధాల్లో ఒకటి. వంశపారంపర్యంగా సంక్రమించే కంటి పొరకు సంబంధించిన వ్యాధిని నయం చేసేందుకు వినియోగించే ఔషధం లక్సటర్నా. ఔషధ తయారీ సంస్థ ఫిలడెల్ఫియాకు చెందిన స్పార్క్ థెరప్యూటిక్స్ చెబుతున్నదాని ప్రకారం ఒక్క డోస్‌తో రెటీ నా సమస్యను నియంత్రించవచ్చు. ఈ ఔషధం కోసం ఒక్కో కంటికి రూ.2.70 కోట్లు (4.25 లక్షల డాలర్లు) ఖర్చు అవుతుంది. ఇప్పటికే గత డిసెంబర్‌లో ఇది ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్‌డిఎ) ఆమోదం పొందింది. వినూత్నమైన ఈ చికిత్స కోసం వినియోగించే ఔషధం ఖరీదుపై అమెరికా ప్రభుత్వంతో చర్చలు జరిపి ఆ తర్వాత ప్రకటించింది. ఒకవేళ ఈ ఔషధం ప్రభావం చూపలేదని రోగులు భావిస్తే నగదు తిరిగి చెల్లించేందుకు సిద్ధమ ని స్పార్క్ హామీ ఇచ్చింది. ఇప్పటికే లుకేమియాతో బాధపడేవారికి చికిత్స అందించేందుకు నోవర్టిస్ కంపెనీ దాదాపు రూ.3 కోట్ల ఖరీదైన కిమ్‌రియా ఔషధాన్ని విక్రయిస్తోంది.

## ఇరాన్‌పై అమెరికా తాజా ఆంక్షలు

**టెహ్రాన్ సమీపంలో ప్రభుత్వ అనుకూల ర్యాలీలు**

**టెహ్రాన్:** వారం రోజులుగా సాగిన నిరసన ప్రదర్శనలకు స్వస్తి పలుకుతూ ప్రభుత్వ అనుకూల ర్యాలీలు ఇరాన్ వివిధ ప్రాంతాల నుంచి రాజధాని టెహ్రాన్‌ను ఏ క్షణంలోనైనా చేరుకోడానికి సిద్ధంగా ఉన్నాయి. ఈలోగా అమెరికా ఇరాన్‌పై తాజా ఆంక్షలను విధించింది. ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి అత్యవసర సమావేశానికై అమెరికా డిమాండ్ చేసింది.శుక్రవార పార్థనల తర్వాత టెహ్రాన్ చుట్టుప్రక్కల 40ర్యాలీలు ప్రభుత్వానికి అనుకూలంగా జరిగాయి. గత రెండు రోజులుగా ప్రభుత్వ అనుకూల భారీ ర్యాలీలు అనేక నగరాల్లో చోటు చేసుకున్నాయి. అక్రమంగా ఖండాంతర క్షిపణి ప్రయోగాలు జరుపుతున్నట్లు అనుమానం ఉన్న ఐదు ఇరానీయన్ సంస్థలపై అమెరికా తాజాగా ఆంక్షలతో విరుచుకుపడింది. ఇరాన్ ప్రజల ఆర్థిక పురోభివృద్ధిని పక్కనపెట్టి ఈ క్షిపణి కార్యక్రమానికి ఇరాన్ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నది అమెరికా ఆరోపణ.ఆర్థిక సమస్యలకు వ్యతిరేకంగా ప్రదర్శనలను అమెరికాయే రెచ్చగొట్టిందని ఇరాన్ ప్రభుత్వం ఆరోపిస్తోంది. శుక్రవా రం కూడా చిన్న స్థాయిలో ప్రభుత్వ వ్యతిరేక ప్రదర్శనలు అక్కడక్కడ జరిగాయి.మొత్తం 21 మంది నిరసన ప్రదర్శనల్లో చనిపోయారు.

## రూ.9 కోట్ల విలువైన వొడ్కాబాటిల్‌ను ఎత్తుకెళ్లారు!



**కోపెన్ హగెన్:** అత్యంత ఖరీదైన వస్తువు అపహరణకు గురైన సంఘటన డెన్మార్క్‌లోని వెస్టెబ్రోలో చోటు చేసు కుంది. కేఫ్ 33 బారులో రూ.9 కోట్ల విలువైన వొడ్కా బాటిల్‌ను దొంగలు ఎత్తుకెళ్లారు. దీంతో బారు యజమాని బ్రియాన్ ఇంగ్ బర్గ్ స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశాడు. దొంగ మాస్క్ ధరించి వొడ్కాబాటిల్ ను దొంగలించాడు. ఈ బాటిల్ ను మూడు కిలోల బంగారం, మూడు కిలోల వెండి తో తయారు చేసినట్టు బారు యాజమాని తెలిపాడు. ప్రస్తుతం తమ బారులో 1200 బాటిళ్లు ఉన్నాయని వాటిలో ఈ బాటిల్ అత్యంత విలువైందని చెప్పాడు. ఇలాంటి ఘటన జరగడం అత్యంత దురదృష్టకరమని చెప్పాడు. పోలీసులు కేసు నమోదు చేసి దుండగుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

# ఉభయ కొరియాల చర్చలకు కిమ్ సమ్మతి

● ఉద్రిక్తతల సడలింపులో ముందడుగు

● అమెరికా, సియోల్ విన్యాసాలు వాయిదా



**సియోల్ :** దక్షిణ కొరియాపట్ల ఉత్తర కొరియా నేత కిమ్ జోంగ్ యున్ సానుకూల వైఖరి కనపర్చడంతో వచ్చే వారం ఇరు దేశాల మధ్య చర్చల ప్రతిపాదన ఫలించనుంది. చర్చలకు దక్షిణ కొరియా చేసిన ప్రతిపాదనకు అణ్వాయుధ సంపన్న దేశం ఉత్తర కొరియా సమ్మతి తెలిపింది. శీతాకాల ఒలింపిక్స్ ముగిసేదాకా ఉమ్మడి సైనిక విన్యాసాలను వాయిదా వేయాలని అమెరికా, దక్షిణ కొరియా నిర్ణయించిన కొన్ని గంటలకు ఉత్తర కొరియా ఈ ప్రకటన చేసింది. తమ ఉమ్మడి విన్యాసాలు ఉద్రిక్తతలకు, ఉత్తర కొరియా రెచ్చిపోవడానికి దారితీస్తున్నాయని ఆ ఇరు దేశాలు భావించాయి. 2015 డిసెంబర్ తర్వాత ఇదే తొలిసారిగా ఉత్తర, దక్షిణ కొరియాల మధ్య పాన్‌మున్ జోమ్‌లో చర్చలు జరగనున్నాయి. అది నిస్సైనిక మండలం. ఆ ప్రాంతం ఉభయ దేశాల సరిహద్దుల్లో విభజన రేఖగా ఉంది. 2017లో ఉత్తర కొరియా వరుసవెంబడి క్షిపణి ప్రయోగాలు జరపడంతో ఉద్రిక్తతలు ఆ ద్వీపకల్పంలో నెలకొన్నాయి. వాటిలో ఖండాంతర క్షిపణి పరీక్షలు కూడా ఉన్నాయి. 6వ అణు పాటవ పరీక్ష కూడా 2017లో ఉత్తర కొరియా చేసింది. ఉద్రిక్తతల నివారణకు తాత్కాలిక యత్నం ఉత్తర కొరియా చొరవవల్ల ఫలించనుంది. నూతన సంవత్సర సందేశంలో కిమ్ అమెరికాను తీవ్రంగా బెదిరించారు. తన బల్ల మీద గల మీట నొక్కితే అమెరికా తుత్తునియలు అయిపోతుందని ఆ సందేశంలో అన్నారు. అందుకు ప్రతిగా తన బల్ల మీద మీట బాగా పని చేస్తుందని ట్రంప్ అన్నారు. ఇటువంటి పరస్పర కవ్వింపు ప్రకటనల మధ్య వచ్చే వారం ఉభయ కొరియాల చర్చలు జరగనున్నాయి. దక్షిణ కొరియాలో జరగనున్న శీతాకాల ఒలింపిక్స్ పియోంగ్ చాంగ్ నగరంలో ఫిబ్రవరి 9న ప్రారంభం కానున్నాయి. వాటిలో ఉత్తర కొరియా పాల్గొంటోంది.

# రీసైక్లింగ్ చేసి ప్రభుత్వానికే అమ్మారు

● రేషన్ బియ్యంపై ప్రత్యేక తనిఖీల్లో వెలుగుచూసిన అక్రమాలు

**మన తెలంగాణ**/హైదరాబాద్ : కొందరు మిల్లర్లు రేషన్ బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి తిరిగి పౌరసరఫరాల శాఖకే అమ్మిన వైనం వెలుగులోకి వచ్చింది. బియ్యం నాణ్యత విషయంలో కమిషనర్ సి.వి.ఆనంద్ నేతృత్వంలో గత కొన్ని రోజులుగా అత్యంత గోప్యంగా పౌరసరఫరాల శాఖ నిఘా బృందాలు, సాంకేతిక సిబ్బందితో గోదాములలో ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ తనిఖీలలో నాగర్ కర్నూల్‌తోపాటు సిరిసిల్ల జిల్లాల్లో అక్రమాలు వెలుగు చూశాయి. రేషన్ బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి తిరిగి ప్రభుత్వానికే విక్రయిస్తున్నట్లు ఈ తనిఖీల్లో బహిర్గతమైంది. మొత్తం 1,080(50 కెజిల) బస్తాలు రేషన్ బియ్యాన్ని గుర్తించారు. దీని విలువ సుమారు రూ.15 లక్షల వరకు ఉంటుంది. నాగర్‌కర్నూల్ జిల్లాలో శ్రీరాములుకు చెందిన శ్రీనివాస రైస్ మిల్, మల్లేష్‌కు చెందిన వెంకటేశ్వర రైస్ ఇండస్ట్రీస్‌లలో రేషన్ బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి అమ్మినట్లు అధికారులు గుర్తించారు. ఎవరికీ ఏమాత్రం అనుమానం రాకుండా పకడ్బందీగా పథకం ప్రకారం ఒక్కో లారీలో కొన్ని రీసైక్లింగ్ చేసిన బస్తాలను కలిపినట్లు తేలింది. ఒక్కో లారీలో 400 నుంచి 500 బ్యాగులు ఉన్నట్లు వెల్లడైంది. ఈ బ్యాగుల్లో ఎవరికీ అనుమానం రాకుండా ఎసికె నెం.131,136,137,149,163,165లలో1,080 బస్తాల రీసైక్లింగ్ చేసి రేషన్ బియ్యాన్ని కలిపేశారు. నాగర్ కర్నూల్ జిల్లాలో ఈ నెల నుంచి ఇ–పాస్ విధానం అమలులోకి రావడంతో రేషన్ బియ్యం బ్లాక్ మార్కెట్‌కు తరలించడం సాధ్యం కాదన్న ఉద్దేశంతో అంతకుముందే రేషన్ డీలర్ల నుంచి బియ్యం కొనుగోలు చేసి నిల్వ ఉంచుకున్నారు. ఆ బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి అప్పగించినట్లుగా అధికారులు గుర్తించారు. రేషన్ బియ్యం రీసైక్లింగ్‌పై నిఘా బృందం ద్వారా సమాచారం అందుకున్న కమిషనర్ సి.వి.ఆనంద్ నేరుగా రంగంలోకి దిగి తనదైనశైలిలో బియ్యం దొంగలను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని గోదాం ఇంఛార్జ్‌పై వేటు వేశారు. ఈ మొత్తం వ్యవహారంలో కీలక సూత్రధారులైన నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన రైస్ మిల్లర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే మిల్లులను బ్లాక్ లిస్టులో పెట్టి, నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి దొడ్డు బియ్యం, సన్న బియ్యం కొనుగోళ్ళను నిలిపివేశారు.

**సిరిసిల్లలో నాణ్యత కలిగిన సన్న బియ్యం రీప్లేస్‌మెంట్‌కు ఆదేశాలు :** సిరిసిల్ల జిల్లాలో పౌరసరఫరాల శాఖ సాంకేతిక సిబ్బంది తనిఖీలు నిర్వహించగా నాణ్యతలేని బియ్యం వ్యవహారం వెలుగులోకి వచ్చింది. నిబంధనల ప్రకారం బ్రోకెన్ రైస్ 10 శాతానికి మించి ఉండకూడదు. కాని ఇక్కడ 35 శాతం వరకు ఉన్నట్లు తనిఖీ బృందాలు గుర్తించాయి. సుమారు 11 వేల బస్తాలలోని బియ్యంలో 35 శాతం మేరకు బ్రోకెన్ రైస్ ఉన్నట్లు గుర్తించాయి. ఈ బియ్యాన్ని సరఫరా చేసిన మిల్లర్లను కమిషనర్ పిలిపించి మాట్లాడారు. మరోసారి పునరావృతమైతే బ్లాక్‌లిస్టులో పెడతామని హెచ్చరించారు. ప్రమాణాల ప్రకారం 11 వేల బియ్యం బస్తాల స్థానంలో నాణ్యత కలిగిన బియ్యాన్ని అప్పగించాలని ఆదేశించారు.

**కఠిన చర్యలు : కమిషనర్ సి.వి.ఆనంద్**

రాష్ట్ర రైస్ మిల్లర్ అసోసియేషన్‌కు తమ సభ్యులపై నిఘా లేకపోవడంపై కమిషనర్ తీవ్రంగా స్పందించారు. పేదల బియ్యాన్ని దిగమింగడానికి ప్రయత్నిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా పౌరసరఫరాల సంస్థకు సంబంధించిన బియ్యం నిల్వలు ఉన్న సిడబ్ల్యుసి (సెంట్రల్ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్), ఎస్‌డబ్ల్యుసి (స్టేట్ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్) గోదాములలో ప్రత్యేక తనిఖీలు కొనసాగిస్తామని తెలిపారు. అక్రమాలకు పాల్పడుతున్న మిల్లర్లపై క్రిమినల్ కేసుల్ని నమోదు చేయడంతో పాటు మిల్లులను సీజ్ చేస్తామని హెచ్చరించారు. పి.డి చట్టం కింద కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు.

## హైకోర్టులో ఎంఎల్‌ఎ చెన్నమనేనికి ఊరట



**మన తెలంగాణ**/ హైదరాబాద్ : వేములవాడ శాసనసభ్యుడు రమేష్ చెన్నమనేని భారత పౌరుడు కాదని కేంద్ర హోం శాఖ జారీ చేసిన ఆదేశాల అమలును హైకోర్టు ఆరు వారాలు నిలిపివేస్తూ శుక్రవారం మధ్యంతర ఆదేశాలిచ్చింది. రమేష్ పౌరసత్వానికి చెందిన రికార్డులన్నింటినీ తమ ముందుంచాలని, సమగ్ర విచారణ జరుపుతామని హైకోర్టు న్యాయమూర్తి ఎస్వీ భట్ ప్రకటించారు. కేంద్ర హోంశాఖ, రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేశారు. గత డిసెంబర్ 13న రమేష్ భారత పౌరుడు కాదంటూ కేంద్ర హోం శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. దానిని రమేష్ హైకోర్టులో సవాల్ చేశారు. ఉన్నత విద్య కోసం జర్మనీ వెళ్లిన రమేష్ అక్కడి పౌరసత్వం 1993లో పొందారని ఆయనపై ఆది శ్రీనివాస్ అనే నాయకుడు చేసిన అభియోగంలో హోం శాఖ ఆమోదం తెలిపింది. దీనిపై రమేష్‌కు హైకోర్టులో తాత్కాలిక ఊరట లభించింది. భారత పౌరసత్వం పొందాలంటే ఏడాదిపాటు భారత్‌లో ఉండాలన్నది చట్టం చెబుతోందని, ఆ విధంగా రమేష్ ఉన్నాకే పౌరసత్వం పొందారని ఆయన లాయర్ వాదన. విచారణ ఈ నెల 24కి వాయిదా పడింది.



## తక్షణమే నిమ్స్‌కు నిధులు

**మన తెలంగాణ**/న్యూఢిల్లీ: తెలంగాణలోని భువనగిరి పార్లమెంటు నియోజక వర్గ పరిధిలోని బీబీ నగర్‌లో ఏర్పాటు చేయనున్న అఖిలభారత వైద్య విజ్ఞాన సంస్థ నిర్మాణానికి వెంటనే నిధులు విడుదల చేయాలని ఎంపి బూర నర్సయ్య గౌడ్ కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జెపి నడ్డాను కోరారు. శుక్రవారం కేంద్రమంత్రితో సమావేశం అయిన ఎంపి, ఎయిమ్స్ నిధుల విడుదలలో జరుగుతున్న జాప్యంపై చర్చించారు. అనంతరం బూర నర్సయ్య గౌడ్ మాట్లాడుతూ ఈ సమావేశంలో నిధుల విడుదలలో ఎందుకు జాప్యం జరుగుతుందో చర్చించామని తెలిపారు. కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జెట్లీతో మాట్లాడి, వీలయినంత తొందరలో నిధులు మంజూరు అయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారని ఎంపి బూర నర్సయ్య గౌడ్ వెల్లడించారు. సిఎం కేసీఆర్ ఈ విషయంపై కేంద్రానికి పలుమార్లు లేఖ రాసిన విషయాన్ని, ఢిల్లీ పర్యటనకు వచ్చినప్పుడు కేంద్రప్రభుత్వం వద్ద ప్రస్తావించిన విషయాన్ని కేంద్ర మంత్రికి గుర్తుచేసానని ఎంపి తెలిపారు.

## ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేస్తాం

**పుంగనూరు :** వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఎపిఎస్ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హామీ ఇచ్చారు. 53వ రోజు ప్రజాసంకల్పయాత్రలో భాగంగా ఆయన శుక్రవారం పుంగనూరు నియోజకవర్గం సదుంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు. మరో ఏడాదిలో ఎన్నికలు జరగబోతున్నాయని చంద్రబాబు డ్రామాలు ఆడుతున్నారు.నాలుగేళ్ల పాటు పింఛన్లు ఇవ్వకుండా అన్యాయం చేసిన ఈ వ్యక్తికి ఇప్పు డు జ్ఞానోదయం అయింది. పింఛన్లు ఇవ్వడం లేదన్న విషయం ఇప్పుడే తెలిసిందని డ్రామాలు ఆడుతున్నారు. నాలుగేళ్లలో ఏ ఒక్క హామీని అమలు చేయని వ్యక్తి తనకు ఓట్లు వేయకపోతే ప్రజలు సిగ్గుపడాలని చెప్పడం దుర్మార్గం. చిత్తూరు జిల్లా కు చంద్రగ్రహణం పట్టుకుని,అభివృద్ధి ఆగిపోయింది. నాలుగేళ్లలో చంద్రబాబు చేసిందేమీ లేదు.



మన తెలంగాణ
12
హైదరాబాద్
శనివారం
6, జనవరి 2018
www.manatelangana.news

## హెచ్‌సిఎ కార్యదర్శి పదవి నుంచి శేష్‌నారాయణ్‌కు ఉద్వాసన!

**మన తెలంగాణ/** హైదరాబాద్: హైదరాబాద్ క్రికెట్ సంఘంలో మరోసారి ఆధిపత్య పోరాటానికి తెరలేచింది. ఇంతకుముందు అప్పటి అధ్యక్షుడు అర్షద్ అయూబ్‌కు ఇతర సభ్యుల మధ్య ప్రతిరోజు వివాదాలు జరుగుతూనే ఉండేవి. తాజాగా మరోసారి ఇటువంటి పరిణామాలే హైదరాబాద్ క్రికెట్ సంఘంలో నెలకొన్నాయి. హైదరాబాద్ క్రికెట్ సంఘం కార్యదర్శిగా కొనసాగుతున్న శేష్‌నారాయణ్‌ను ఆ పదవి నుంచి సస్పెండ్ చేశాడు. ఈ మేరకు హైదరాబాద్ క్రికెట్ సంఘం అధ్యక్షుడు జి.వివేకానంద్ ఉత్వర్వులు జారీచేశారు. సుప్రీం కోర్టు నియమ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నందున అతన్ని కార్యదర్శి పదవి నుంచి తొలగించినట్టు వివేకానంద్ శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. శేష్‌నారాయణ్‌ను కార్యదర్శి పదవి నుంచి తొలగించేందుకు పాలక మండలి సభ్యులు అంగీకరించినట్టు తెలిసింది. శుక్రవారం అత్యవసరంగా భేటి అయిన సభ్యులు కార్యదర్శి పదవి నుంచి శేష్‌నారాయణ్‌ను తొలగించేందుకు నిర్ణయించారు. అపెక్స్ కమిటీ నిబంధనలకు తూట్లు పొడుస్తూ కార్యదర్శి ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారని సభ్యులు ఆరోపించారు. దీంతో అతన్ని ఆ పదవి నుంచి తొలగించేందుకు అధ్యక్షుడు అంగీకరించారు.







ట్రోఫీతో హిమాచల్ జట్టు



పురుషుల విభాగంలో మూడోస్థానంలో నిలిచిన కర్నాటక

## మహిళా విజేత హిమాచల్

### జాతీయ సీనియర్ కబడ్డీ చాంపియన్‌షిప్

**మన తెలంగాణ**/హైదరాబాద్: జాతీయ సీనియర్ కబడ్డీ చాంపియన్‌షిప్ మహిళల విభాగంలో హిమాచల్ ప్రదేశ్ జట్టు విజేతగా నిలిచింది. శుక్రవారం హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన ఫైనల్లో హిమాచల్ ప్రదేశ్ 38–25 తేడాతో రైల్వేస్ జట్టును ఓడించింది. ప్రారంభం నుంచే హిమాచల్ ఆధిపత్యం చెలాయించింది. నిధి, పుష్ప అద్భుతంగా ఆడుతూ జట్టును ఆదుకున్నారు. హిమాచల్ దూకుడుగా ఆడుతూ ఏ దశలోనూ ప్రత్యర్థిని కోలుకోనివ్వలేదు. ప్రథమార్ధంలో హిమాచల్ 17–11 ఆధిక్యంలో నిలిచింది. ద్వితీయార్ధంలో కూడా అదే దూకుడును కొనసాగించింది. ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా ఆడిన హిమాచల్ 38–25తో గెలిచి జాతీయ చాంపియన్‌గా అవతరించింది. కాగా, పురుషుల విభాగంలో కర్నాటక జట్టు కాంస్య పతకం గెలుచుకుంది. మూడో స్థానం కోసం జరిగిన పోరులో హర్యానాను ఓడించింది. అనంతరం జరిగిన కార్యక్రమంలో విజేత జట్లకు అంతర్జాతీయ కబడ్డీ సమాఖ్య అధ్యక్షుడు జనార్ధన్ సింగ్ గెహ్లాట్, భారత కబడ్డీ సమాఖ్య అధ్యక్షులు డాక్టర్ మృదుల్ భాదూరియా ట్రోఫీని బహూకరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ కబడ్డీ సంఘం అధ్యక్ష కార్యదర్శులు కాసాని జ్ఞానేశ్వర్, జగదీశ్వర్ యాదవ్, శాట్స్ చైర్మన్ అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆస్ట్రేలియా ఓపెన్‌కు సెరెనా దూరం

**మెల్‌బోర్న్:** అమెరికా దిగ్గజం, డిఫెండింగ్ చాంపియన్ సెరెనా విలియమ్స్ సీజన్ తొలి గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్ ఆస్ట్రేలియా ఓపెన్‌కు దూరంగా ఉండాలని నిర్ణయించింది. చాలా కాలంగా ఆటకు దూరంగా ఉన్న తాను అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలు ఇంకా అందుకోలేదని, దీంతో తాను మళ్లీ పూర్వ వైభవం సాధించేందుకు కొంత సమయం పడుతుందని సెరెనా పేర్కొంది. ఇటువంటి పరిస్థితుల్లో ప్రతిష్టాత్మకమైన టోర్నీలో పాల్గొని పేలవమైన ప్రదర్శన కనబరిచే బదులు దూరంగా ఉండడమే మంచిదని తెలిపింది. తన కోచ్ కూడా ఇదే సూచించాడని, దీంతో ఆస్ట్రేలియా ఓపెన్‌కు దూరంగా ఉండడమే మంచిదనే నిర్ణయానికి వచ్చినట్టు వివరించింది. కాగా, ఇటీవల జరిగిన అబుదాబి ఓపెన్‌లో పాల్గొన్న సెరెనా తొలి రౌండ్‌లో ఓటమి చవిచూసింది. కాగా, త్వరలోనే తాను ఫాంను అందుకుంటానని, మిగిలిన టోర్నీల్లో బరిలోకి దిగడం ఖాయమని సెరెనా స్పష్టం చేసింది.



# తొలి రోజు బౌలర్లదే...

### చెలరేగిన భువనేశ్వర్ □ సౌతాఫ్రికా 286 ఆలౌట్ □ భారత్ 28/3 □ మొదటి టెస్టు



భువనేశ్వర్ 4/87

**కేప్‌టౌన్:** భారత్, సౌతాఫ్రికా జట్ల మధ్య శుక్రవారం ప్రారంభమైన మొదటి టెస్టులో బౌలర్ల హవా కొనసాగింది. తొలి రోజు ఏకంగా 13 వికెట్లు నేలకూలాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ చేపట్టిన దక్షిణాఫ్రికా 73.1 ఓవర్లలో 286లకే కుప్పకూలింది. భువనేశ్వర్ కుమార్ నాలుగు వికెట్లు తీసి సౌతాఫ్రికా బ్యాటింగ్ లైనప్‌ను కుప్పకూల్చాడు. తర్వాత బ్యాటింగ్ చేపట్టిన భారత్ తొలి రోజు ఆట ముగిసే సమయానికి 3 వికెట్ల నష్టానికి 28 పరుగులు చేసింది. ప్రత్యర్థి మొదటి ఇన్నింగ్స్ స్కోరును అందుకోవాలంటే భారత్ మరో 258 పరుగులు చేయాలి. ఓపెనర్లు మురళీ విజయ్ (1), శిఖర్ ధావన్ (16) నిరాశ పరిచాడు. కెప్టెన్ విరాట్ కోహ్లి కూడా (5) వెనుదిరిగాడు. దీంతో టీమిండియా పీకల్లోతూ కష్టాల్లో కూరుకుపోయింది. సౌతాఫ్రికా పేసర్లు ఫిలాండర్, స్టెయిన్, మోర్నె మోర్కెల్ తల ఒక్కో వికెట్ తమ ఖాతాలో వేసుకున్నారు. రోహిత్ శర్మ (0), చటేశ్వర్ పుజారా (5) క్రీజులో ఉన్నారు.

**భువీ ధమాకా...**

అంతకుముందు టాస్ గెలిచి బ్యాటింగ్ చేపట్టిన సౌతాఫ్రికాకు భారత స్పీడ్‌స్టర్ భువనేశ్వర్ కుమార్ తొలి ఓవర్‌లోనే దెబ్బతీశాడు. ఓపెనర్ డీన్ ఎల్గర్ (0) ఖాతా తెరవకుండానే పెవిలియన్ చేరాడు. కొద్ది సేపటికే మరో



ఓపెనర్ మక్రామ్ (5) కూడా ఔటయ్యాడు. ఈ వికెట్ కూడా భువీ ఖాతాలోకే వెళ్లింది. ఆ వెంటనే స్టార్ ఆటగాడు హాషిం ఆమ్లా(5)ను కూడా భువనేశ్వర్ పెవిలియన్ బాట పట్టించాడు. దీంతో దక్షిణాఫ్రికా 12 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయి కష్టాల్లో చిక్కుకుంది.

**ఆదుకున్న డివిలియర్స్, డుప్లెసిస్...**

ఈ దశలో ఇన్నింగ్స్‌ను కుదుట పరిచే బాధ్యతను స్టార్ ఆటగాడు డివిలియర్స్, కెప్టెన్ డుప్లెసిస్ తమపై వేసుకున్నారు. ఇద్దరు భారత బౌలర్లను దీటుగా ఎదుర్కొంటూ వికెట్ల పతనాన్ని అడ్డుకున్నారు. ఒకవైపు వికెట్లను కాపాడుకుంటూనే అడపాదడపా బౌండరీలతో స్కోరును పరిగెత్తించారు. ఈ జోడీని విడగొట్టేందుకు భారత బౌలర్లు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఇద్దరు కుదురుగా ఆడడంతో సౌతాఫ్రికా కోలుకుంది. ధాటిగా ఆడిన డివిలియర్స్ 55 బంతుల్లోనే పది ఫోర్లతో అర్ధ సెంచరీ పూర్తి చేశాడు. అయితే దూకుడుగా ఆడుతున్న డివిలియర్స్‌ను బుమ్రా బోల్తా కొట్టించాడు. బుమ్రా అద్భుత బంతితో డివిలియర్స్ (65)ను క్లీన్‌బౌల్డ్ చేశాడు. టెస్టుల్లో బుమ్రాకు ఇదే మొదటి వికెట్ కావడం విశేషం. మరోవైపు కెప్టెన్సీ ఇన్నింగ్స్ ఆడిన డుప్లెసిస్ 12 ఫోర్లతో 62 పరుగులు చేససి హార్దిక్ పాండ్య బౌలింగ్‌లో ఔటయ్యాడు. వికెట్ కీపర్ డికాక్ కూడా ధాటిగా ఆడాడు. ఏడు ఫోర్లతో 40 బంతుల్లోనే 43 పరుగులు చేశాడు. అతన్ని భువనేశ్వర్ వెనక్కి పంపాడు. తర్వాత వచ్చిన వారిలో కేశవ్ మహారాజ్ (35), రబడా (26) పరుగులు చేశారు. ఫిలాండర్ 23 పరుగులు చేసి షమి బౌలింగ్‌లో క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. భారత బౌలర్లు వరుస క్రమంలో వికెట్ల పడగొట్టడంతో సౌతాఫ్రికా ఇన్నింగ్స్ 286 పరుగుల వద్ద ముగిసింది. ఈ మ్యాచ్ ద్వారా భారత స్పీడ్‌స్టర్ బుమ్రా అంతర్జాతీయ టెస్టు క్రికెట్‌కు శ్రీకారం చుట్టాడు. అజింక్య రహానెతో పాటు సీనియర్ బౌలర్లు ఇషాంత్, ఉమేశ్‌లకు తుది జట్టులో చోటు దక్కలేదు.

**స్కోరు బోర్డు**

**దక్షిణాఫ్రికా మొదటి ఇన్నింగ్స్:** డీన్ ఎల్గర్ (సి) సాహా (బి) భువనేశ్వర్ కుమార్ 0, మక్రామ్ ఎల్బీ(బి) భువనేశ్వర్ 5, హాషిం ఆమ్లా (సి) సాహా (బి) భువనేశ్వర్ 3, ఎబి.డివిలియర్స్ (బి) జస్‌ప్రిత్ బుమ్రా 65, డుప్లెసిస్ (సి) సాహా (బి) హార్దిక్ పాండ్య 62, డికాక్ (సి) సాహా (బి) భువనేశ్వర్ 43, ఫిలాండర్ (బి) షమి 23, కేశవ్ మహారాజ్ రనౌట్ 35, రబడా (సి) సాహా (బి) అశ్విన్ 26, డేల్ స్టెయిన్ నాటౌట్ 16, మోర్నె మోర్కెల్ ఎల్బీ (బి) అశ్విన్ 2, ఎక్స్‌ట్రాలు 6, మొత్తం 73.1 ఓవర్లలో 286 ఆలౌట్.
**బౌలింగ్:** భువనేశ్వర్ కుమార్ 19–4–87–4, మహ్మద్ షమి 16–6–47–1, జస్‌ప్రిత్ బుమ్రా 19–173–1, హార్దిక్ పాండ్య 12–1–53–1, రవిచంద్రన్ అశ్విన్ 7.1–1–21–2.

**భారత్ మొదటి ఇన్నింగ్స్:** మురళీ విజయ్ (సి) ఎల్గర్ (బి) ఫిలాండర్ 1, శిఖర్ ధావన్ (సి) అండ్ (బి) స్టెయిన్ 16, చటేశ్వర్ పుజారా (బ్యాటింగ్) 5, విరాట్ కోహ్లి (సి) డికాక్ (బి) మోర్కెల్ 5, రోహిత్ శర్మ (బ్యాటింగ్) 0, ఎక్స్‌ట్రాలు 1, మొత్తం 11 ఓవర్లలో 28/3.
**బౌలింగ్:** ఫిలాండర్ 4–1–13–1, స్టెయిన్ 4–1–13–1, మోర్కెల్ 2–2–0–1, రబడా 1–0–1–0.

## రాణించిన ఖ్వాజా, స్మిత్

### ఆస్ట్రేలియా 193/2, ఇంగ్లాండ్‌తో చివరి టెస్టు



**సిడ్నీ:** ఇంగ్లాండ్‌తో జరుగుతున్న యాషెస్ చివరి టెస్టులో ఆస్ట్రేలియా దీటైన జవాబిస్తోంది. ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 346 పరుగులకు ఆలౌటైంది. తర్వాత మొదటి ఇన్నింగ్స్ చేపట్టిన ఆస్ట్రేలియా శుక్రవారం రెండో రోజు ఆట ముగిసే సమయానికి రెండు వికెట్ల నష్టానికి 193 పరుగులు చేసింది. ఓపెనర్ కామెరూన్ బెన్‌క్రాఫ్ట్ (0) ఖాతా తెరవకుండానే పెవిలియన్ చేరాడు. అయితే మరో ఓపెనర్ డేవిడ్ వార్నర్ ఇన్నింగ్స్‌ను కుదుట పరిచే బాధ్యత తనపై వేసుకున్నాడు. ఉస్మాన్ ఖ్వాజాతో కలిసి స్కోరును ముందుకు నడిపించాడు. ఇద్దరు జాగ్రత్తగా ఆడుతూ స్కోరును ముందుకు తీసుకెళ్లారు. కీలక ఇన్నింగ్స్ ఆడిన వార్నర్ ఆరు ఫోర్లతో 56 పరుగులు చేసి ఔటయ్యాడు. ఈ క్రమంలో రెండో వికెట్‌కు 85 పరుగులు జోడించాడు. వార్నర్ ఔటైనా ఖ్వాజా తన పోరాటాన్ని కొనసాగించాడు. కెప్టెన్ స్టీవ్ స్మిత్ అతనికి అండగా నిలిచాడు. వీరిని ఔట్ చేసేందుకు ఇంగ్లాండ్ బౌలర్లు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. అద్భుత బ్యాటింగ్ కనబరిచిన ఖ్వాజా ఏడు ఫోర్లు, ఒక సిక్స్‌తో 91 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. కెప్టెన్సీ ఇన్నింగ్స్ ఆడిన స్మిత్ 44 పరుగులతో నాటౌట్‌గా ఉన్నాడు. ఇద్దరు కలిసి మూడో వికెట్‌కు అభేద్యంగా వందకు పైగా భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. కాగా, ఇంగ్లాండ్ మొదటి ఇన్నింగ్స్ స్కోరును అందుకోవాలంటే ఆసీస్ మరో 153 పరుగులు చేయాలి. ఇదిలావుండగా స్మిత్ తన టెస్టు కెరీర్‌లో ఆరు వేల పరుగులను పూర్తి చేశాడు. ఈ క్రమంలో అత్యంత వేగంగా ఈ ఘనత సాధించిన రెండో బ్యాట్స్‌మన్‌గా నిలిచాడు. విండీస్ దిగ్గజం సోబర్స్ మొదటి స్థానంలో ఉన్నాడు. అంతకుముందు 233/5 ఓవర్‌నైట్ స్కోరుతో బ్యాటింగ్ చేపట్టిన ఇంగ్లాండ్ వరుసగా వికెట్లు కోల్పోయింది. వికెట్ కీపర్ బెయిర్‌స్టో (5) నిరాశ పరిచాడు. మలాన్ (66) కూడా ఎక్కువ సేపు క్రీజులో నిలువలేక పోయాడు. అయితే మోయిన్ అలీ (30), టామ్ కరణ్ (39), స్టువర్ట్ బ్రాడ్ (31) కాస్త రాణించడంతో ఇంగ్లాండ్ స్కోరు 346కి చేరింది. ఆస్ట్రేలియా బౌలర్లలో కమిన్స్ నాలుగు, స్టార్క్, హాజిల్‌వుడ్ రెండేసి వికెట్లు పడగొట్టారు.

## ఆ ప్రయత్నాలు విరమించుకోండి

**కరాచీ:** భారత్‌తో ద్వైపాక్షిక సిరీస్‌ల కోసం చేస్తున్న ప్రయత్నాలను విరమించుకోవాలని పాకిస్థాన్ మాజీ స్టార్ జావేద్ మియాందాద్ పాక్ క్రికెట్ బోర్డు (పిసిబి)కి సూచించాడు. పాక్‌తో సిరీస్‌లో ఆడేందుకు భారత్‌కు ఇష్టం లేనప్పుడూ దాని గురించి ఆలోచించడం మానుకోవాలని హితవు పలికాడు. మాటిమాటికి సిరీస్‌లు ఆడాలని భారత క్రికెట్ బోర్డును వేడుకోవడాన్ని ఇప్పటికైన విరమించాలని కోరాడు. భారత్‌కు ద్వైపాక్షిక సిరీస్‌లు ఆడడంతో ఇష్టం లేదని, అలాంటప్పుడూ వారిని బలవంతం పెట్టడం ఎందుకని పిసిని ప్రశ్నించాడు. భారత్‌తో సిరీస్‌లు ఆడనంత మాత్రాన పాకిస్థాన్ క్రికెట్ జట్టుకు వచ్చిన నష్టమేమి లేదన్నాడు. గత దశాబ్ద కాలంలో సొంత గడ్డపై ఒక్క సిరీస్ కూడా జరుగకున్న పాకిస్థాన్ జట్టు బలహీన పడలేదన్నాడు. అంతేగాక మరింత బలోపేతంగా మారిందన్నాడు. ఇందుకు ప్రతిష్టాత్మకమైన చాంపియన్స్ ట్రోఫీ విజయమే నిదర్శనమన్నాడు. భారత్‌తో సిరీస్‌లు ఆడినా అడక పోయినా పాక్‌కు ఎటువంటి ఇబ్బంది లేదన్నాడు. పదేపదే భారత బోర్డును కోరుతున్నా వారు నిర్లక్ష్యం చేస్తున్నారని, వారికి ఇష్టం లేనప్పుడూ దూరంగా ఉం డడమే ఉత్తమమన్నాడు. ఇరు దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ద్వైపాక్షిక సిరీస్‌లకు దూరంగా ఉండడమే మంచిదన్నాడు.

## తెలంగాణ బేస్‌బాల్ జట్ల ఎంపిక

**మన తెలంగాణ**/హైదరాబాద్: జాతీయ జూనియర్ బేస్‌బాల్ టోర్నమెంట్‌లో పాల్గొనే తెలంగాణ జూనియర్ జట్లను ఎంపిక చేశారు. గుజరాత్‌లో ఆదివారం నుంచి ఈ టోర్నమెంట్ జరుగనుంది. ఇందులో పాల్గొనే బాలబాలికల జట్లను రాష్ట్ర బేస్‌బాల్ సంఘం ఎంపిక చేసింది. బాలుర జట్టుకు మణికంఠ, బాలికల జట్లుకు భవిష్య కెప్టెన్లుగా ఎంపికయ్యారు. బాలుర జట్టు కోచ్‌గా శ్రీకాంత్, బాలికల జట్టు కోచ్‌గా సాయి కుమార్ ఎంపికయ్యారు.

**జట్ల వివరాలు**

**బాలుర జట్టు:** మణికంఠ (కెప్టెన్), హర్షిక్, కరణ్‌జీత్, వంశీ గౌడ్, టిమోన్, శివకుమార్, బాల్‌రాజ్, విష్ణువర్ధన్, కిరణ్, వెంకటేష్, వినేష్, మహేందర్, రోహిత్, శశికాంత్, రవి, హేమంత్.

**బాలికల జట్టు:** భవిష్య (కెప్టెన్), కొమాలికా, మౌనిక, ప్రవాళిక, శ్రావణి, ప్రియాంక, దివ్య, శిల్ప, శ్రుతి, శ్రావ్య, భాగ్యశ్రీ, నైమా కౌసర్, ప్రీతి, సుష్మ, శిల్ప, యశ్వాని.



Printed and published by K Sreenivas Reddy, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037, R.R.Dist., TELANGANA and Published from H.No.12-1-493/VA, Giriprasad Bhavan,Opp:Rajiv Swagruha Offices Complex, Bandlaguda Main Road, Nagole, R.R. Dist. and owned by M/s. Moveon Media Private Limited, **Editor: K. Sreenivas Reddy,** RNI Regn. No.TELTEL/2012/42234, Phone No/Fax:040-27655666, e-mail : editor@manatelangana.org.